తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 23.08.2026 | సంపుటి : 13 సంచిక : 34 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




# కల్తీ కంటిన్యూ.. చట్టం వీక్

## దాడులు ఎన్నైనా దందా మాత్రం ఆగదు



ప్రజలు తింటున్నది ఆహారమా.. విషమా? పాలు, నూనెలు, మసాలాలు, నెయ్యి, పండ్లు, కూరగాయలు.. ఏది కొనాలన్నా కల్తీ భయం! అధికారులు దాడులు చేస్తారు.. టన్నుల కొద్దీ కల్తీ పదార్థాలు పట్టుకుంటారు.. కేసులు పెడతారు.. కానీ కొద్దిరోజులకే అదే దందా మరోచోట మొదలవుతుంది. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కల్తీ మాఫియాకు చట్టం భయం లేకపోతే.. ఎన్ని దాడులు చేసినా ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దాడులు వార్తలుగా మిగలకూడదు. శిక్షలు హెచ్చరికగా మారాలి. తినే తిండిని విషంగా మార్చే ప్రతి కల్తీదారుడికి చట్టం గట్టి సమాధానం చెప్పాలి. ప్రజలకు ఆహారంపై నమ్మకం కలిగేలా.. కల్తీదారులకు చట్టంపై వెన్నులో వణుకు పుట్టేలా చర్యలు ఉండాలి.

పట్టుబడినా బెయిల్, జరిమానాతో బయటకు.. మళ్లీ అదే వ్యాపారం

యావజ్జీవ ఖైదు, పీడీ యాక్ట్ ప్రయోగించేలా చట్టాలను సవరించాలి


కోటి రూపాయల జరిమానా కూడా విధించాలి

ప్రజల ప్రాణాలతో చెలగాటం..

కల్తీ మాఫియాపై ఉక్కుపాదం అవసరం

ప్రస్తుత చట్టంలో 3 నెలల జైలు లేదా రూ.3లక్షల జరిమానా

హైదరాబాద్ (జనంసాక్షి) : తినే తిండే విషంగా మారుతోంది. పాలు.. నూనెలు.. మసాలాలు.. నెయ్యి.. పండ్లు.. మాంసం.. ఏది ముట్టుకున్నా కల్తీ భయం వెంటాడుతోంది. అధికారులు వరుస దాడులు చేస్తున్నారు. భారీగా కల్తీ పదార్థాలు స్వాధీనం చేసుకుంటున్నారు. కేసులు పెడుతున్నారు. అరెస్టులు కూడా చేస్తున్నారు. అయినా కల్తీ దందాకు మాత్రం బ్రేకులు పడటం లేదు. ఇటీవల హైదరాబాద్‌లోనే భారీ స్థాయిలో కల్తీ నెయ్యి, రసాయనాలతో కల్తీ చేసిన మసాలాలు పట్టుబడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఆహార భద్రత చట్టంలో అసురక్షిత ఆహారం తయారు చేయడం, నిల్వ చేయడం, విక్రయించడం, పంపిణీ చేయడంపై శిక్షలు ఉన్నాయి. అయితే నష్టం జరగని కొన్ని కేసుల్లో శిక్ష పరిమితంగా ఉండటంతో భారీ లాభాలతో నడిచే కల్తీ వ్యాపారానికి ఆ శిక్షలు నిరోధకంగా లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కల్తీ ఆహారం వల్ల గాయం, తీవ్రమైన గాయం లేదా మరణం సంభవించినప్పుడు మాత్రం శిక్షలు కఠినంగా ఉంటాయి. మరణానికి దారితీసిన కేసులో కనీసం ఏడేళ్ల జైలు నుంచి జీవిత ఖైదు వరకు శిక్ష, కనీసం రూ.10 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది.



### దాడి తర్వాత ఏం జరుగుతోంది?

ఇదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న. దాడి.. స్వాధీనం.. కేసు.. బెయిల్.. ఆ తర్వాత? పట్టుబడిన వ్యక్తి కొద్దికాలానికే బయటకు వచ్చి మళ్లీ అదే వ్యాపారం ప్రారంభిస్తే దాడుల ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నలు వస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్ పోలీసులే కల్తీకి పాల్పడే అలవాటైన నిందితులపై పీడీ యాక్ట్ ప్రయోగించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడైంది.

### కల్తీ మాఫియాపై పీడీ యాక్ట్!

ఒక్కసారి పొరపాటుగా నిబంధన ఉల్లంఘించిన వారిని, వ్యవస్థీకృతంగా ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటూ పదేపదే కల్తీ వ్యాపారం చేసే ముఠాలను ఒకే గాటన కట్టకూడదు. పదేపదే నేరానికి పాల్పడే వారిపై కఠిన నిరోధక చర్యలు తీసుకోవాలి. కల్తీ ద్వారా సంపాదించిన అక్రమ ఆస్తులపై చర్యలు, భారీ జరిమానాలు, లైసెన్సుల రద్దు, పునరావృత నేరాలకు మరింత కఠిన శిక్షలు అమలు చేయాలన్న డిమాండ్ బలపడుతోంది.

### దాడులతో కాదు.. దడతో ఆగాలి

హైదరాబాద్‌లో వందలాది కేసులు నమోదవుతున్నా సమస్య కొనసాగుతుండటం అమలు వ్యవస్థను కూడా ప్రశ్నించేలా చేస్తోంది. 2025-26లో తెలంగాణలో పరీక్షించిన 3,576 ఆహార నమూనాల్లో 398 విఫలమైనప్పటికీ ఒక్క మిగతా 2లో..



## అనుమతి ఇవ్వకపోవడం అన్యాయం

కేంద్రం కావాలనే రేవంత్ పర్యటనను అడ్డుకుంది.. ఖర్గే విమర్శలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తప్పుపట్టారు. పెట్టుబడులను ఆకర్షించడమే ఇటువంటి పర్యటనల ముఖ్య ఉద్దేశమని, వాటికి అనుమతి నిరాకరించడం అన్యాయమేనని మండిపడ్డారు. కేంద్రం కావాలనే రేవంత్ పర్యటనను అడ్డుకుందని ఆరోపించారు."వారు తమకు నచ్చిన వారికి అనుమతి ఇస్తారు.

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్..

## గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జోడీకి కాంస్యం







పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా

## చర్యలు తప్పవు

మంత్రి కొండా సురేఖను గతంలోనే కాపాడాను..

ఇప్పుడు ఆ అవకాశం లేదు

కొండా సుస్మిత.. గీత దాటి నేరుగా సీఎంపైనే ఆరోపణలు చేశారు : టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్(జనంసాక్షి):మంత్రి కొండా సురేఖను గతంలో కాపాడాను.. ఇప్పుడు ఆ అవకాశం లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా చర్యలు తప్పవన్నారు. కొండా సుస్మిత.. గీత దాటి నేరుగా మిగతా 2లో..

‘22ఏ’ పేరిట పెద్ద ఎత్తున

## భూఅక్రమాలు

భూభారతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి: కిషన్ రెడ్డి 2లో..

# హైదరాబాద్‌కు రండి

## ప్రపంచస్థాయి విద్యాసంస్థలు నెలకొల్పండి

- తెలంగాణలో విద్యా,పరిశోధనలకు కేంబ్రిడ్జ్ సహకారం
- లండన్,కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రతినిధులతో సీఎం రేవంత్ చర్చలు
- హైదరాబాద్‌లో విద్యావ్యవస్థ పటిష్టతకు ఇరు యూనివర్సిటీల అధికారుల అంగీకారం



హైదరాబాద్,ఆగస్ట్22(జనంసాక్షి): తెలంగాణలో విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్ రంగాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధులు కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన విద్యావేత్తలు, ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా విద్య, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారం, అంతర్జాతీయ స్థాయి విద్యా కార్యక్రమాలను హైదరాబాద్‌లో నిర్వహించడం, సంయుక్త పరిశోధనలకు అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై చర్చ జరిగింది. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలను ప్రతినిధులు కేంబ్రిడ్జ్ బృందం దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించేందుకు కేంబ్రిడ్జ్ ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఉన్న మానవ వనరులు, సాంకేతిక సామర్థ్యాలు, పరిశ్రమలు, స్టార్టప్ పర్యావరణ వ్యవస్థపై కూడా సమావేశంలో వివరించారు. అదేవిధంగా సంయుక్త పరిశోధనా ప్రాజెక్టులు, ఇంక్యుబేషన్ కార్యక్రమాలు, స్టార్టప్‌ల అభివృద్ధి, యువ పారిశ్రామికవేత్తలకు మార్గదర్శకత్వం, అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై ఇరుపక్షాలు చర్చించాయి. తెలంగాణ యువతలో ఉన్న ప్రతిభను ప్రపంచస్థాయి వేదికలకు తీసుకెళ్లేందుకు కేంబ్రిడ్జ్ సహకారం అందించడంపై సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. మిగతా 2లో..

50 గజాల్లో ఏడంతస్తుల మేడ..



## కుప్పకూలిన భవంతి

- గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో ఘటన
- పక్కనున్న అపార్ట్‌మెంట్‌పై పడిన శిథిలాలు
- ఇద్దరు మృతి.. మరొకరికి తీవ్రగాయాలు

శేరిలింగంపల్లి(జనంసాక్షి): హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. శిథిలాల కింద నుంచి వారి మృతదేహాలను రెస్క్యూ సిబ్బంది వెలికితీశారు. 10లో..

అక్రమనిర్మాణాలన్నింటినీ

## కూల్చేస్తాం

- వెంటనే వాటిని ఖాళీ చేయాలని యజమానులకు సూచిస్తున్నాం
- గచ్చిబౌలి ఘటనా స్థలాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



2లో..

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో

# ఓట్లడగం




అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇళ్ల మంజూరు

- హైదరాబాద్ తరహాలో హౌజింగ్ టవర్స్ నిర్మాణం
- పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం తగదు
- భూభారతి సదస్సులు, సాదాబైనామా అర్జీలను వెంటనే పరిష్కరించాలి
- ప్రజలను ఇబ్బంది పెడితే ఎంతటివారైనా ఉపేక్షించం
- నిజామాబాద్ పర్యటనలో మంత్రి పొంగులేటి

నిజామాబాద్ ప్రతినిధి,ఆగస్ట్22(జనంసాక్షి): నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి.. ఆ పేరుతో ఓట్లు అడిగే ప్రసక్తే లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్‌లో పర్యటించిన మంత్రి.. నగరంలో హౌసింగ్ టవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. గృహ ప్రవేశం చేసిన మహిళలకు నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు చెప్పారు. నిర్మాణ దశలో ఉన్న ఇళ్ల పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కొత్త టెక్నాలజీతో ఇందిరమ్మ మోడల్ టవర్స్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలలో హైదరాబాద్ తరహా ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణం చేపడతామని అన్నారు. పైలట్ ప్రాజెక్ట్ గా నిజామాబాద్ కార్పోరేషన్ పరిధిలో శ్రీకారం చుట్టామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు 230 రూపాయలకే సిమెంట్ మిగతా 2లో..

పెట్టుబడులకు గమ్యస్థానం

# తెలంగాణే కావాలి

- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేరాలి
- టెక్నాలజీ నుంచి జీవశాస్త్రాల వరకు..అపార అవకాశాలు
- జిల్లాలు, పట్టణాలు, గ్రామాలకు అభివృద్ధి విస్తరించాలి :మంత్రి ఉత్తమ్



హైదరాబాద్,ఆగస్ట్22(జనంసాక్షి):తెలంగాణకు రండి... తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి... తెలంగాణలోనే ఆవిష్కరించండి. ప్రపంచానికి అవసరమైన పరిష్కారాలను ఇక్కడే ఊహిద్దాం... ఇక్కడే ఆవిష్కరిద్దాం... ఇక్కడి నుంచే ప్రపంచానికి అందిద్దాం‘అంటూ రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రపంచ వ్యాపార, పారిశ్రామిక, సాంకేతిక రంగాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, నవకల్పనకు వెన్నుదన్నుగా నిలిచే యువశక్తి, పెట్టుబడులకు వేగంగా స్పందించే పారదర్శక ప్రభుత్వం ఈ నాలుగు బలమైన స్తంభాలపై తెలంగాణ ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వం కలిగిన పెట్టుబడుల గమ్యస్థానంగా ఎదుగుతోందని మిగతా 2లో..

# బోనస్ 7 రకాలకే..

సన్నవడ్లపై కీలక మార్పులు నిర్దేశించిన ప్రభుత్వం

హైదరాబాద్,ఆగస్ట్22(జనంసాక్షి):తెలంగాణ ప్రభుత్వం సన్న వడ్లకు సంబంధించి క్వింటాకు 500 రూపాయల బోనస్ పథకంలో కీలక మార్పులు తీసుకొచ్చింది. అక్రమాలను అరికట్టి నిజమైన లబ్దిదారులకు మేలు చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. అయితే కొత్తగా విధించిన నిబంధనలు క్షేత్రస్థాయిలో రైతులకు తీవ్ర అయోమయాన్ని, ఆందోళనను కలిగిస్తున్నాయి.ఈ బోనస్ సొమ్ము అందాలంటే ప్రభుత్వం ప్రత్యేకంగా మిగతా 2లో..

# ట్రంప్‌కు చుక్కెదురు

75 దేశాలకు వీసాల నిలిపివేత నిర్ణయాన్ని కొట్టివేసిన న్యాయస్థానం



వాషింగ్టన్,ఆగస్ట్22(జనంసాక్షి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు స్థానిక కోర్టులో షాక్ తగిలింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, రష్యా సహా మొత్తం 75 దేశాల పౌరులకు తమ దేశ ఇమిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని ఈ ఏడాది జనవరిలో ట్రంప్ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం కొట్టేసింది. ఈ ప్రకటన ఫెడరల్ వలస చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా మిగతా 2లో..

## ప్రజలను ఇబ్బంది పెట్టే అధికారం మీకెక్కడిది?

నిషేధిత జాబితా పేరుతో వేధింపులు : హరీశ్



2లో..

## కల్తీ కంటిన్యూ.. చట్టం వీక్!

పెనాల్టీ లేదా కన్విక్షన్ కూడా నమోదు కాలేదని ఇటీవల వెలువడిన నివేదిక లు ఆందోళన కలిగిస్తున్నాయి. అయితే మరోవైపు, కల్తీ కేసుల్లో ఎవరు తనిఖీ చేయాలి, నమూనాలు ఎవరు సేకరించాలి, ప్రాసిక్యూషన్ ఎలా జరగాలి అన్నది కూడా చట్టబద్ధంగా జరగాల్సిందే. ఈ విషయంలో తెలంగాణ హైకోర్టు ఫుడ్ సేఫ్టీ చట్టం కింద అధికారం కలిగిన అధికారులు మాత్రమే తనిఖీలు, నమూనాల సేకరణ, సీజ్, ప్రాసిక్యూషన్ ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేసింది.

**ఇకనైనా మేల్కొనాలి**

కల్తీని సాధారణ వ్యాపార నేరంగా చూడటం ప్రమాదకరం. ప్రజల ఆరోగ్యాన్ని ఉద్దేశపూర్వకంగా ప్రమాదంలోకి నెట్టే కల్తీ ముఠాలపై చట్టపరమైన ఉక్కుపాదం అవసరం. దాడులు కొనసాగాలి.. కానీ దాడులతో పాటు కేసులు త్వరగా తేలాలి. నేరం రుజువైతే కఠిన శిక్ష పడాలి. పదేపదే నేరం చేసే వారికి మరింత కఠిన చర్యలు ఉండాలి.

## ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్..

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇటీవలే అర్జున పురస్కారాలకు ఎంపికైన భారత మహిళల బ్యాడ్మింటన్ జోడీ పుల్లెల గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించింది. శనివారం మహిళల డబుల్స్ సెమీఫైనల్స్‌లో గాయత్రి జోడీ 21-18, 13-21, 8-21తో లియు షెంగ్షు, టాన్ నింగ్ (చైనా) చేతిలో పరాజయం చవిచూసింది. తొలి గేమ్ పోరాడి గెలిచిన భారత ద్వయం తర్వాత రెండు గేమ్‌లను చేజార్చుకుంది.హోరాహోరీగా సాగిన తొలి గేమ్ ఆరంభంలో భారత జోడీ 4-1 ఆధిక్యంలో నిలిచింది. తర్వాత చైనా ద్వయం దూకుడుగా ఆడి 7-7తో స్కోరును సమం చేసింది. తర్వాత పోరు నువ్వానేనా అన్నట్లు సాగింది. ఈ క్రమంలో ట్రీసా, గాయత్రి 16-18తో వెనుకబడినా.. గొప్పగా పుంజుకుని గేమ్‌ను గెల్చుకున్నారు. రెండో గేమ్‌లో చైనా జోడీ దూకుడు ప్రదర్శించి 5-2తో నిలిచినా భారత జోడీ పుంజుకుని 11-10తో ఆధిక్యంలోని నిలిచింది. తర్వాత లియు షెంగ్షు, టాన్ నింగ్ దూకుడు పెంచి గేమ్‌ను సొంతం చేసుకున్నారు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో హవా అంతా చైనా జోడీదే. భారత ద్వయం కనీస పోటీ ఇవ్వలేకపోయింది. దీంతో ట్రీసా, గాయత్రి కాంస్య పతకంతో సరిపెట్టుకుంది.

## కుప్పకూలిన భవంతి

భవనం ఒక్కసారిగా కుప్పకూలడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో మృతులను మధ్యప్రదేశ్‌కు చెందిన టైల్స్ కార్మికులు ఉమేశ్ కారే (34), మోపత్ (42)గా గుర్తించారు. నిర్మాణం పూర్తయి అద్దెలకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న ఈ భవనం ఈ మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఒక్కసారిగా కూలిపోయింది. శిథిలాలు పక్కనే ఉన్న మరో అపార్ట్‌మెంట్‌పై పడటంతో పాక్షికంగా దెబ్బతింది. ఈ ఘటనలో ఆ అపార్ట్‌మెంట్‌లో ఇద్దరు వృద్ధులు గాయపడ్డారు. అపార్ట్‌మెంట్ గోడలు ధ్వంసం కావడంతో అందులో ఉన్నవారు బయటకు వెళ్తున్నారు. అలాగే, పక్కనే ఉన్న ఓ హాస్టల్ విద్యార్థులు భయంతో బయటకు పరుగులు తీశారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు, ఫైర్, ఎస్‌డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ సిబ్బంది.. ఇంకా శిథిలాల కింద ఎవరైనా చిక్కుకొని ఉన్నారేమోనన్న అనుమానంతో సహాయక చర్యల్ని ముమ్మరం చేశారు. ఒకవేళ సాయంత్రం సమయంలో ఈ ప్రమాదం జరిగి ఉంటే మాత్రం ప్రాణ నష్టం అధికంగా ఉండేదని స్థానికులు చెబుతున్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, హైడ్రా కమిషనర్ రంగనాథ్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన పరిశీలించారు. సహాయక చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

**బిల్డర్ కోసం గాలింపు!**

జీహెచ్ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా భవనం నిర్మించారని, నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారని పలువురు ఆరోపిస్తున్నారు. సరైన ప్రమాణాలు లేకుండా తక్కువ వ్యవధిలోనే నిర్మించడంతో నిర్మించ డంతో పేకమేడలా కూలిపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. మరోవైపు, బిల్డర్ సాజిద్ కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.

## అక్రమనిర్మాణాలన్నింటినీ కూల్చేస్తాం

**హైదరాబాద్,ఆగస్ట్22(జనంసాక్షి):**అంజయ్యనగర్‌లోని అక్రమ నిర్మాణాలన్నీ తొలగిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలపై ఎవరినీ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఘటనాస్థలి పక్కన భవనాల వారు ఖాళీ చేసి వెళ్లాలని రంగనాథ్ ఆదేశించారు. గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన విషయం తెలియడంతో అక్కడకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ చేరుకుని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు ఇద్దరు మృతిచెందారని రంగనాథ్ తెలిపారు. బిల్డింగ్ యజమాని ఇంకా అందుబాటులోకి రాలేదని అన్నారు. ఈ బిల్డింగ్ నిర్మాణంపై సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్‌కి కొంతమంది ఫిర్యాదు చేశారని వెల్లడించారు. గతంలో హైడ్రాకు ఈ బిల్డింగ్ నిర్మాణంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

ఏడు అంతస్తులు, ఒక పెంట్ హౌస్ మొత్తం ఎనిమిది అంతస్తుల బిల్డింగ్‌ను నిర్మిస్తున్నారని వివరించారు.నాలాను అతిక్రమించి ఈ బిల్డింగ్ నిర్మాణం జరుగుతోందని రంగనాథ్ అన్నారు. చుట్టుపక్కల ఉన్న భవనాలను పరిశీలించి త్వరలోనే కూల్చివేస్తామని తెలిపారు. బిల్డర్ సాజిద్ 50 గజాల్లో భవనాలు కట్టి హాస్టళ్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. సాజిద్ పరారీలో ఉన్నారని చెప్పారు. 50 గజాల్లో ఈ బిల్డింగ్ నిర్మించారని వెల్లడించారు. హాస్టల్ బిల్డింగులను నిర్మించి.... రెంట్‌కు ఇస్తుంటాడని చెప్పారు. హైడ్రా ఈ ఘటన సహాయక చర్యల్లో పాల్గొంటుందని.... ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. శిథిలాల కింద అదృష్టవశాత్తూ ఇంకెవరూ ఉండకపోవచ్చని భావిస్తున్నామని రంగనాథ్ పేర్కొన్నారు. అలాగే, ఈ ఘటన గురించి సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన మాట్లాడారు. గతంలోనే ఈ నిర్మాణాలపై తమకు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. నాలుగు నెలల క్రితమే ఈ నిర్మాణ పనులను ఆపేసి, సీజ్ చేశామని వెల్లడించారు. మళ్లీ నిన్న వర్క్ మొదలుపెట్టారని చెప్పారు. ఈరోజు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమయ్యామని అన్నారు. ఈ లోపు ఈ ప్రమాదం చోటు చేసుకుందని చెప్పారు. ఈ నాలాను ఆక్రమించి నిర్మాణలు చేస్తున్నారన్నారు. ఈ బిల్డింగ్ చుట్టూ చాలా అక్రమ నిర్మాణాలు ఉన్నాయని అన్నారు. హాస్టల్ బిల్డింగ్ కోసం ఈ నిర్మాణాన్ని చేపట్టారని సృజన తెలిపారు.

# హైదరాబాద్‌కు రండి



తెలంగాణలో విద్య, పరిశోధన, ఆవిష్కరణలకు ఉన్న అవకాశాలపై కేంబ్రిడ్జ్ విద్యావేత్తలు సానుకూల అభిప్రాయం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, భాగస్వామ్యాన్ని ఆచరణలోకి తీసుకురావాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. ఈ భాగస్వామ్యం ద్వారా హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, స్టార్టప్ హబ్‌గా అభివృద్ధి చేయడం తో పాటు తెలంగాణ యువతకు ప్రపం చస్థాయి అవకాశాలు మరింత అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

**హైదరాబాద్‌లో లండన్ యూనివర్సిటీ క్యాంపస్**

హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు లండన్ యూనివర్సిటీ కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రతినిధులు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలిపారు. ఈ మేరకు లండన్ యూనివర్సిటీ సెనేట్ హౌస్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయం అయిం ది. లండన్ యూనివర్సిటీలోని సెనేట్ హౌస్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ అధికారులు కే. రామకృష్ణారావు, జయేశ్ రంజన్‌లు పాల్గొన్నారు. లండన్ యూనివర్సిటీ ప్రతినిధులతో వారు సుదీర్ఘంగా సమావేశ మయ్యారు. ఈ భేటీలో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ (ఎల్ఎస్ఈ), స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ (ఎస్ఓఏఎస్)కు చెందిన ప్రతినిధి బృందాలు, ఇతర ప్రతినిధులు కూడా ఉన్నారు. హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు లండన్ యూనివర్సిటీ కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రతినిధులు ఈ సందర్భంగా వెల్లడించారు. యూనివర్సిటీకి చెందిన వివిధ స్కూళ్లు, విభాగాల ద్వారా విస్తృత స్థాయిలో విద్యా కోర్సులు, వివిధ విద్యా కార్యక్రమాలను అందించేలా ఈ క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు వివరించారు. లండన్ యూనివర్సిటీకి చెందిన వివిధ విద్యా విభాగాలను ఒకే అకడమిక్ ఫెడరేషన్‌గా అనుసంధానించే విధంగా ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

## అనుమతి ఇవ్వకపోవడం అన్యాయం

కానీ, తెలంగాణ ముఖ్యమంత్రికి మాత్రం ఇవ్వలేదు. అమెరికాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన ఎంతోమంది ప్రవాస భారతీయులు ఉన్నారు. ముఖ్యమంత్రులు అక్కడికి వెళ్లి.. తమ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టాలని, పరిశ్రమలు స్థాపించాలని వారిని ఆహ్వానిస్తుంటారు. అదేవిధంగా.. పెట్టుబడులు పెట్టాలనుకునే వారు కూడా ఇటువంటి పర్యటనల సమయంలో ప్రభుత్వం నుంచి భూకేటాయింపులు, పన్ను రాయితీలను కోరుతుంటారు. అక్కడినుంచి పెట్టుబడులు వస్తే రాష్ట్రానికి, దేశానికే ప్రయోజనం. ఉద్యోగ అవకాశాలు కూడా వస్తాయి. రేవంత్ పర్యటనకు అనుమతి ఇవ్వకపోవడం తప్పు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ.. పెట్టుబడులు దేశానికే కదా వస్తాయి" అని మీడియాతో మాట్లాడుతూ ఖర్గే పేర్కొన్నారు.

## బోనస్.. 7 రకాలకే..

నిర్దేశించిన 7 రకాల సన్న వరి విత్తనాలను మాత్రమే సాగు చేసి ఉండాలి. అందులో ఆర్ఎస్ఆర్ 15048 (తెలంగాణ సోనా), కేఎన్ఎం 1638 (కూనారం వరి-2), జైశ్రీరామ్, కేఎన్ఎం 7715, బీపీటీ 5204 (సాంబమసూరు), హెచ్ఎంటీ సోనా, డబ్ల్యూజీఎల్-44 (సిద్ధి) రకాలు ఉన్నాయి. రైతులు తాము విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణాలకు వెళ్లి ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, కొనుగోలు బిల్లు సమర్పించి సెప్టెంబర్ 10వ తేదీలోగా తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అధికారులు ఆదేశించారు. నెల రోజుల కిందటే విత్తనాలు కొనుగోలు చేసినందున ఇప్పుడు పాత బిల్లులు దొరకక, దుకాణాల చుట్టూ తిరగలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలాచోట్ల వ్యాపారుల వద్ద రికార్డులు లేకపోవడంతో వాగ్వాదాలు జరుగుతున్నాయి. మరోవైపు మార్కెట్లో లభించే ఇతర రకాల సన్న వరిని సాగు చేసిన రైతులు తమకు బోనస్ వర్తించకపోవడంపై నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సొంతంగా విత్తనాలు ఉత్పత్తి చేసుకుని సాగు చేసిన రైతులు కూడా ఏ దుకాణంలో నమోదు చేసుకోవాలో తెలియక గందరగోళానికి గురయ్యారు. ఈ సమస్యపై స్పందించిన జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి స్పష్టతనిచ్చారు. సొంత విత్తనాలు వాడిన రైతులు దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, స్థానిక వ్యవసాయ అధికారులకు సొంత డిక్లరేషన్ రాసి ఇస్తే సరిపోతుందని తెలిపారు. సెప్టెంబర్ 10 లోపు ఈ పక్రియ పూర్తి చేయాలని సూచించారు. కామారెడ్డి జిల్లాలోనే దాదాపు 2.51 లక్షల ఎకరాల్లో సన్న రకాలు సాగవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిబంధనలను మరింత సులభతరం చేయాలని రైతాంగం కోరుతోంది.

## పెట్టుబడులకు గమ్యస్థానం తెలంగాణే కావాలి

ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో శనివారం జరిగిన 'గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ అండ్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్-2026'లో ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యోపన్యాసం చేశారు.

తెలంగాణ అభివృద్ధి ప్రస్థానం కేవలం గణాంకాల్లో కనిపించే ఆర్థిక వృద్ధి మాత్రమే కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడం, యువతకు ఉపాధి కల్పించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, భవిష్యత్ తరాలకు సుస్థిరమైన అభివృద్ధి పునాదులు నిర్మించడం తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

2025?26లో తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (ఉ÷ూఆఖ) సుమారు రూ.17.82 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జాతీయ స్థాయిలో నామమాత్రపు వృద్ధి రేటు 8 శాతంగా ఉండగా, తెలంగాణ 10.7 శాతం వృద్ధి నమోదు చేయడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలోని అంతర్గత శక్తికి, విస్తరిస్తున్న అవకాశాలకు నిదర్శనమన్నారు. ఈ వృద్ధిని మరింత వేగవంతం చేస్తూ తెలంగాణను దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదకశక్తుల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు.

÷ఎఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూపొందించిన 'తెలంగాణ రైజింగ్?2047' దార్శనిక ప్రణాళిక రాష్ట్ర భవిష్యత్తుకు స్పష్టమైన దిశానిర్దేశర చేస్తోందని ఉత్తమ్ పేర్కొన్నారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలన్న మహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇది కేవలం భారీ ఆర్థిక లక్ష్యం మాత్రమే కాదని, సంపద సృష్టితోపాటు ఆ సంపద ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా సమ్మిళిత అభివృద్ధిని సాధించాలన్న సంకల్పమని వివరించారు. ఈ లక్ష్యసాధన కోసం రాష్ట్రాన్ని పరస్పరం అనుసంధానమైన మూడు ఆర్థిక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే వ్యూహాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందని తెలిపారు. టెక్నాలజీ, అత్యున్నత విలువ కలిగిన పరిశ్రమలు, సేవారంగాలకు కేంద్రంగా పట్టణ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దే అజఖీఇ, నగర పరిసర ప్రాంతాల్లో తయారీ, లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాలను విస్తరించే ఖజఖీఇ, వ్యవసాయం, ఆహార శుద్ధి, గ్రామీణ పారిశ్రామిక రంగాలకు కొత్త జీవం పోసే ఖీంఖీఇ?ఈ మూడు ప్రాంతాలు తెలంగాణ సమగ్ర ఆర్థిక పురోగతికి పరస్పర పూరక శక్తులుగా నిలుస్తాయని వివరించారు. అభివృద్ధి హైదరాబాద్ చుట్టూ గీసుకున్న సరిహద్దుల్లో ఆగిపోకూడదు. అది ప్రతి జిల్లాకు చేరాలి... ప్రతి పట్టణాన్ని తాకాలి... ప్రతి గ్రామంలో కనిపించాలి... ప్రతి తెలంగాణ కుటుంబం జీవితంలో మార్పుగా ప్రతిఫలించాలి' అని ఉత్తమ్ స్పష్టం చేశారు. ఆర్థికాభివృద్ధికి నిజమైన అర్థం రావాలంటే అవకాశాలు కొద్ది ప్రాంతాలకు, కొద్ది వర్గాలకు పరిమితం కాకుండా రాష్ట్రం నలుమూలలా విస్తరించాలన్నారు. హైదరాబాద్ ఇప్పటికే సమాచార సాంకేతికత, కృత్రిమ మేధ, ఔషధ తయారీ, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు అంతర్జాతీయ కేంద్రంగా తనదైన ముద్ర వేసిందని మంత్రి పేర్కొన్నారు. ఈ బలమైన పునాదిపై సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్, రక్షణ రంగం, ఎలక్ట్రిక్ మొబిలిటీ, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ రంగాల్లో అపారమైన పెట్టుబడి అవకాశాలు ఆవిష్కృతమవుతున్నాయని చెప్పారు. ప్రపంచ వ్యాపార సంస్థలు తెలంగాణను కేవలం మార్కెట్‌గా కాకుండా పరిశోధన, ఆవిష్కరణ, ఉత్పత్తి, ప్రపంచ మార్కెట్లకు విస్తరణకు వ్యూహాత్మక కేంద్రంగా చూడాలని కోరారు. తాను నిర్వహిస్తున్న నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖల పరిధిని ప్రస్తావిస్తూ నీరువ్యవసాయంఆహార భద్రతపరిశ్రమల మధ్య ఏర్పడుతున్న అనుసంధానం భవిష్యత్ పెట్టుబడులకు మరో విశాలమైన ద్వారం తెరుస్తోందని ఉత్తమ్ చెప్పారు. సాగునీటి నిర్వహణను మరింత శాస్త్రీయంగా, సమర్థవంతంగా మార్చేందుకు ఉపగ్రహ చిత్రాలు, కృత్రిమ మేధ, డ్రోన్లు, సెన్సర్లు, ప్రిడిక్టివ్ అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే రంగాల్లో పెట్టుబడులను తెలంగాణ

## పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా చర్యలు తప్పవు

సీఎంపైనే ఆరోపణలు చేశారన్నారు. అనిరుధ్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి అంతగా హద్దులు దాటి మాట్లాడలేదని, వారిద్దరూ సీఎం గౌరవానికి భంగం కలిగించలేదని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

## ట్రంప్‌కు చుక్కెదురు

ఉందని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి జీనెట్ వెల్లడించారు. వలస వీసాల విషయంలో కాన్సులర్ అధికారుల జోక్యంపై విదేశాంగ కార్యదర్శికి ఉన్న అధికారాన్ని ఆ చట్టం తొలగించిందన్నారు. వారి వీసాలను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు.

## '22ఏ' పేరిట పెద్ద ఎత్తున భూఅక్రమాలు

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వేలాది ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి దండుకోగా.. కాంగ్రెస్ హయాంలో అది లక్షలాది ఎకరాలకు చేరిందని విమర్శించారు. హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. "రాత్రికి రాత్రే ప్రైవేటు భూములను 22ఏ జాబితాలో పెట్టి ప్రభుత్వం వేధిస్తోంది. దశాబ్దాలుగా పన్నులు చెల్లిస్తున్న భూములను నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారు? ప్రజల వ్యతిరేకతను తప్పించుకోవడం కోసం సీఎం ఇంటిని నిషేధిత జాబితాలో చేర్చారా? ధరణి స్థానంలో వచ్చిన భూభారతి నవ్వుల పాలైంది. బీఆర్ఎస్ 10శాతం కమీషన్ తీసుకుంటే.. కాంగ్రెస్ 30 శాతం తీసుకుంటోంది. ప్రైవేటు భూముల్లో 50శాతం కమీషన్ అడుగుతున్నారు. ప్రభుత్వ భూముల్ని ఎందుకు అమ్ముతున్నారో సమాధానం చెప్పాలి. రియల్ ఎస్టేట్ కంపెనీలను బెదిరించి వాటాలు తీసుకుంటున్నారు. భాజపా అధికారంలోకి వచ్చాక ఈ భూములపై మళ్లీ పరిశీలన చేస్తాం. ఎమ్మెల్యేకు ఇష్టంలేకపోతే ఆ భూమి 22ఏలోకి వెళ్లిపోతుంది. ఈ భూముల విషయంలో భాజ పా లీగల్ సెల్ ప్రజలకు సహాయం అందిస్తోంది. ప్రా ముఖ్యతను బట్టి ముఖ్యమంత్రికి విదేశీ పర్యటనలకు అనుమతులు ఇస్తారు. విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ హయాంలో ఉన్న నిబంధనలే ఇప్పుడూ ఉన్నాయి" అని కిషన్ రెడ్డి అన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఓట్లు అడగం

బస్తా ఇవ్వడానికి కంపెనీలు ముందుకు వచ్చాయని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు మంతంరి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం జరిగింది. పట్టణంలో రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్దిదారులకు మంజూరు అంజేయడం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ, మరియు గృహనిర్మాణ అంశాల మీద అధికారుతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ షాపింగ్ కాంప్లెక్స్ లో గంగస్థాన్ ఫేజ్ 2 భవనానికి ప్రారంభోత్సవం చేయడం జరిగింది. నిజామాబాద్ జిల్లాలోని వివిధ మండలాలకు మంజూరైన నూతన తహసీల్దార్ కార్యాలయాల భవనాలతో పాటు నిజామాబాద్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి మరియు గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 6 అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపనతో పాటు భూమి పూజ చేయడం జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలో సంవత్సరానికి 2 లక్షల చొప్పున ఇండ్లు కట్టి ఉంటే పదేండ్లలో 20లక్షల ఇండ్లు పూర్తి అయ్యేవి. కేవలం 60 వేల ఇండ్లను మాత్రమే పూర్తి చేసింది. 30వేల ఇండ్లను మొండిగోడలతో అసంపూర్తిగా వదిలేసేసింది. నిజామాబాద్ టౌన్ లో కూడ సుమారు 400 ఇండ్లను అసంపూర్తిగా వదిలేస్తే, ప్రజాప్రభుత్వం వచ్చాక వాటికి నిధులు కేటాయించి నివాసయోగ్యానికి అనుకూలంగా ఉండేలా యుద్ధ ప్రతిపాదికన పనులు పూర్తి చేసి, డ్రా పద్ధతిలో అర్హులైన పేదలకు ఇండ్లను కేటాయించడం జరిగింది. అదేవిధంగా మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ. 3 కోట్ల 72 లక్షల 65 వేల చెక్కు అందజేశాము. రాబోయే 20 రోజుల్లో నిజామాబాద్ టౌన్ లో పైలట్ ప్రాజెక్ట్ కింద హైదరాబాద్ తరహా ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణాలు శ్రీకారం చుట్టబోతున్నాం. సొంత జాగలేని అర్హులైన నిరుపేదలకు తప్పకుండా ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామని అన్నారు. ఇక సిమెంట్ బస్తా ధర 330 వరకు ఉంది. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే వారికి అది భారంగా కాకుడదు అనే ఆలోచనతో ప్రజాప్రభుత్వం సిమెంట్ పరిశ్రమల యాజమాన్యంతో మాట్లాడి, ఒప్పించి 230 రూపాయలకే సిమెంట్ బస్తా అందించేలా ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రతి జిల్లాలో 70 గ్రామాల చొప్పున సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామం, సర్వే సందర్భంగా ప్రజల అభిప్రాయాలను కూడా సేకరిస్తున్నాం, వారి సూచనలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలు చేపడతాం అన్నారు. పేదలకు కేటాయించే ఇంటి స్థలాలు భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలకు గురికాకుండా ఉండాలన్న ఉద్దేశంతోనే భూముల సర్వే నిర్వహిస్తున్నాం. నిజామాబాద్‌లోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో నూతనంగా నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తో కలిసి పిసిసి చీఫ్ మహేధ్ గౌడ్ పాల్గొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు, ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అదనపు తరగతి గదుల నిర్మాణం చేపడుతున్నామని పిసిసి చీఫ్ తెలిపారు. కొత్త తరగతి గదులతో విద్యార్థులకు మరింత మెరుగైన, అనుకూలమైన విద్యా వాతావరణం అందుబాటులోకి రానుంది. కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి గారు, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మేయర్ శ్రీమతి ఉమారాణి , డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి , బొబ్బిలి రామకృష్ణ , కవిత, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

## ప్రజలను ఇబ్బంది పెట్టే అధికారం మీకెక్కడిది?

హైదరాబాద్,ఆగస్ట్22(జనంసాక్షి):

నిషేధిత జాబితా పేరుతో ప్రజల భూములను కబ్జా చేసే హక్కు ఎవరు ఇచ్చారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇది 30శాతం కమిషన్ సర్కార్ అని ప్రజలే అంటున్నారని తెలిపారు. హైదరాబాద్ బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి కాలనీ, హేమానగర్ కాలనీలకు చెందిన వందలాది మంది 22ం బాధితులు వచ్చి తమ ఆవేదన చెబుతుంటే గుండె కలిచివేసిందని అన్నారు. సర్వే నంబర్ 215, 215 పార్ట్‌లలో 30 ఏళ్లుగా ఎలాంటి వివాదాలు లేకుండా సుమారు 1,500 కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లను రాత్రికి రాత్రే కాంగ్రెస్ ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద 22ఎ నిషేధిత జాబితాలో చేర్చడం అత్యంత దుర్మార్గమని హరీశ్‌రావు మండిపడ్డారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఇల్లు అమ్ముకుందామని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే.. ఆస్తి ప్రొహిబిషన్‌లో ఉందన్న విషయం తెలియడంతో కాలనీ వాసులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని అన్నారు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లను అడ్డుపెట్టుకుని ప్రజలపై ఒత్తిడి తెచ్చి 30 శాతం కమిషన్లు దండుకునేందుకే ఇలాంటి కృత్రిమ వివాదాలు సృష్టిస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా కోడై కూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ప్రశాంతంగా జీవిస్తున్న ప్రజలకు ఇప్పుడు 22ం భయం చూపిస్తూ, బినామీలతో సెటిల్మెంట్లు చేసుకునే దందాకు తెరలేపారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. దీనికి మీ సమాధానం ఏంటని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. బోడుప్పల్ కాలనీ వాసులు సహా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బాధితులందరూ అధైర్యపడవద్దు. ఈ వసూళ్ల సర్కార్ మెడలు వంచైనా సరే మీ ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. మాటలు పక్కనబెట్టి, తక్షణమే ఆయా కాలనీలను 22ం నిషేధిత జాబితా నుంచి తొలగించి, బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే బాధితుల పక్షాన బీఆర్ఎస్ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

# ఎల్‌పీజీ పైప్‌లైన్‌కు గ్రీన్‌సిగ్నల్..

## తెలంగాణకు అనుసంధానం

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశంలో ఎల్‌పీజీ సరఫరా వ్యవస్థను కేంద్రం బలోపేతం చేస్తోంది. తాజాగా కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ విస్తరణకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. రూ.7 వేల కోట్లతో దాదాపు 1,800 కిలోమీటర్ల మేర కొత్త పైప్‌లైన్‌ను విస్తరించేందుకు ప్రణాళిక వేస్తోంది. ఇందుకు పెట్రోలియం, నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టును తెలంగాణ రాష్ట్రానికి అనుసంధానించనుంది. గేల్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఈ పైప్‌లైన్ నిర్మాణ బాధ్యతలను చేపట్టనుంది. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల మీదుగా ఈ ప్రాజెక్టును కేంద్రం నిర్మించనుంది. తెలంగాణలోని చర్లపల్లి నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ (556 కిమీ), ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీ నుంచి ఉత్తరాఖండ్‌లోని సితార్‌గంజ్ (611 కిమీ), మహారాష్ట్రలోని షిక్రాపుర్ నుంచి గోవా, కర్ణాటకలోని హుబ్లీ (633 కిమీ) వరకు ఎల్‌పీజీ పైప్‌లైన్‌లను విస్తరించనుంది.

## ఆర్ఎఫ్‌సీఎల్ షట్‌డౌన్‌తో యూరియా కొరత: తుమ్మల

**హైదరాబాద్,ఆగస్ట్22(జనంసాక్షి):**రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) షట్‌డౌన్‌పై తక్షణమే జోక్యం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. దీని వల్ల సుమారు 10 రోజుల పాటు యూరియా ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో యూరియా డిమాండ్ అధికంగా ఉన్న వేళ ఈ షట్‌డౌన్ ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు మంత్రి తుమ్మల లేఖ రాశారు. గత ఖరీఫ్ సీజన్‌లో112 రోజుల పాటు ఆర్ఎఫ్‌సీఎల్‌లో యూరియా ఉత్పత్తి నిలిపి వేశారని గుర్తు చేశారు. ఈ సంస్థ తరచూ షట్‌డౌన్ కారణంగా రాష్ట్రంలో యూరియా సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్ఎఫ్ఎస్ ద్వారా రైతులకు యూరియా అందించడంలో ఆర్ఎఫ్‌సీఎల్ కీలకమని ఆ లేఖలో స్పష్టం చేశారు. ప్రస్తుతం షట్‌డౌన్‌ను త్వరగా ముగించి యూరియా ఉత్పత్తిని పునరుద్ధరించాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని ఆయన కోరారు. ఆర్ఎఫ్‌సీఎల్ లోటును ఇతర దేశీయ ప్లాంట్లు, దిగుమతుల ద్వారా భర్తీ చేయాలని కేంద్రానికి ఆయన విన్నవించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ముందస్తుగా తగినంత యూరియా నిల్వలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.

## పశ్చిమాసియాలో తొలగిపోని యుద్ధ మేఘాలు

### అమెరికాది వలసవాదమే:ఇరాన్

వాషింగ్టన్(జనంసాక్షి):పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు ఇప్పుడప్పుడే తొలగిపోయేలా కన్పించట్లేదు. ఇరాన్ లక్ష్యంగా చేసుకుంటూ అమెరికా మరోసారి ఆంక్షలు విధించడంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. అగ్రరాజ్యం ఆంక్షలపై టెహ్రాన్ తీవ్రంగా స్పందించింది. ఇది స్వతంత్ర దేశాలన్నింటిపైనా యుద్ధం ప్రకటించడం లాంటిదేనని మండిపడింది. తాజా పరిణామాలు చూస్తుంటే వలసవాదం మళ్లీ తిరిగొచ్చినట్లే కన్పిస్తుందని దుయ్యబట్టింది. ఇరాన్‌పై ఆర్థిక యుద్ధం ప్రకటిస్తున్నట్లు ఇటీవల ట్రంప్ సంచలన ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. టెహ్రాన్‌కు సాయం చేసే వాణిజ్య భాగస్వామ్య దేశాలు తీవ్రమైన ఆర్థిక పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. దీనిపై ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘయీ తీవ్రంగా స్పందించారు. "ఒక దేశ సార్వభౌమాధికార పరిధిలో పనిచేస్తున్న బ్యాంకులు, సంస్థలు, విమానాశ్రయాలు.. ఇతర దేశాలతో వాణిజ్యం చేయకూడదని నిరోధించే హక్కు అమెరికా (జూం)కు లేదు. ఇలా చేస్తే.. దేశాలు సొంతంగా ఆర్థిక, రాజకీయ నిర్ణయాలు తీసుకోవడంలో నియంత్రణ కోల్పోతాయి. ఇది వలసవాదం కిందే వస్తుంది" అని ఇస్మాయిల్ మండిపడ్డారు.

**గ్రీన్‌కార్డు దరఖాస్తుకు ఇక కొత్త నమూన**

అంతర్జాతీయ చట్టాల ప్రకారం.. ఇలాంటి సెకండరీ ఆంక్షలు చెల్లవని ఇరాన్ ప్రతినిధి అన్నారు. ప్రపంచ దేశాల సార్వభౌమత్వానికి ఇది పెను ముప్పు అని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు దిగితే.. అది కేవలం అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణే అవదని, అన్ని దేశాలపై యుద్ధం ప్రకటించినట్లవుతుందని హెచ్చరించారు. అగ్రరాజ్యం ఆంక్షలకు తాము బదులిస్తామన్నారు.

**యుద్ధాన్ని ముగిస్తే మంచిది: పెజెష్కియాన్**

ఇదిలా ఉండగా.. తాజా పరిణామాలపై ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ మాట్లాడుతూ.. అమెరికాపై తీవ్ర విమర్శలు చేశారు. యుద్ధంతో తామే గెలిచామని అందరికీ తెలుసన్నారు. "మనం ఇప్పుడు బలమై, గౌరవప్రదమైన స్థితిలో ఉన్నాం. ఇక, యుద్ధాన్ని ముగించడం మంచిది. ఇరాన్ గెలుపును యావత్ ప్రపంచం గుర్తించింది. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి అమెరికా మన స్కూళ్లను, ఆసుపత్రులను మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసింది. ప్రపంచం నలుమూలల నుంచి ఆ దేశం ద్వేషాన్ని ఎదుర్కొంటోంది" అని పెజెష్కియాన్ విమర్శించారు.

**హర్మూజ్ మా భూభాగమే: ట్రంప్**

ఇరాన్‌పై ట్రంప్ మరోసారి విరుచుకుపడ్డారు. హర్మూజ్ జలసంధిపై తమకు పూర్తి నియంత్రణ లభించిందని అన్నారు. తన దృష్టిలో హర్మూజ్ ఇప్పుడు అమెరికా భూభాగమేనని పేర్కొన్నారు. "ఒప్పందానికి వారు సుముఖంగానే ఉన్నప్పటికీ సరైన డీల్ చేసుకోలేకపోతున్నారు. ఇరాన్ వద్ద ప్రస్తుతం నౌకాదళం, వాయుసేన లేదు. డబ్బులేక సైనికులకు జీతాలు కూడా ఇవ్వలేకపోతున్నారు. 350శాతం ద్రవ్యోల్బణంతో ఇబ్బంది పడుతున్నారు" అని ఎద్దేవా చేశారు.

# హెజెలో ఫార్మాలో రియాక్టర్ పేలి ఇద్దరు మృతి

## పరిశ్రమ ముందు ఉద్రిక్తత

- పరిశ్రమలను తరలించే వరకు ఆందోళన కొనసాగిస్తామన్న గ్రామస్థులు
- బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి







**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 22 (జనం సాక్షి):** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెంలోని హెజెలో ఫార్మా పరిశ్రమలో శుక్రవారం అర్ధరాత్రి రియాక్టర్ పేలడంతో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు ధాటికి దోతిగూడెం, అంతమ్మగూడెం గ్రామాల్లో భారీ శబ్దాలు వినిపించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. శనివారం ఉదయం పెద్ద సంఖ్యలో పరిశ్రమ వద్దకు చేరుకున్న గ్రామస్థులు ఆందోళన చేపట్టారు.

పరిశ్రమలోకి చొచ్చుకెళ్లేందుకు గ్రామస్థులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దోతిగూడెం గ్రామ పరిధిలోని రసాయన పరిశ్రమలను తరలించే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని గ్రామస్థులు స్పష్టం చేశారు.

### ఇద్దరు కార్మికులు మృతి

ప్రమాదంలో చిన్నగూడెం గ్రామానికి చెందిన చెన్ను నాగిరెడ్డి (31), చౌదారం గ్రామానికి చెందిన నాగనబోయిన నరేష్ కుమార్ (29) మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. మృతదేహాలను ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రమాదంలో రసబోతు రాజశేఖర్‌రెడ్డి (38), వేదుల చెన్నకేశవులు (30), శ్రీహరి (27), చిన్నారెడ్డి శివకుమార్‌రెడ్డి (30), మారెళ్ల యోహాన్ (26), ఏసుదాసు కుంభంపాటి (25), దూడల శివశంకర్ (28), గణేష్ సాకేటి (30), పెంట్యాల రవి (42) తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

### బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శనివారం గాంధీ ఆసుపత్రిలో పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గతంలోనూ ఈ పరిశ్రమలో ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఘటనను తీవ్రంగా పరిగణించిన ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచన

యశోద, సన్‌రైజ్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవడంతో పాటు కంపెనీ యాజమాన్యం నుంచి తగిన ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాక మల్లేష్ యాదవ్, కళ్లెం రాఘవ రెడ్డి, సామ మోహన్ రెడ్డి, అంబరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంతోషిమాత రైస్ మిల్లులో భారీగా ధాన్యం కుంభకోణం

**రూ. కోట్ల విలువైన 8,078 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం మాయం**
**సివిల్ సప్లైస్ డీఎం ఫిర్యాదుతో రైస్ మిల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు**

**పెన్‌పహాడ్, ఆగస్టు 22 (జనంసాక్షి) :** ప్రభుత్వం కస్టమ్ మిల్లింగ్ నిమిత్తం అప్పగించిన కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టించిన సంఘటన పెన్ పహాడ్ మండలంలో వెలుగుచూసింది. సివిల్ సప్లైస్ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించి, ప్రభుత్వ నమ్మకాన్ని వమ్ము చేసిన శ్రీ సంతోషిమాత బిన్నీ రైస్ మిల్ యాజమాన్యంపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. విజిలెన్స్ అధికారుల మెరుపు తనిఖీలతో ఈ అక్రమాల గుట్టు రట్టయింది. రైస్ మిల్లులో విజిలెన్స్, సివిల్ సప్లైస్ అధికారుల జంట దాడులు రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ టీమ్ (నల్గొండ యూనిట్ ఆఫీస్) అధికారులు, సివిల్ సప్లైస్ శాఖాధికారులతో కలిసి మాచారం గ్రామ శివారులో ఉన్న 'శ్రీ సంతోషిమాత బిన్నీ రైస్ మిల్' లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మిల్లులోని రికార్డులను పరిశీలించి, భౌతికంగా ఉన్న ధాన్యం నిల్వలను లెక్కించగా అధికారులకు దిమ్మతిరిగే నిజాలు సాక్ష్యాధారాలతో సహా దొరికాయి. మూడు వేర్వేరు సీజన్లకు సంబంధించి ప్రభుత్వం మిల్లింగ్ కోసం ఇచ్చిన ధాన్యంలో ఏకంగా లిలి8,078.818 మెట్రిక్ టన్నులలిలి ధాన్యం కొరత ఉన్నట్లు, అంటే మిల్లు నుండి మాయమైనట్లు తనిఖీల్లో పక్కాగా రుజువైంది.

### మాయమైన ధాన్యం

**ఖరీఫ్ 2024-25 సీజన్:** 1,931.746 మెట్రిక్ టన్నులు, రబీ 2025-26 సీజన్, 4,277.458 మెట్రిక్ టన్నులు. రబీ 2022-23 సీజన్, 1,869.614 మెట్రిక్ టన్నులు. మొత్తం కొరత: 8,078.818 మెట్రిక్ టన్నుల ధాన్యం

### రంగంలోకి పోలీస్ యంత్రాంగం

దర్యాప్తు ముమ్మరం ప్రభుత్వానికి కస్టమ్ మిల్డ్ రైస్ సరఫరా చేయకుండా, అప్పగించిన ధాన్య నిల్వలను అక్రమంగా విక్రయించుకుని ప్రభుత్వ ఖజానాకు భారీ గండి కొట్టిన రైస్ మిల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీజీస్కస్ప్ల్ సూర్యాపేట జిల్లా మేనేజర్ ఉప్పల శ్రీధర్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్సై బాలు నాయక్ మిల్లు యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. ఈ భారీ ధాన్యం కుంభకోణం వెనుక ఇంకా ఎవరి హస్తం ఉందనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు ప్రారంభించారు.

# రెడ్లకో న్యాయం.. బీసీలకో న్యాయమా?

- ప్రముఖ సామాజికవేత్త, బీసీ ఉద్యమ నాయకుడు డా. పరికిపండ్ల అశోక్
- బీసీ మహిళా మంత్రిపై షోకాజ్ నోటీసు విషయంలో వివిధ బీసీ సంఘాల ఆగ్రహం




**హన్మకొండ, ప్రతినిధి ఆగస్టు 22 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసిన వ్యవహారంపై వివిధ బీసీ సంఘాల నాయకులు తీవ్రంగా స్పందించారు. బీసీల పట్ల ఒక రకమైన న్యాయం, రెడ్డి సామాజిక వర్గం పట్ల మరో రకమైన న్యాయం జరుగుతోందా? అని బీసీ ఐక్యవేదిక నాయకులు ప్రశ్నించారు. ఈ అంశంపై హన్మకొండ ప్రెస్ క్లబ్‌లో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ సామాజికవేత్త, బీసీ ఉద్యమ నాయకుడు డా. పరికిపండ్ల అశోక్ మాట్లాడారు. రెడ్లకో న్యాయం.. బీసీలకో న్యాయమా?" అంటూ ఆయన ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు కురిపించారు . ముఖ్యమంత్రిని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కొంతమంది శాసనసభ్యులు అనేక సందర్భాల్లో ఏకవచనంతో విమర్శించినప్పటికీ, అప్పట్లో ప్రభుత్వం అదే స్థాయిలో స్పందించలేదని ఆయన పేర్కొన్నారు. అయితే బీసీ మహిళగా, పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన కొండా సురేఖ విషయంలో మాత్రం ప్రభుత్వం అతిగా స్పందించి షోకాజ్ నోటీసు జారీ చేయడం పట్ల బీసీ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. బీసీ మహిళా మంత్రి విషయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు సామాజిక న్యాయం సూత్రాలకు అనుగుణంగా ఉందా అని డా. అశోక్ పరికిపండ్ల ప్రశ్నించారు. బీసీలు కేవలం ఓటు బ్యాంకు కాదు.. ఈ రాష్ట్ర జనాభాలో మెజారిటీ భాగం. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశ్నిస్తాం" అని డా. పరికిపండ్ల అశోక్ స్పష్టం చేశారు. ఈ విలేఖరుల సమావేశంలో వివిధ కులసంఘాల బీసీ నాయకులు రాంపెల్లి లింగమూర్తి, ఆడెపు సుధాకర్, డాక్టర్ మియాపురం శివుడు, గోవిందుల జనార్ధన్, తౌటం శ్రీనివాస్, కొండ బత్తుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# రోడ్లు, బ్రిడ్జి పనుల్లో వేగం పెంచాలి

- అధికారులకు మంత్రి కోమటిరెడ్డి సూచన



**హైదరాబాద్, ఆగస్ట్22 (జనంసాక్షి) :** రాష్ట్రంలో సీఆర్ఐఎఫ్ రోడ్లు, సేతుబంధన్, రైలు ఓవర్ బ్రిడ్జ్ పనుల్లో వేగం పెంచాలని ఉన్నతాధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. శనివారం సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల్లో నియోజక వర్గాల వారీగా పనుల పురోగతి మరింత మెరుగుపడాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 3,918 కి.మీ రోడ్లకు రూ.5,159 కోట్లతో 316 పనులు మంజూరు అయ్యాయని వివరించారు. 2025-26లో రూ.868 కోట్లతో 422.36 కి.మీ రోడ్ల పనులు చేపట్టామని తెలిపారు. హై లెవెల్ బ్రిడ్జిలు, పనులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. మిర్యాలగూడ, నంది పహాడ్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. నార్కట్‌పల్లి బ్రిడ్జి పనుల పురోగతిపై ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో మరింత కష్టపడి పని చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. డిసెంబర్ నాటికి సచివాలయంలో సోలార్ కార్ పార్కింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రూ.26.81 కోట్ల అంచనా వ్యయంతో సోలార్ కార్ పార్కింగ్ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. సోలార్ పార్కింగ్‌తో సచివాలయానికి 90 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని వివరించారు. దీంతో నెల వారీ విద్యుత్ బిల్లులో 16 శాతం ఆదా అవుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు.

# కాళేశ్వరంతో ఎలాంటి సమస్యలు లేవు

- వెంటనే నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలి
- మాజీమంత్రి జీవన్ రెడ్డి డిమాండ్

**సిరిసిల్ల, ఆగస్ట్22 (జనంసాక్షి) :** తెలంగాణకు వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టులో బాగమైన అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి సమస్యలు లేవని కేంద్ర జల విద్యుత్ పరిశోధన సంస్థ క్లీన్‌చిట్ ఇచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. అన్నారం, సుందిళ్ల ఎక్సలెంట్, గుడ్ అని రిపోర్ట్ ఇచ్చిందని రిపోర్ట్ తో నైనా రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కళ్లు తెరవాలని హితవు పలికారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగం లోకి తేవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎల్‌నినోతో రాబోయే పంట కాలంలో సాగు నీటి కి ఇబ్బందులు వస్తాయని హెచ్చరిస్తున్నాయని అన్నారు. రెండు నెలల క్రితమే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ కన్నెపల్లి పంపు హౌజ్ ను సందర్శించి, సాగు నీరు, తాగు నీటికి వచ్చే ఇబ్బందులు వస్తాయని ప్రభుత్వానికి సూచించా రని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగం లోకి తెస్తే కేసీఆర్ కు పేరొస్తుందని ప్రభుత్వ భేషజాలకు పోతుందని విమర్శించారు. కన్నెపల్లి నుంచి వృథాగా దిగువన నీరు పోతున్నదని, చంద్రబాబు కోసం గురు దక్షణగా నీటిని రేవంత్ రెడ్డి అందజేస్తున్నారని విమర్శిం చారు. కన్నెపల్లి పంపు హౌజ్ వద్ద రూ.100 కోట్ల తో కాఫర్ డ్యాం కట్టి వినియోగంలోకి తేవాలని సూచించారు.

# కరీంనగర్ కార్పొరేషన్‌పై 'జెన్-జీ వాచ్‌డాగ్' నిఘా!

- అవినీతికి చెక్ పెట్టేందుకు 40-50 మందితో విజిలెన్స్ కమిటీ
- యువ లాయర్లు, ఆర్టీఐ కార్యకర్తలు, ఐటీ ప్రొఫెషనల్స్‌తో ప్రత్యేక బృందం
- ప్రధాన చౌరస్తాల్లో వాచ్‌డాగ్ నంబర్లు..
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్ (జనంసాక్షి) :** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో అవినీతికి అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రజలకు పారదర్శకమైన పాలన అందించేందుకు కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు సరికొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టనున్నారు. నగరంలో తొలిసారిగా యువతను భాగస్వామ్యం చేస్తూ లి'జెన్--జీ విజిలెన్స్ వాచ్‌డాగ్ కమిటీ'లిని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కరీంనగర్ మైత్రి హోటల్‌లో శనివారం మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, సర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో రాజేందర్‌రావు ఈ కీలక ప్రకటన చేశారు. నగరపాలక సంస్థలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇంజనీరింగ్ పనులు, టౌన్ ప్లానింగ్ వ్యవహారాలపై నిరంతరం పర్యవేక్షణ ఉండేలా 40 నుంచి 50 మందితో ప్రత్యేక విజిలెన్స్ వాచ్‌డాగ్ కమిటీని ఏర్పాటు చేస్తామని రాజేందర్‌రావు తెలిపారు. ఈ కమిటీలో యువ లాయర్లు, ఆర్టీఐ కార్యకర్తలు, ఐటీ ప్రొఫెషనల్స్‌తో పాటు ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న యువతను ఎంపిక చేస్తామని చెప్పారు. "అవినీతిని చూస్తూ ఊరుకునే పరిస్థితి ఇక ఉండదు. ప్రజల డబ్బుతో చేపట్టే ప్రతి అభివృద్ధి పనికి లెక్క ఉండాలి. ప్రతి పనిపై ప్రజలకు సమాచారం అందుబాటులో ఉండాలి" అని రాజేందర్‌రావు స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను ఆర్టీఐ ద్వారా సేకరించి, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని తెలిపారు.

నగరపాలక సంస్థలో చైన్‌మెన్‌లు, డ్రైవర్లు, రిటైర్డ్ ఉద్యోగులు తదితరుల ద్వారా అవినీతి వ్యవహారాలు సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని రాజేందర్‌రావు పేర్కొన్నారు. అలాంటి ఆరోపణలు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, మధ్యవర్తిత్వ వ్యవహారాలపై కూడా వాచ్‌డాగ్ కమిటీ దృష్టి సారిస్తుందని చెప్పారు. "ఎవరైనా అధికారిక వ్యవస్థను అడ్డుపెట్టుకుని ప్రజలను ఇబ్బంది పెడితే.. ఆ వ్యవహారాన్ని కూడా పరిశీలిస్తాం. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఏ వ్యవహారాన్నీ వదిలిపెట్టం" అని అన్నారు. వెలిచాల ప్రజా కార్యాలయం ద్వారా కూడా ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తామని చెప్పారు. అలాగే ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ తదితర సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారదర్శకమైన విధానాలను తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణను అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాజేందర్‌రావు తెలిపారు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా అందించడంతో పాటు పాలనలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను రాజేందర్‌రావు తప్పుబట్టారు. "రెండు మూడు సార్లు ఇదే విధంగా వ్యవహరించారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తే మాత్రం సహించేది లేదు. ప్రజల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సుస్మిత క్షమాపణలు చెప్పాలి" అని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రవ్యాప్తంగా వేల ఎకరాల భూములు 22ఏ నిషేధిత జాబితాలోకి వెళ్లాయని రాజేందర్‌రావు ఆరోపించారు. ఆ సమస్యలన్నింటినీ ఒక్కొ క్కటిగా పరిష్కరించి బాధితులకు ఉపశమనం కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. "22ఏ సమస్య పరిష్కారమైతే వేలాది కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం లభిస్తుంది. ఈ సమస్యను కేవలం ఒక భూ సమస్యగా చూడడం లేదు.. కుటుంబాల భవిష్యత్తుతో ముడిపడిన సమస్యగా చూస్తున్నాం. పరిష్కారం లభించే వరకు బాధితులకు అండగా ఉంటాం" అని స్పష్టం చేశారు.

ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు గుమ్మడి రాజకుమార్, భాస్కర్ నాయక్, ఆకుల నందిని ఉదయ్, విక్రమ్ సికిందర్, కళ్లేపల్లి శారద బాలరాజు, గంట శ్రీనివాస్ సర్పంచులు కమలాకర్ గౌడ్, తిరుపతిరెడ్డి బోగొండ ఐలయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మీసాల శంకరు, జగ్గానీ కనకయ్య, ఎండి ఖాజా రావనవేని సంపత్, కాంగ్రెస్ నాయకులు గండి రాజేశ్వర్ మూల కృష్ణారెడ్డి, గసికంటి కుమార్, సముద్రాల రమణారావు, వేల్పుల వెంకటేష్ అనంతుల రమేష్ జల్లోజు శ్రీనివాస్ పత్యం రాజేష్, వేముల శ్రీనివాసు, సలీం తిప్పారపు శ్రీనివాస్, కపిల్ మాధవ్,కనకరాజు, వెలిచాల యువసేన జిల్లా అధ్యక్షుడు కాసారపు కిరణ్ కుమార్, గండి గణేష్ ఉపసర్పంచ్ కాశీపాక రాకేష్, సలీం, చిందం శ్రీనివాస్ యువజన కాంగ్రెస్ నాయకుడు కోహెడ వేణు, మీసా రమాదేవి కర్రె పావని, పోరండ్ల రమేష్ సత్తినేని శ్రీకాంత్, 22 ఏ భూ బాధితుల ఐక్యవేదిక అధ్యక్షుడు పాషా మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఏనాడూ మాట్లాడలేదు

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

**హైదరాబాద్, ఆగస్ట్22 (జనంసాక్షి) :** వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కాంగ్రెస్ రాష్ట్ర క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ ఇచ్చిన షోకాజ్ నోటీసులపై ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి స్పందించారు. తానేం తప్పుగా మాట్లాడలేదని లేఖలో పేర్కొన్నారు. 'ఏ రోజూ నేను పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడలేదు. ఎవరిపైనా అనుచిత వ్యాఖ్యలు చేయలేదు. రెండున్నరేళ్లుగా కార్యకర్తల ఆవేదనను వ్యక్తంచేశా. స్థానిక ఎమ్మెల్యే వ్యవహారం ఒంటెద్దుపోకడలా ఉంది. నేతలు, కార్యకర్తలు పడుతున్న ఆవేదననే తెలిపా. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడాలనే ఉద్దేశం నాకు లేదు. పార్టీకి నష్టం కలిగించేవారిని ప్రశ్నించడమే నా ఉద్దేశం. నాపై వచ్చిన ఆరోపణలు అవాస్తవం. వాటిపై విచారణ జరిపి న్యాయం చేయాలి' అని లేఖలో పేర్కొన్నారు.

# లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎస్ఐ

**హైదరాబాద్, ఆగస్ట్22 (జనంసాక్షి) :** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని చందానగర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బాలరాజు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. మరో ఇద్దరు కానిస్టేబుళ్లు రఘు, రాజ్‌కుమార్‌లను కూడా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. బాధితుడి నుంచి లక్ష రూపాయిలు లంచం తీసుకుంటుండగా.. ఎస్ఐతోపాటు కానిస్టేబుళ్లను ఏసీబీ అధికారులు వలపన్నీ పట్టుకున్నారు. వారి వద్ద నుంచి లంచం సొమ్మును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వారందరిని పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. లంచం వ్యవహారంలో పూర్తి వివరాలను వారి నుంచి ఏసీబీ అధికారులు సేకరిస్తున్నారు.

# కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పిస్తాం
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**మావల ఆగస్ట్ 23(జనం సాక్షి) :** పేద, గిరిజన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, మారుమూల గిరిజన ప్రాంతాల విద్యార్థుల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. శనివారం మంత్రి ఉట్నూరు బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో మంద మకరందు, ఎస్పీ అఖిల్ మహాజన్ పూల మొక్కలు అందించి మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐఎఫ్ ప్యానెల్‌ను మంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్యానెల్ ఏర్పాటుకు సంబంధించిన వివరాలను అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేద, గిరిజన విద్యార్థులు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా కార్పొరేట్ స్థాయి విద్యను కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు, షూస్, పుస్తకాలు, ఇతర అవసరమైన సౌకర్యాలు అందించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. ఆశ్రమ, గురుకుల పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీ సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్య, వైద్యం, మౌలిక వసతులు, సంక్షేమ రంగాలను మరింత బలోపేతం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం, శారీరక దారుఢ్యంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఆశ్రమ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు, జూంబా, ఏరోబిక్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

### ఉన్నత స్థానాలకు ఎదగాలి: ఎమ్మెల్సీ దండే విఠల్

ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ, పేద, గిరిజన, వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి కలెక్టర్లు, ఇంజనీర్లు, వైద్యులు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు చూడాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్, గిరిజన స్టడీ సర్కిల్ ద్వారా విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ అందిస్తూ అనేక మంది ఉన్నత స్థాయి ఉద్యోగాలకు ఎంపికవుతున్నారని చెప్పారు. విద్యార్థులకు ఉన్నత చదువులు, పోటీ పరీక్షల కోసం ప్రత్యేక కోచింగ్ సదుపాయాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. పాఠశాలల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న డిజిటల్ బోర్డులు, సైన్స్ ల్యాబ్‌లు, ఇతర ఆధునిక సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రాష్ట్రాల హక్కులపై కేంద్రం అనుచిత జోక్యం

సంపాదకీయం

రాజకీయ విభేదాలు ఎన్నికల వరకు ఉండొచ్చు. కానీ రాష్ట్రాల అభివృద్ధి విషయంలో కేంద్రం, రాష్ట్రాల మధ్య విభేదాలకు తావుండకూడదు. రాష్ట్రాల హక్కులను కాపాడటం అంటే భారత సమాఖ్య వ్యవస్థను కాపాడటమే. రాష్ట్ర ముఖ్యమంత్రి తన రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి విదేశీ పర్యటనకు వెళ్లాలనుకోవడం నేరమా? రాష్ట్రానికి పరిశ్రమలు రావాలి, యువతకు ఉద్యోగాలు రావాలి, ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలి అనుకోవడం తప్పా? తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించిన నేపథ్యంలో ఈ ప్రశ్నలు సహజంగానే తలెత్తుతున్నాయి.

రాష్ట్రాల అభివృద్ధి కోసం పెట్టుబడులను ఆకర్షించడం ముఖ్యమంత్రుల ప్రాథమిక బాధ్యతల్లో ఒకటి. దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడుల కోసం రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి. ముఖ్యమంత్రులు విదేశాలకు వెళ్లి పారిశ్రామికవేత్తలను, పెట్టుబడిదారులను కలవడం కొత్త పరిణామం కాదు. అలాంటి ప్రయత్నాలను ప్రోత్సహించాల్సిన కేంద్రం, అందుకు అడ్డంకులు సృష్టిస్తే అది కేవలం ఒక ముఖ్యమంత్రికి సంబంధించిన విషయం కాదు. అది మొత్తం సమాఖ్య వ్యవస్థను ప్రభావితం చేసే అంశం. తెలంగాణకు పెట్టుబడులు వస్తే ప్రయోజనం కేవలం హైదరాబాద్‌కో, రాష్ట్ర ప్రభుత్వానికో పరిమితం కాదు. కొత్త పరిశ్రమలు వస్తాయి. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. రాష్ట్ర ఆదాయం పెరుగుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థకూ అదనపు బలం చేకూరుతుంది. మరి రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడే ఒక ప్రయత్నాన్ని ఎందుకు అడ్డుకోవాలి?

విదేశీ పర్యటనలకు భద్రత, దౌత్య సంబంధాలు, ప్రోటోకాల్ వంటి అంశాలకు సంబంధించిన నిబంధనలు ఉండటం వాస్తవమే. ప్రతి అనుమతి నిరాకరణను రాజకీయ కోణంలోనే చూడాల్సిన అవసరం లేదు. అయితే, ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు అనుమతి నిరాకరిస్తే అందుకు కారణం ఏమిటో స్పష్టంగా చెప్పాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంటుంది. ప్రత్యేకించి ప్రతిపక్ష పాలనలో ఉన్న రాష్ట్రాల విషయంలో కేంద్రం తీసుకునే ప్రతి నిర్ణయం మరింత పరిశీలనకు గురవుతుంది. కేంద్రం నిజంగా రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తోందని నిరూపించుకోవాలంటే అన్ని రాష్ట్రాలకూ ఒకే ప్రమాణాలు వర్తింపజేయాలి.

భారత రాజ్యాంగం ఏకకేంద్ర పాలన కోసం కాదు. రాష్ట్రాలకు కూడా తమ ప్రజల అభివృద్ధి కోసం నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛను రాజ్యాంగం కల్పించింది. రాష్ట్రాల ఆర్థిక అభివృద్ధి ప్రయత్నాలకు కేంద్రం సహకరించాల్సిందే తప్ప, అనవసరమైన అడ్డంకులు సృష్టించడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణ వెనుక అసలు కారణాలను కేంద్రం బహిరంగంగా వెల్లడించాలి. భద్రతా కారణాలా? దౌత్యపరమైన సమస్యలా? ప్రోటోకాల్‌కు సంబంధించిన అంశమా? లేక మరేదైనా కారణమా? కారణం చెప్పకుండా తలుపులు మూయడం ప్రజాస్వామ్య పాలనకు తగదు.

రాష్ట్రాల హక్కులపై కేంద్రం పెత్తనం పెరిగితే రేపు ఇదే పరిస్థితి మరే రాష్ట్రానికైనా రావచ్చు. ఈరోజు తెలంగాణ అయితే రేపు మరో రాష్ట్రం కావచ్చు. అందుకే ఇది కేవలం రేవంత్‌రెడ్డి పర్యటనకు సంబంధించిన వివాదంగా చూడరాదు. ఇది రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి, సమాఖ్య స్ఫూర్తి, ప్రజాస్వామ్య పారదర్శకతకు సంబంధించిన ప్రశ్న. కేంద్రం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలి. రాష్ట్రాల అభివృద్ధి ప్రయాణానికి రాజకీయ రంగు పులమకూడదు. రాష్ట్రాలు పెట్టుబడుల కోసం ప్రపంచంతో పోటీ పడుతున్న వేళ, కేంద్రం వాటికి రెక్కలు కత్తిరించే పని కాకుండా రెక్కలు తొడిగే పని చేయాలి.

# ప్రజల ప్రశ్నలకు సమాధానమే ప్రజాస్వామ్యానికి అసలైన పరీక్ష

**జంతర్ మంతర్ వంటి వేదికలు ప్రజాస్వామ్య నిరసనలకు చిరునామాలు. అక్కడికి వచ్చే ప్రతి ఒక్కరి లక్ష్యం ప్రభుత్వాన్ని కూల్చడం కాదు. కొందరు ఉద్యోగాల కోసం, మరికొందరు విద్యా హక్కుల కోసం, ఇంకొందరు తమ ప్రాంత సమస్యల పరిష్కారం కోసం గళమెత్తుతారు. వారి చేతుల్లో ఆయుధాల కంటే ప్రశ్నలే ఉన్నప్పుడు ప్రజాస్వామ్య ప్రభుత్వం బలప్రయోగంతో కాకుండా సమాధానాలతో ముందుకు రావాలి.**

నిన్నటి సంచిక తరువాయి



పోలీసు వ్యవస్థ ప్రజాస్వామ్యానికి ప్రత్యర్థి కాదు. చట్టాన్ని అమలు చేయడం, శాంతిభద్రతలను కాపాడటం వారి ప్రధాన బాధ్యత. అదే సమయంలో శాంతియుత నిరసనలకు భద్రత కల్పించడం, ప్రజా రవాణాకు ఇబ్బందులు కలగకుండా చూడటం, వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు సహకరించడం కూడా వారి బాధ్యతలో భాగమే. నిరసనకారులు హింసకు పాల్పడినా, ప్రజా ఆస్తులను ధ్వంసం చేసినా చట్టపరమైన చర్యలు తప్పవు. కానీ శాంతియుతంగా ప్రశ్నించడం, అభిప్రాయం వ్యక్తం చేయడం, నిరసన తెలపడం నేరంగా మారితే ప్రజాస్వామ్య హక్కుల పరిధి క్రమంగా క్షీణించే ప్రమాదం ఉంది. ప్రభుత్వం తన విధానాలను సమర్థించుకోవచ్చు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టవచ్చు. ఉద్యమకారుల డిమాండ్లతో ఏకీభవించకపోవచ్చు. కానీ ఏకీభవించకపోవడం వల్ల ప్రశ్నించే హక్కు తొలగిపోదు. భిన్నాభిప్రాయాలను సహించే సామర్థ్యమే ప్రజాస్వామ్య పరిపక్వతకు కొలమానం. ప్రజలు ప్రశ్నించడం ప్రమాదం కాదు; ప్రశ్నించడం మానేయడమే అసలైన ప్రమాదం.

విద్యార్థుల విషయంలో ఈ అంశం మరింత సున్నితమైనది. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం దొరుకుతుందా? పరీక్షలు సకాలంలో జరుగుతాయా? నియామకాలు పారదర్శకంగా ఉంటాయా? తమ ప్రతిభకు తగిన అవకాశం లభిస్తుందా? అనే ప్రశ్నలు యువతను వెంటాడుతున్నాయి. ప్రతి విద్యార్థి వెనుక ఒక కుటుంబం, తల్లిదండ్రుల ఆశలు ఉంటాయి. ఉద్యోగార్థి వెనుక కుటుంబ ఆర్థిక భవిష్యత్తు ఉంటుంది. అందువల్ల విద్యార్థుల నిరసనలను కేవలం రహదారిపై కనిపించే ఆందోళనగా చూడటం సరికాదు.

ప్రతి నిరసన వెనుక రాజకీయ కుట్ర ఉందని భావించడం కూడా సమస్యను మరింత క్లిష్టం చేస్తుంది. ఉద్యోగం కోరుకునే యువకుడికి ఉద్యోగమే ముఖ్యం. పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థికి పరీక్షే ముఖ్యం. నియామకాల్లో పారదర్శకత కోరుకునే అభ్యర్థికి న్యాయమైన అవకాశం ముఖ్యం. వారి వాస్తవ సమస్యలను పట్టించుకోకుండా ప్రతి ఆందోళనను రాజకీయ కోణంలో చూడటం దూరదృష్టిలేని పాలనకు దారితీస్తుంది. ప్రభుత్వం ఎంత బలంగా ఉందో ఎన్ని నిరసనలను అడ్డుకుందో బట్టి కాదు.. ఎన్ని సమస్యలను పరిష్కరించిందో బట్టి అంచనా వేయాలి. ఎన్ని బ్యారికేడ్లు ఏర్పాటు చేసిందన్నది కాదు.. ఎన్ని సమస్యలకు పరిష్కారం చూపిందన్నదే ముఖ్యం. ఎన్ని నిర్బంధాలు జరిగాయన్నది కాదు.. ఎన్ని నిరసనలు అవసరం లేకుండా ముందుగానే ప్రజలతో చర్చించి పరిష్కరించగలిగిందన్నదే అసలైన పాలనా సామర్థ్యం. ప్రజలను పాలించడం అంటే ఆదేశాలు ఇవ్వడం మాత్రమే కాదు. ప్రజలతో కలిసి పాలించడం అంటే వినడం, చర్చించడం, అర్థం చేసుకోవడం, సమాధానం చెప్పడం, అవసరమైతే విధానాలను మార్చుకోవడం. ప్రజాస్వామ్యానికి ఈ రెండో విధానమే అసలైన అర్థం.

సోనమ్ వాంగ్‌చుక్ వంటి వ్యక్తుల చుట్టూ చోటుచేసుకున్న పరిణామాలను కూడా ఇదే ప్రజాస్వామ్య ప్రమాణంతో చూడాలి. నిరసనకారుల ఆరోగ్యం, మానవ గౌరవం పట్ల ప్రభుత్వం శ్రద్ధ చూపాలి. పోలీసు చర్యలపై ఆరోపణలు వస్తే నిష్పక్షపాత విచారణ జరగాలి. చట్టాన్ని అమలు చేసే సంస్థలు కూడా తమ చర్యలకు జవాబుదారీగా ఉండాలి.

అయితే ప్రజాస్వామ్యంలో హక్కులతో పాటు బాధ్యతలు కూడా ఉంటాయి. నిరసనకారులు శాంతియుతంగా తమ డిమాండ్లను వ్యక్తం చేయాలి. హింసకు దూరంగా ఉండాలి. ప్రజా ఆస్తులను ధ్వంసం చేయకూడదు. సాధారణ ప్రజల రాకపోకలకు అనవసర ఇబ్బందులు కలిగించకూడదు. శాంతియుత నిరసనకే ఎక్కువ నైతిక బలం ఉంటుంది. హింస చోటుచేసుకుంటే అసలు సమస్య వెనుకకు వెళ్లి పద్ధతే ముందుకు వస్తుంది. అదే సమయంలో ప్రభుత్వ బాధ్యత మరింత ఎక్కువ. అధికారంలో ఉన్నవారికి పరిపాలనా వ్యవస్థ, చట్టబద్ధమైన శక్తి, పోలీసు యంత్రాంగం ఉన్నాయి. అందువల్ల ప్రతి చర్యలో సంయమనం, పారదర్శకత, జవాబుదారీతనం అవసరం. శాంతియుత నిరసనను అణచివేయడానికి బలప్రయోగం మొదటి మార్గం కాకూడదు. చర్చ మొదటి అడుగు కావాలి.. సమస్య పరిష్కారం తదుపరి అడుగు కావాలి.. చట్టపరమైన చర్య అవసరమైతేనే చివరి మార్గంగా ఉండాలి.

రాజ్యాంగం భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కు వంటి విలువలను కల్పించింది. ప్రజా శాంతి, భద్రత కోసం చట్టపరమైన పరిమితులు ఉండొచ్చు. కానీ ఆ పరిమితులు పౌర హక్కులనే నిర్వీర్యం చేసే స్థాయికి చేరకూడదు. ప్రజా భద్రత, పౌర స్వేచ్ఛల మధ్య సమతుల్యతే ప్రజాస్వామ్య పరిపక్వతకు అసలైన పరీక్ష. ప్రజాస్వామ్యానికి బలం పోలీసు బలగాల సంఖ్యలో లేదు.. ప్రజల విశ్వాసంలో ఉంది. ప్రభుత్వం తమ మాట వింటుందన్న నమ్మకం ఉంటే ప్రతి సమస్యకు ప్రజలు రోడ్డెక్కాల్సిన అవసరం ఉండదు. తమ ఫిర్యాదులకు న్యాయం జరుగుతుందన్న విశ్వాసం ఉంటే వ్యవస్థను గౌరవిస్తారు. అందుకే నిరసనలను తగ్గించే ఉత్తమ మార్గం పోలీసు బలగాలను పెంచడం కాదు.. ప్రజల విశ్వాసాన్ని పెంచడం. ప్రభుత్వాలు సమస్యలు పెద్దవయ్యాక స్పందించే సంస్కృతిని మార్చుకోవాలి. విద్యార్థి సంఘాలు, ఉద్యోగార్థులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, యువజన సంస్థలు, పౌర సమాజ సంస్థలతో క్రమం తప్పకుండా సంభాషణ జరగాలి. సమస్య రోడ్డుపైకి రాకముందే ప్రభుత్వం వినగలిగితే అనేక ఉద్యమాలకు అవసరమే ఉండదు.

విశ్వవిద్యాలయాలు కేవలం పరీక్షలు నిర్వహించే కేంద్రాలు కాదు. ప్రశ్నించే పౌరులను తయారు చేసే వేదికలు. విద్యార్థి ప్రశ్నించడం తప్పు కాదు. ప్రశ్నించే సంస్కృతి ఉన్న సమాజమే పరిశోధన, విజ్ఞానం, ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయంలో ముందుకు సాగుతుంది. విద్యార్థి ప్రశ్నను సమస్యగా కాకుండా చర్చకు, పరిశోధనకు, పరిష్కారానికి దారితీసే అవకాశంగా చూడాలి.

యువతను అణచివేయడం ద్వారా దేశ భవిష్యత్తును నిర్మించలేం. నిరుద్యోగాన్ని పోలీసు బలగాలతో ఎదుర్కొని పరిష్కరించలేం. పరీక్షలపై అనుమానాలను కేసులతో తొలగించలేం. విద్యా విధానంపై ఆందోళనలను బ్యారికేడ్లతో ఆపలేం. వీటన్నింటికీ పరిష్కారం చర్చ, విధాన నిర్ణయం, సమర్థవంతమైన అమలు, పర్యవేక్షణ, జవాబుదారీతనంలోనే ఉంది.

అధికారంలో ఉన్న ప్రతి రాజకీయ పార్టీ ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిరసన హక్కును సమర్థించి, అధికారంలోకి వచ్చిన తర్వాత అదే నిరసనను అడ్డుకోవడం ద్వంద్వ ప్రమాణం. ప్రజాస్వామ్య హక్కులకు రాజకీయ రంగు ఉండదు. అవి అధికార పార్టీకి మాత్రమే కాదు.. ప్రతిపక్షానికి మాత్రమే కాదు.. ప్రభుత్వాన్ని సమర్థించేవారికే కాదు.. ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారికీ సమానంగా ఉండాలి. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర కూడా కీలకం. ప్రజల ప్రశ్నలను అధికార కేంద్రానికి తీసుకెళ్లడం, ప్రభుత్వ సమాధానాలను ప్రజలకు చేరవేయడం, అధికార నిర్ణయాలను పరిశీలించడం, వాస్తవాలను వెలుగులోకి తేవడం స్వేచ్ఛాయుత మీడియా బాధ్యత. అయితే అదే సమయంలో వాస్తవాలను నిర్ధారించి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన బాధ్యత మీడియాపైనా ఉంది. చివరికి అసలు ప్రశ్న "విద్యార్థులు ఎందుకు నిరసన చేస్తున్నారు?" అనేది మాత్రమే కాదు. "విద్యార్థులు నిరసనకు రావాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడింది?" అన్నదే కీలకం. అలాగే "ప్రజలు ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నిస్తున్నారు?" కంటే "ప్రజల ప్రశ్నలకు ప్రభుత్వం ఎంతవరకు సమాధానం ఇచ్చింది?" అన్నదే మరింత ముఖ్యమైన ప్రశ్న.


బ్యారికేడ్లు తొలగిపోతాయి. పోలీసు బలగాలు వెనక్కి వెళ్తాయి. నిరసన శిబిరాలు ఖాళీ అవుతాయి. కానీ ప్రజల ప్రశ్నలు మాత్రం మిగిలిపోతాయి. వాటికి సమాధానం చెప్పిన పాలకులను చరిత్ర గుర్తుంచుకుంటుంది. ప్రశ్నలను అణచివేసిన పాలనలను కూడా చరిత్ర మరచిపోదు. అందుకే విద్యార్థుల గొంతును వినాలి. యువత ఆందోళనను అర్థం చేసుకోవాలి. నిరసనలకు ప్రజాస్వామ్య స్థలాలను కల్పించాలి. ప్రభుత్వాలు విమర్శలను భయంగా కాకుండా పాలనను సరిదిద్దుకునే అవకాశంగా చూడాలి. పోలీసు వ్యవస్థను ప్రజలపై ప్రయోగించే శక్తిగా కాకుండా రాజ్యాంగ హక్కులను కాపాడే సంస్థగా బలోపేతం చేయాలి.

ఒక విద్యార్థి తన భవిష్యత్తు గురించి ప్రశ్నించినప్పుడు అతని చేతికి సంకెళ్లు కాదు.. సమాధానం అందాలి. ప్రజాస్వామ్యంలో అసలు శక్తి అధికార కుర్చీలో లేదు.. ప్రజల గొంతులో ఉంది. ప్రజాస్వామ్యానికి అసలైన పరీక్ష ఎన్నికల రోజున జరగదు. ఒక సాధారణ పౌరుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన రోజునే జరుగుతుంది. ఆ ప్రశ్నకు ప్రభుత్వం సంభాషణతో సమాధానం ఇస్తే ప్రజాస్వామ్యం బలపడుతుంది. అదే ప్రశ్నకు నిర్బంధంతో సమాధా నం ఇస్తే ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. ప్రజాస్వామ్యం అంటే ప్రభుత్వం ఎప్పుడూ సరైనదే అని ప్రజలు నమ్మడం కాదు. ప్రభుత్వం తప్పు చేసినప్పుడు ప్రశ్నించే అవకాశం ఉండటం.. ప్రశ్నించినప్పుడు సమాధానం చెప్పడం.. సమాధానం సరిపోకపోతే మళ్లీ ప్రశ్నించే స్వేచ్ఛ ఉండటం.. అవసరమైతే ప్రభుత్వం తన విధానాన్ని సవరించుకోవడం. ఇదే ప్రజాస్వామ్య సంస్కృతి. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజలను గుర్తు చేసుకోవడం ప్రజాస్వామ్యం కాదు. ఎన్నికల మధ్య కాలంలోనూ ప్రజల గొంతు వినడం, వారి సమస్యలకు స్పందించడం, పాలనలో వారిని భాగస్వాములను చేయడం నిజమైన ప్రజాస్వామ్యం. ప్రజాస్వామ్యానికి చివరి రక్షణ గోడ పార్లమెంట్ భవనం కాదు.. పోలీసు బ్యారికేడ్ కాదు.. అధికార కుర్చీ కాదు. ప్రజలు తమ హక్కుల కోసం భయపడకుండా ప్రశ్నించే ధైర్యం.. ఆ ప్రశ్నలను వినే పాలనా సంస్కృతి.. సమాధానం చెప్పే జవాబుదారీతనమే ప్రజాస్వామ్యానికి అసలైన రక్షణ. కాబట్టి విద్యార్థుల ప్రశ్నలను అణచివేయడం కాదు.. వాటి వెనుక ఉన్న బాధను అర్థం చేసుకోవాలి. యువతను అరెస్టు చేయడం కాదు.. వారి భవిష్యత్తుపై నమ్మకం కల్పించాలి. నిరసనలను నిలిపివేయడం కాదు.. నిరసనకు కారణమైన సమస్యలను పరిష్కరించాలి. ప్రజల ప్రశ్నలను అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం గొప్పది కాదు; ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పడం ద్వారానే ప్రభుత్వం గొప్పదవుతుంది. ప్రజలు ప్రభుత్వం కోసం కాదు.. ప్రభుత్వం ప్రజల కోసం ఉంటుంది. ప్రజలు ప్రశ్నించినప్పుడు సమాధానం చెప్పడం ప్రభుత్వ కర్తవ్యం. ఎందుకంటే ప్రజల గొంతును కొంతకాలం మౌనంగా చేయగలిగిన పాలన ఉండవచ్చు. కానీ ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన పాలన ఎప్పటికీ బలమైన ప్రజాస్వామ్యంగా నిలవదు.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# కాంగ్రెస్ మేల్కొనాలి ...పొరపాటు చేస్తే మళ్లీ వెనక్కి!



తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రజాపాలనను ముందుకు తీసుకెళ్తున్న సమయంలో, పార్టీ అంతర్గతంగా వినిపిస్తున్న కొందరు నాయకుల బహిరంగ విమర్శలు ఆందోళన కలిగిస్తున్నాయి.పది సంవత్సరాల పాటు అష్ట,కష్టాలు పడి సర్వశక్తులు సమీకరించుకున్న అధికార పార్టీకి ప్రతిపక్షం నుంచి విమర్శలు రావడం సహజం. కానీ విచిత్రం ఏమిటంటే సొంత పార్టీ నేతలే బహిరంగ వేదికలపై మాటల తూటాలు పేల్చడం సర్వ సాధారణమైంది. మాట్లాడేవాండ్లు కోట్లాది రూపాయలు పార్టీకి ఖర్చు చేసి నష్టపోయిన వాండ్లు కాదు, పదవులు లేకుండా ఉన్న వాండ్లు అసలేకాదు, ఏమైనా అత్యాశ ఉంటె అధినేతతో 'వన్ టూ వన్' మాట్లాడితే పార్టీ ప్రతిష్ఠ, ప్రభుత్వ విశ్వసనీయత మసక బారదు కదా? ఏకంగా అధిష్టానంపై స్థాయిని మించి మళ్ళి, మళ్ళి, ఆరోపణలు కార్యకర్తల మనోధైర్యంపై ప్రభావం చూపుతుందనే ఆలోచన క్రమ శిక్షణ సంఘానికి తలనొప్పిగా మారింది. కుటుంబ తగాదాలతో డీలా పడుతున్న ప్రతిపక్ష పార్టీకి స్వంత పార్టీ నాయకులు మైక్ దొరికితే అధిష్టానం లేదు, అతి స్వేచ్ఛతో ఎమ్మెల్యే నేనే , సీఎం నేనే, నేనే రాజు ,నేనే మంత్రి అన్న రీతిలో వ్యవహరిస్తే పార్టీకి భవిష్యత్ ఉంటుందా? అధిష్టానం తప్పును బేరీజు వేసి, మొదటనే చర్య తీసుకుంటే తిరిగి పునరావృతం అయ్యేది కాదు. నోర్లు లేచేది కాదు కదా? నేనే అసలు కాంగ్రెస్ , పచ్చ కాంగ్రెస్ అంటూ ఎగతాళి చేసినోళ్లు అన్ని పార్టీలు తిరిగి వచ్చిన వాండ్లే కదా? ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నాం ..పార్టీ మనకు ఏమి ఇచ్చింది అనే సోయి లేకుండా చిన్న,పెద్ద లేకుండా మాట్లాడి,ఎనుకటికి మా తాత ఎల్లగుర్రం ఎక్కినాం అంటే ..ఇప్పుడు బిఎండబ్ల్యు కార్లు వచ్చాయి కదా? అవకాశాలు అందరికి రావు, అలాగని నోరు ఉందని మాట్లాడి గౌరవం తగ్గించుకోవడం మంచిది కాదేమో?

ప్రజాస్వామ్య పార్టీగా కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలకు స్థానం ఉంది. విధానాలపై చర్చ ఉండాలి. ప్రభుత్వ నిర్ణయాలపై ప్రశ్నలు రావాలి. కానీ భిన్నాభిప్రాయం, బహిరంగ దూషణ రెండూ ఒకటి కావు.పార్టీ సమావేశాల్లో చెప్పాల్సిన మాటలు మీడియా ముందుకు వెళున్నాయి.అంతర్గత సమస్యలు పరిష్కార వ్యవస్థలకన్నా సోషల్ మీడియా వేదికలపైకి వస్తున్నాయి. దీంతో రాజకీయంగా లాభపడేది కాంగ్రెస్ కాదు ప్రతిపక్షమే. కాంగ్రెస్‌లో ఏడాది కాలంగా రాజగోపాల్ రెడ్డి, షబ్బీర్ అలీ, చిన్నా రెడ్డి ,కొండా సురేఖ కూతురు సుస్మిత తీరు ఎట్లా ఉందంటే నీడను ఇచ్చే పచ్చని చెట్టును నరికే పనిలో పడ్డట్టు కన్పిస్తుంది.విచిత్రమేమిటంటే అందరు పదవులు అనుభవిస్తున్నవారే అందులో ఎమ్మెల్యేగా, ఒకరు ప్రభుత్వ సలహాదారులుగా,రాష్ట్ర మంత్రిగా ఉన్నారు. ఏమైనా విభేదాలు ఉంటె క్రమశిక్షణ సంఘం జోక్యం చేసుకుని, అంతర్గత సమస్యలను మీడియా వేదికలపై కాకుండా పార్టీ వ్యవస్థల ద్వారానే పరిష్కరించే ప్రయత్నం చేయలేదు.కామారెడ్డి పంచాయతీ మాత్రం మాట్లాడి రాజీ కుదిరించారుకానీ, లోపల మసులుతూనే ఉన్నది. ఎనుకటికి ఓ స్త్రీ రేపు రా ..అని గోడల మీద అగుపడేది కాంగ్రెస్ అధిష్టానం కూడా ఎప్పుడు.. 'పార్టీ లైన్ దాటితే జాగ్రత్త ..చర్యలు తప్పవు' అంటూ తాత్సారం చేయడం ఇక్కడే అసలు ప్రశ్న మొదలయింది.మొన్నటికి మొన్న లక్ష్మి నర్సింహస్వామి దేవాలయ పాలకమండలి సభ్యురాలు ఈశ్వరమ్మ ఎల్ బి.నగర్ లో ఫ్లెక్సీలో ఫోటో పెట్ట లేదని 80సంవత్సరాల బీసీ మహిళ అని చూడకుండా దూషిస్తే చర్యలకు ఉపేక్షించడం వల్లనే పునరావృతం అవుచున్నాయి కదా ? ఎప్పుడు వచ్చామని కాదు, వచ్చాక పార్టీ ఎదుగుదల కోసం ఏమి చేసాం అనేది బేరీజు వేసుకోవాల్సిన అవసరం ఉంది.


జెన్ జీ పుణ్యమాని బీజేపీ గ్రాఫ్ తగ్గినట్లు సంకలు గుద్దుకుంటున్న తరుణంలో అధికారంలో ఉన్న నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ బలహీనపడితే దాని ప్రభావం కేవలం ఒక రాష్ట్రానికి పరిమితం కాదు. భవిష్యత్ లో రాహుల్ ప్రధాని కావడానికి అనుకూల వాతావరణం దెబ్బతినకుండా పార్టీ అంతర్గత ఐక్యతను రాజకీయ అవసరంగా కాకుండా సంస్థాగత బాధ్యతగా చూడాలి.ఇటీవల పార్టీ సమీక్షల్లో కూడా సమన్వయ లోపం, అసంతృప్తి, వర్గ విభేదాలపై చర్చ జరిగినట్లు మీడియా కథనాలు వెల్లడించిన. అధికారాన్ని, తన పదవిని, వ్యక్తిగత ప్రయోజనాలను మాత్రమే లక్ష్యంగా పెట్టుకుని పదవులను అనుభవిస్తూ, అవకాశం దొరకనప్పుడు బహిరంగంగా పార్టీని దెబ్బతీయడం సహించకూడదు. ఇటీవలి కాలంలో క్రమశిక్షణ సంఘం పలువురు నేతలకు షోకాజ్ నోటీసులు వెళ్లినా, తదుపరి క్రమశిక్షణ చర్యలు స్పష్టంగా కనిపించకపోవడంపై ప్రశ్నలు వ్యక్తమయ్యాయి. నోటీసు ఇచ్చి ఫైలు మూసేస్తే క్రమశిక్షణ కొరవడి పునరావృతం అవుతున్నాయి. అయితే క్రమశిక్షణ అంటే వెంటనే బహిష్కరణ కూడా కాదు. న్యాయమైన విచారణ, సమాధానం చెప్పే అవకాశం, తప్పు నిర్ధారణ, ఆ తర్వాత తగిన చర్య ,ఈ క్రమం ఉండాలి. మొదట హెచ్చరిక, తర్వాత వివరణ, ఆపై పరిస్థితి తీవ్రతను బట్టి చర్య తీసుకోవాలి. అదే సమయంలో ప్రతి నాయకుడికి ఒకే నిబంధన వర్తించాలి. అన్నం పెట్టినోడికే సున్నం పెట్టినట్టు అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కొందరు చైర్మన్లు, కార్యకర్తలు స్పందించారు తప్ప, కొందరి తీరు గోడమీద పిల్లిలా వ్యవహరించడం అధిష్ఠానం గమనించాలి. అందరు స్పందించక పోవడంపై క్రమశిక్షణ సంఘం కేవలం షోకాజ్ నోటీసులు ఇవ్వడానికే పరిమితమవుతుందా? లేక పార్టీకి నష్టం కలిగించే ప్రవర్తనపై సమయానుకూల నిర్ణయాలు తీసుకుంటుందా అనేది వేచి చూడాలి.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర నాయకులపై కొండా సుస్మిత బహిరంగంగా చేసిన ఆరోపణలు తల్లి,తండ్రికి తెలియకుండా మాట్లాడిన ఆవేదనగా కొట్టిపారేయలేం. గత కొద్దీ రోజులుగా జిల్లా మంత్రిగా ఉన్న సురేఖతో వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రిగా ఉన్న పొంగులేటి, కడియం, రేవూరి, నాయిని, సీతక్క ,నాగరాజు కు సఖ్యత కూడా లేదని బహిరంగం గానే చెప్పుకుంటున్నారు. సీఎం రేవంత్ పరకాల సభలో మాట్లాడింది ఏమిటి? నాయకుడికి వ్యూహం ఉంటుంది కదా? నియోజకవర్గ ప్రజలకు భరోసా కల్పించడానికి వచ్చే ఎన్నికల్లో ప్రకాశ్ రెడ్డి పోటీ చేయదని విపక్షాలు ప్రచారం చేస్తున్న క్రమంలో క్యాడర్ చెల్లాచెదురు కాకుండా 2023 కంటే కూడా వచ్చే ఎన్నికల్లో ప్రకాశ్ రెడ్డిని ఎక్కువ మెజార్టీ గెలిపించాలని వ్యూహాత్మకంగా మాట్లాడిన సందర్భాన్ని తప్పు పట్టడం దేనికి? ప్రకాష్ రెడ్డికి అర్హత లేదా? సీఎం రేవంత్ క్యాబినెట్ లో సురేఖ ఉన్నదనేది మర్చిపోయి , సీఎం అన్నదమ్ములపై ఆయన ప్రాణ మిత్రుడు ,వేం నరేందర్ రెడ్డి పై ఆరోపణలు, దుమ్మెత్తి పోసి, ఇంకా మేము బీసీలం అంటూ బుకాయించడం దేనికి సంకేతం? బీసీ బిడ్డ అయితే ఏదైనా మాట్లాడొచ్చా? వెలుతురు ఇచ్చే సూర్యుడి పై ఉమేస్తే ఏం అవుతుంది? ఇక్కడ గిదే జరుగుతుంది. విచిత్రం ఏమిటంటే ప్రతి సభలో సురేఖక్క అని సంబోధించే సీఎం రేవంత్ ను ఏకవచనంతో మాట్లాడిన కొండా సుస్మితను మందలించలేదు,పైగా వ్యక్తిగతం అంటూ తప్పించుకోవడం చూస్తుంటే.. నాడు డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ వ్యవహారంలో ఎందుకూ సారీ చెప్పిందో సమాధానం చెప్పాలి. దీనికి అధిష్టానం,సీఎం రేవంత్ ఉపేక్షిస్తే గిట్లనే ఉంటది. ఈ పరిణామం కాంగ్రెస్‌కు ఒక హెచ్చరిక. ఎందుకంటే రాజకీయ పార్టీ లోపల విభేదాలు ఉండటం సహజం.కానీ అవి పార్టీ అంతర్గత వేదికలను దాటి బహిరంగ వేదికలపైకి వచ్చినప్పుడు,ఆ సంస్థాగత వ్యవస్థలో సమస్య ఉందని భావించి విపక్షాలు ఒంటి కాలు మీద లేచే ప్రమాదం లేకపోలేదు.

తెలంగాణ కాంగ్రెస్‌కు ఇప్పుడు ప్రధాన శత్రువు బయట మాత్రమే లేదు. కానీ పదేపదే పార్టీ, ప్రభుత్వం, నాయకత్వంపై బహిరంగంగా మాట్లాడుతున్నా చర్యలు లేకపోతే మాత్రం ఒక ప్రమాదకరమైన సందేశం వెళ్తుంది: "గళం విప్పినా ఎలాంటి పరిణామం ఉండదు" అనే భావన బలపడుతుంది.ఒక్కరిని చూసి మరొకరు మాట్లాడడం. చివరకు పార్టీ వేదికలపై చెప్పాల్సిన అసంతృప్తి మీడియా స్టూడియోలకూ, సోషల్ మీడియాకూ చేరుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే, ప్రస్తుతం అసంతృప్తి గళం వినిపిస్తున్న వారు కొందరే కాదు .. రేపు గళం విప్పే వారు చాంతాడు ఉంటుంది. కానీ ఆ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన నాయకులే ప్రతిరోజూ పరస్పర ఆరోపణల్లో ఉంటే, ప్రభుత్వ విజయాలు కూడా ప్రజల దృష్టికి సరిగా చేరవు. నిత్యం అంతర్గత పోరు, బహిరంగ మాటల తూటాలు, వ్యక్తిగత ఆధిపత్య పోటీ, అవకాశవాద రాజకీయాలు, ఇవన్నీ కలిసి పార్టీకి నష్టం కలిగించే ప్రమాదం ఉంది. ప్రతిపక్షానికి ఉచిత ఆయుధాలు అందించినట్టే అవుతుంది. ఈరోజు ఒకరి మాటలను మౌనంగా భరిస్తే, రేపు మరొకరు అదే దారిని ఎంచుకుంటారు. అసంతృప్తుల బహిరంగ వ్యాఖ్యలను నియంత్రించకపోతే పార్టీకి నష్టం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా ట్రిబుల్ షూటర్ గా పేరొందిన 'రేవంత్' తన మార్క్ చూపెట్టాలి. తెలంగాణ కాంగ్రెస్ మేల్కోవాలి. క్రమశిక్షణ సంఘం కేవలం పేరుకే ఉన్న వ్యవస్థగా కాకుండా, పార్టీ ఐక్యతను కాపాడే క్రియాశీల సంస్థగా పనిచేయాలి. లేకపోతే అవకాశవాదుల మాటల తూటాలు మొదట కొందరు నాయకులపై పడినా, చివరికి గాయపడేది కాంగ్రెస్ పార్టీనే. కోతికి కొబ్బరికాయ దొరికినట్టు ఎమ్మెల్యేలు రేవంత్ పై ఆరోపణలు ఖండించలేదని, కేంద్రం అనుమతి నిరాకరించినందుకు అమెరికాకు వెళ్లకుండా స్వదేశానికి వస్తున్నా సీఎం రేవంత్ పై బీఆర్ఎస్,బీజేపీ సోషల్ మీడియా చిలువలు,పలువలుగా కథనాలతో గందరగోళం సృష్టించింది.



ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్,
విభాగాధిపతి, జర్నలిజం శాఖ
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్,
సెల్-9866255355



# పేదల సబ్సిడీపై ప్రశ్నలెందుకు? ధనికుల రాయితీలపై మౌనం ఎందుకు?

పేదలకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని కేవలం "ఉచితం"గా చూడటం ఆర్థికశాస్త్రపరంగా అసంపూర్ణమైన దృష్టికోణం. అదే సమయంలో సంపన్నులు, పెద్ద కార్పొరేట్ సంస్థలకు ఇచ్చే పన్ను రాయితీలు, తక్కువ పన్ను రేట్లు, భూమి-విద్యుత్-మౌలిక వసతుల ప్రోత్సాహకాలను "పెట్టుబడి ప్రోత్సాహకాలు"గా మాత్రమే పిలవడం కూడా సమగ్ర ఆర్థిక విశ్లేషణ కాదు. ప్రశ్న సబ్సిడీ ఉందా లేదా అన్నది కాదు; ఎవరికి ఎంత, ఏ ఉద్దేశంతో, ఎలాంటి ఆర్థిక ప్రతిఫలంతో ఇస్తున్నారు? అన్నదే అసలు ప్రశ్న.

భారతదేశంలో ఆహారం, ఎరువులు, ఎల్‌పీజీ వంటి ప్రధాన సబ్సిడీలను కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రత్యేకంగా చూపుతోంది. 2025-26లో ప్రధాన సబ్సిడీలకు సుమారు రూ.3.83 లక్షల కోట్లు కేటాయించగా, అందులో ఆహార సబ్సిడీ రూ.2.03 లక్షల కోట్లు, ఎరువుల సబ్సిడీ రూ.1.68 లక్షల కోట్లుగా ఉంది. ఇవి కోట్లాది కుటుంబాల ఆహార భద్రతను, రైతుల ఉత్పత్తి వ్యయాన్ని ప్రభావితం చేసే సామాజిక పెట్టుబడులు.

అయితే పేదల సంక్షేమ వ్యయాన్ని "ఆర్థిక వ్యవస్థను దివాళా తీయించే ఉచితాలు"గా చిత్రీకరించే ముందు మరో వైపు కూడా చూడాలి. భారత ఆదాయపు పన్ను వ్యవస్థలోనే కొన్ని దేశీయ కంపెనీలకు 22 శాతం, కొత్త తయారీ సంస్థలకు కొన్ని షరతులతో 15 శాతం వరకు తక్కువ పన్ను రేట్లు ఉన్నాయి. కొత్త తయారీ కంపెనీలకు వర్తించే ప్రత్యేక విధానంలో ప్రభావవంతమైన పన్ను రేటు సర్‌చార్జి, సెస్‌తో కలిపి సుమారు 17.16 శాతంగా ఉండవచ్చని ఆదాయపు పన్ను శాఖే వివరిస్తోంది.

ఇక్కడ ఒక కీలక ఆర్థిక సూత్రాన్ని గుర్తించాలి. పేద కుటుంబానికి ఇచ్చిన రూ.1,000 సాధారణంగా ఆహారం, దుస్తులు, విద్య, వైద్యం, స్థానిక సేవల కొనుగోలుకు వెళుతుంది. అంటే అది వెంటనే మార్కెట్‌లోకి తిరిగి ప్రవహించి స్థానిక డిమాండ్‌ను పెంచుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ప్రపంచ బ్యాంకు అధ్యయనం కూడా లబ్ధిదారుల వినియోగం పెరగడంతో పాటు మధ్యకాలంలో ఆస్తుల సమీకరణలో మెరుగుదల కనిపించిందని గుర్తించింది. ప్రపంచ బ్యాంకు తాజా సామాజిక రక్షణ విశ్లేషణ ప్రకారం, పేద కుటుంబాలకు ఇచ్చే బదిలీలు స్థానిక ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన గుణక ప్రభావాన్ని సృష్టిస్తాయి.దీనికి విరుద్ధంగా కార్పొరేట్ రాయితీ కూడా స్వయంచాలకంగా చెడ్డవని చెప్పలేం. కొత్త పెట్టుబడి, ఉపాధి, ఎగుమతులు, సాంకేతికత, ఉత్పాదకత పెరిగితే దానికి ఆర్థిక ప్రయోజనం ఉంటుంది. కానీ రాయితీకి ప్రతిఫలంగా పెట్టుబడి లేదా ఉద్యోగాలు రాకపోతే అది ప్రజా వనరుల బదిలీగా మారుతుంది. అందుకే పేదల సబ్సిడీకి మాత్రమే "ప్రతిఫలం ఏమిటి?" అని అడిగి, కార్పొరేట్ ప్రోత్సాహకాలకు అదే ప్రశ్న అడగకపోవడం ఆర్థిక న్యాయం కాదు. మీడియా, ప్రభుత్వాలు, న్యాయస్థానాలు కూడా "ఉచితం" అనే పదాన్ని ఉపయోగించే ముందు ఆర్థిక శాస్త్రం దృష్టితో ఖర్చు-ప్రయోజన విశ్లేషణ చేయాలి. ఒక పథకం ద్రవ్యలోటును పెంచుతుందా? లక్షిత లబ్ధిదారులకు చేరుతుందా? మానవ మూలధనం, వినియోగం, ఉపాధి, ఉత్పాదకత పెంచుతుందా? అనే నాలుగు ప్రమాణాలతో పరీక్షించి విశ్లేషణ చేయాలి.

**ప్రభుత్వాలకు సూచన స్పష్టంగా ఉంది:**

ప్రతి సబ్సిడీకి సామాజిక ఆడిట్, కాలపరిమితి, లబ్ధిదారుల లక్ష్యీకరణ, వార్షిక ఖర్చు, ప్రయోజన నివేదిక తప్పనిసరి చేయాలి. అదే ప్రమాణాలను కార్పొరేట్ పన్ను రాయితీలు, భూమి, విద్యుత్, మౌలిక వసతుల ప్రోత్సాహకాలకూ వర్తింపజేయాలి. పేదలకు ఇచ్చే సహాయం దానం కాదు. అది సామాజిక స్థిరత్వం, మానవ మూలధనం, కొనుగోలు శక్తి, సమగ్ర ఆర్థిక వృద్ధిలో పెట్టుబడి. అదే సమయంలో ప్రజా ధనాన్ని ఏ వర్గానికైనా బాధ్యత లేకుండా పంచడం సమర్థనీయం కాదు. నిజమైన ఆర్థిక సంస్కరణ అంటే పేదల సబ్సిడీలను తొలగించడం కాదు...ప్రజా వనరులు ఎవరి చేతుల్లోకి వెళ్తున్నాయో ఒకే కొలమానంతో లెక్కించడం.లోపాలు ఉంటే నిష్పాక్షికంగా చర్చింటం అవసరం.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## మణికొండ - ఓయూ కాలనీ రోడ్డు విస్తరణకు తక్షణ చర్యలు చేపట్టాలి



**రాజేంద్రనగర్, ఆగస్టు 22 (జనంసాక్షి) :** మణికొండ – ఓయూ కాలనీ రోడ్డుపై పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపాలని మణికొండ ప్రజా ఐక్య వేదిక కన్వీనర్ సీతారాం ధూళిపాళ ఆధ్వర్యంలో ప్రజలు డిమాండ్ చేశారు. శనివారం మర్రిచెట్టు వద్ద సమావేశమైన ప్రజలు ఓయూ కాలనీ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. రోడ్డు విస్తరణ, ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటు, అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తరలింపు చేపట్టాలని కోరారు. ప్రజల నిధులతో నిర్మించిన ట్రైల్స్ రోడ్ నంబర్ 10, పంచవటి కాలనీ బాక్స్ డ్రెయిన్ కమ్ రోడ్డును వెంటనే ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. శివపురి, చిత్రపురి మధ్య ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణంతో పాటు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ కార్యాలయాన్ని తరలించాలని సూచించారు. సెట్‌బ్యాక్‌లను రోడ్డు విస్తరణకు వినియోగించాలని, డిమాండ్లపై కాలపరిమితితో కూడిన కార్యాచరణ చేపట్టాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రాస్తారోకో సహా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

## ఎస్సీ-ఎస్టీ డిక్లరేషన్ హామీల అమలుకు ఉద్యమిద్దాం



**చేవెళ్ల, ఆగస్టు 22 (జనంసాక్షి) :** ఎస్సీ – ఎస్టీలకు ఇచ్చిన డిక్లరేషన్ హామీల అమలు, పెండింగ్ సమస్యల పరిష్కారం, హక్కులు, సంక్షేమంపై చర్చించేందుకు ఈ నెల 26న చేవెళ్ల కేవీఆర్ గ్రౌండ్‌లో ఎస్సీ--ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు. 2023 ఆగస్టు 26న ఇదే కేవీఆర్ గ్రౌండ్‌లో రేవంత్‌రెడ్డి, మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో ఎస్సీ – ఎస్టీ డిక్లరేషన్ సభ నిర్వహించారని వారు గుర్తుచేశారు. డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలకు మూడేళ్లు పూర్తవుతున్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో అమలు కాలేదని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అదే వేదికపై ఈ నెల 26న సమావేశం నిర్వహించి ఎస్సీ--ఎస్టీల సమస్యలు, హక్కులు, సంక్షేమం, హామీల అమలుపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను జేఏసీ నాయకులు బొంకూరి సురేందర్ మాదిగ, కందేల వెంకటేష్, గంగయ్య, కందేల వెంకటేశ్వరరావు, బ్యాగరి సుదర్శన్, ఎరుకల వెంకటేష్ తదితరులు పరిశీలించారు. ఎస్సీ--ఎస్టీ సంఘాల నాయకులు, యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## వెనకబడిన తరగతుల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



**బొంరాస్ పేట, ఆగస్టు 22 (జనం సాక్షి) :** ప్రతి తరగతి గదిలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల విద్యాధికారి హరిలాల్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని వడిచర్ల, కట్టు కాలువ తండా గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల ఎఫ్.ఆర్.ఎస్ హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పాఠశాలలో బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం అందించాలన్నారు. ప్రతిరోజు పాఠశాలకు సమయానుకూలంగా హాజరై విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. వడిచర్ల ప్రభుత్వ పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో స్థానిక సర్పంచ్ తో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రంగారెడ్డిలో కాంగ్రెస్‌ను పటిష్టం చేయాలి




**ఎల్బీనగర్, ఆగస్టు 22 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావాలంటే రంగారెడ్డి జిల్లాలో పార్టీని మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ అన్నారు. సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా రంగారెడ్డి జిల్లా నూతన డీసీసీ అధ్యక్షుడి ఎంపికపై జిల్లా ముఖ్య నాయకులు, ఎనిమిది నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ పరిశీలకుడు, కర్ణాటక ఎమ్మెల్సీ సీవీ మోహన్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, పటేల్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని డీసీసీ అధ్యక్షుడి ఎంపిక పారదర్శకంగా జరగాలని మధుయాష్కి సూచించారు. ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి సేవలను అభినందించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో పలువురు జిల్లా నాయకులు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియ బాధ్యతలను సమన్వయంతో నిర్వర్తించాలి

- మేడ్చల్ జిల్లా ఆర్‌టిఏ మెంబర్ జైపాల్ రెడ్డి

**శామీర్‌పేట్, ఆగస్టు 22 (జనం సాక్షి) :** తూంకుంట కార్యాలయంలో ఏఇఆర్‌ఓ మధు సుధన్ రెడ్డి అధ్యక్షతన ఎస్ఐఆర్ రెండో దశకు సంబంధించిన అవగాహన సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశానికి సూపర్‌వైజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు,బూత్ లెవల్ ఆఫీసర్లు ,బూత్ లెవల్ ఏజెంట్లు మరియు సంబంధిత సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఈఆర్‌ఓ మధుసుధన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ రెండో దశ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తీసుకొని,ఎన్నికల జాబితా లకు సంబంధించిన విధులను ఎటువంటి పొర పాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్య లను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమాచారం అందిస్తూ,వారి సందేహాలను నివృత్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయ్యాలని కోరారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ రెండో దశ కార్యక్రమం అత్యంత



ముఖ్యమైనదని, ఇందులో ప్రతి సూపర్‌వైజర్,కంప్యూటర్ ఆపరేటర్, బిఎల్‌ఓ ,బిఎల్ ఏలు తమ బాధ్యతలను సమన్వయంతో నిర్వర్తించాలని సూచించారు.
క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సమాచారం, మార్గ దర్శకాలు అందించాలని తెలిపారు. ఓటర్లకు సంబంధించిన వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, సరైన సమాచారాన్ని నమోదు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా సందేహాలు లేదా సాంకేతిక సమస్యలు ఎదురైతే ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారులతో సంప్రదించి పరిష్కరించుకోవాలని చెప్పారు.
అలాగే, బిఎల్‌ఓలు తమ పరిధిలోని ప్రతి ఓటరుకు అందుబాటులో ఉంటూ,అవసరమైన సహాయం అందించాలని సూచించారు. సూపర్‌వైజర్లు తమ పరిధిలో జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ,సిబ్బందికి అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని పేర్కొన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు డేటా నమోదు సమయంలో పూర్తి జాగ్రత్తలు తీసుకొని,తప్పిదాలు లేకుండా విధులు నిర్వహించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ పరస్పర సమన్వయంతో పనిచేసి,నిర్ణీత గడువులోపు ఎస్ఐఆర్ రెండో దశకు సంబంధించిన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు.
ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా కార్య క్రమం సజావుగా సాగేందుకు అందరూ కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్లు జాన్,రజిత,రూపా తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో ఎస్ఐఆర్ రెండో దశ అమలుకు సంబంధించిన పలు అంశాలపై
చర్చించి, సిబ్బందికి అవసరమైన సూచనలు మార్గదర్శకాలు అందించారు.

# “జనంసాక్షి” కథనానికి స్పందన

- గుంజేట్టిలో కరెంటు కష్టాలను తీర్చేందుకు అధికారుల చర్యలు
- క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించిన ఏడి, ఏఈ



గుంజేట్టి రైతులను..
వేధిస్తున్న కరెంటు కష్టాలు..!
- నిర్లక్ష్య ధోరణిలో విద్యుత్ అధికారులు
- నేరుగా రైతులే ట్రాన్స్ ఫార్మర్‌కు మరమ్మత్తులు

**న్యాల్‌కల్, ఆగస్టు 22 (జనం సాక్షి) :** “గుంజేట్టి రైతులకు వేధిస్తున్న కరెంటు కష్టాలు”..శీర్షికన శనివారం ప్రకటించిన “జనం సాక్షి” కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. కథనాన్ని ప్రచురించిన రోజే నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి కరెంటు కష్టాలపై ఆరా తీశారు. శనివారం ఉదయం జహీరాబాద్ రూరల్ ఏడి మహేష్, న్యాల్ కల్ మండల విద్యుత్ అధికారి అర్జున్, స్థానిక విద్యుత్ సిబ్బంది, పలువురు రైతులతో కలిసి నేరుగా పరిశీలించారు. గ్రామ శివారులోని హుసెళ్ళి రోడ్డు మార్గాన100 కేవి సామర్థ్యం గల1వ ట్రాన్స్ ఫార్మర్ కు 22 గురు రైతులకు మాత్రమే విద్యుత్ సరఫరా అందించే ఆస్కారం ఉందని. కొందరు రైతులు మాత్రం ఎలాంటి అనుమతులు, డీడీలు చెల్లించ కుండానే విద్యుత్తును వినియోగించుకోవడంతో కరెంటు సమస్యలు ఉత్పన్నమయ్యాయని అధికారులు వివరణ



ఇచ్చారు. విద్యుత్ సమస్యలతో సతమతమవుతున్న సంబంధిత పలువురు రైతులు (4) వెంటనే డీడీలు చెల్లిస్తే అట్టి రైతులకు ప్రత్యేకంగా 25 కేవి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని ఏఈ తెలిపారు. గ్రామంలోని దళిత వాడలో 4 సింగల్ ఫేస్ ట్రాన్స్ ఫార్మర్ లు ఉన్నాయని, అందులో ఒకటి..”లో ఓల్టేజి” కారణంగా కొన్ని కుటుంబాలకు త్రాగునీటి సమస్యను గుర్తించామని, ఉదయం సమయంలో హీటర్, సింగల్ ఫేస్ బోరు మోటారులను వాడకం వల్ల లో ఓల్టేజి సమస్యను గుర్తించడం జరిగిందన్నారు. అతి త్వరలోనే ఎస్సీ కాలనీలో సింగల్ ఫేస్ ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేస్తామని వివరణ ఇచ్చారు. విద్యుత్ అధికారుల అనుమతులు పొందకుండా రైతులు, విద్యుత్ వినియోగదారులు ట్రాన్స్ ఫార్మర్ లను రిపేరు చేయడం, ఇతరత్రా పనులను చేపట్టడం ప్రమాదమని ఏఈ సూచించారు. అతి త్వరలోనే గ్రామంలోని రైతులు, గ్రామస్తులకు కరెంటు కష్టాలు తిరిగి ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ అధికారులు, విద్యుత్ సిబ్బంది కరెంటు సమస్యల పరిష్కారానికి దృష్టి సారించడం పట్ల పలువురు బాధిత రైతులు, కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

## ఈహెచ్‌ఎస్ సేవలు సక్రమంగా అందించాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 22 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీం (ఈహెచ్‌ఎస్) కింద నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.కె.ఆనంద్ సూచించారు. శనివారం బాలానగర్‌లోని బీబీఆర్ ఆసుపత్రిని సందర్శించి ఈహెచ్‌ఎస్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఈహెచ్‌ఎస్ లబ్ధిదారుల నమోదు విధానం, అందిస్తున్న వైద్య సేవలు, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈహెచ్‌ఎస్ పరిధిలోని లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు. నమోదు ప్రక్రియను



పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించడంతో పాటు లబ్ధిదారుల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు పథకం ద్వారా పూర్తిస్థాయిలో ప్రయోజనం పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీసి, అవసరమైన సూచనలు చేశారు.

## ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే ముఠా గోపాల్ పాదయాత్ర

**ముషీరాబాద్, ఆగస్టు 22 (జనం సాక్షి) :** కవాడిగూడ డివిజన్ పరిధిలోని చిత్రాలనగర్ బస్తీలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ముషీరాబాద్ శాసనసభ్యులు డా. ముఠా గోపాల్ అధికారులతో కలిసి శనివారం పాదయాత్ర నిర్వహించారు. బస్తీవాసులు ప్రధానంగా రోడ్ల సమస్య, మంచినీటి ఎద్దడి, స్ట్రీట్ లైట్ల సమస్యతో పాటు దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డా. ముఠా గోపాల్ సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రజలు



ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. మంచినీటి సరఫరా, రోడ్ల మరమ్మతులు, స్ట్రీట్ లైట్ల ఏర్పాటు, దోమల నివారణకు ఫాగింగ్ వంటి పనులను ఆలస్యం చేయకుండా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ముఠా జయసింహ, డివిజన్ అధ్యక్షులు వల్లాల శ్యామ్ యాదవ్, వల్లాల శ్రీనివాస్ యాదవ్, మాధవి, మంజుల, రూప, శ్రీహరి, రాజు యాదవ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, వల్లాల రవి యాదవ్, విశ్వనాథ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో బస్తీవాసులు, మహిళలు పాల్గొన్నారు. వాటర్ వర్క్స్ డీజీఎం వెంకట్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్ దాసు నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సంక్షేమమే లక్ష్యం

- చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి



**తాండూరు, అగస్టు 22 (జనంసాక్షి) :** మున్సిపల్ కార్మికుల సంక్షేమమే లక్ష్యమని చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం పారిశుద్ధ్య కార్మికులకు ఈ ఏడాదికి సంబంధించిన నిత్యావసర వస్తువులు, కన్జర్వెన్సీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డి పాల్గొన్నారు. కార్మికులకు బట్టలు, చెప్పులు, ఆయిల్, సబ్బులు, పనిముట్లు, చీపుర్లు, శానిటేషన్‌కు అవసరమైన సామగ్రిలి తదితర నిత్యావసర వస్తువులను అందజేశారు. అలాగే ప్రభుత్వం ప్రకటించిన ఒకరోజు సెలవును కార్మికులు వినియోగించుకునేలా చూడాలని, పండుగ పర్వదినాల్లో మహిళా పారిశుద్ధ్య కార్మికులపై పని భారం తగ్గించాలని మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డికి చైర్‌పర్సన్ సూచించారు. పారిశుద్ధ్య కార్మికుల యోగక్షేమాల పట్ల చైర్‌పర్సన్ ప్రత్యేక చొరవ చూపుతున్నందుకు కార్మికులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి




**అల్వాల్, ఆగస్టు 22 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఇక ఆలస్యం చేయకుండా అమలు చేయాలని అల్వాల్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అల్వాల్ జేఏసీ ప్రాంగణంలో శనివారం అఖిలపక్ష తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేయాలని కోరారు. తెలంగాణ సాధన కోసం ఉద్యమించిన వారిని ప్రభుత్వం గుర్తించి వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల పెన్షన్‌తో పాటు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని పత్రికాముఖంగా డిమాండ్ చేశారు. హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు చేపట్టి, అర్హులైన ఉద్యమకారులకు ప్రయోజనాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏర్పుల దయాకర్, శోభన్‌బాబు, రవి, సురేష్, అనిల్‌రాజు, వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 22-ఏ నిషేధిత జాబితా నుంచి రైతుల భూములను తొలగించాలి

- తూప్రాన్ ఆర్డీఓకు బీజేపీ ఆధ్వర్యంలో వినతి

**తూప్రాన్, ఆగస్టు 22:( జనం సాక్షి) :** రైతుల భూములను 22–ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి, అర్హులైన రైతులకు భూమిపై పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం తూప్రాన్ ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. బీజేపీ తూప్రాన్ మున్సిపల్ అధ్యక్షులు భూమన్నగరి జానకిరామ్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 22–ఏ నిషేధిత జాబితాలో ఉన్న అర్హత కలిగిన రైతుల భూములను జాబితా నుంచి తొలగించి, రైతులకు న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నత్తి మల్లేశ్ మాట్లాడుతూ, 22–ఏ నిషేధిత జాబితా కారణంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది రైతులు తమ భూములకు సంబంధించిన హక్కులను అనుభవించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అర్హత కలిగిన రైతుల భూములను 22–ఏ జాబితా నుంచి తొలగించి, వారికి పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించే వరకు బీజేపీ తరఫున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా 22–ఏ నిబంధనల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మండల బిజెపి అధ్యక్షులు పిట్ల పోషయ్య , తూప్రాన్ జనరల్ సెక్రటరీ సంపత్ గౌడ్ , రాజు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కిసాన్ మోర్చా



నాయకులు పాల్గొన్నారు. రైతుల హక్కుల పరిరక్షణ కోసం 22–ఏ నిషేధిత జాబితా సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని బీజేపీ నాయకులు తెలిపారు.

# జవాబుదారీతనంతో కూడిన పోలీస్ సేవలు అందించాలి

**• జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 22 (జనం సాక్షి) :** ప్రజలకు పోలీసులు పార దర్శకంగా జవాబుదారీ తనంతో కూడిన సేవలు అందించాలని నారాయణ పేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు.వార్షిక తని ఖీల్లో భాగంగా శనివారం నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ సమగ్రంగా తనిఖీ చేశారు.ముందుగా పోలీస్ సిబ్బంది పరేడ్‌ను నిర్వహించి వారి టర్న్ అవుట్‌ను ఎస్పీ పరిశీలిం చారు. అనంతరం స్టేషన్ ఆవరణలో పరిశుభ్రతను పాటించాలని, ప్రహరీ చుట్టూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందిం చాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రతి వ్యక్తి కి రిసెప్షన్ వద్ద తగిన విధం గా స్పందించి, ఫిర్యాదుల ను తప్పనిసరిగా ఆన్‌లై న్‌లో నమోదు చేయడంతో పాటు ఫిర్యాదుదారులకు రసీదు అందించాలని ఆదేశించారు.స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, మాల్ఖా నా,ఆయుధాగారం, వివిధ విభాగాల పనితీరు,సిబ్బం ది టర్న్‌అవుట్, క్రమశిక్షణ,యూనిఫాం నిర్వహణ తది తర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ అధికారులు,సిబ్బం దితో ముఖాముఖిగా మాట్లాడి వారి విధి నిర్వ హణ, పనితీరు, సంక్షేమాని కి సంబంధించినఅంశాలను తెలుసుకున్నారు.అనంతరం పోలీస్ స్టేషన్‌లోని సీసీ టీవీ కెమెరాల పనితీరును పరిశీలించి, సీసీటీవీ వ్యవ స్థను సమర్థవంతంగా విని యోగిస్తూ నేరాల నియం త్రణతో పాటు ప్రజల భద్ర తను మరింత బలోపేతం చేయాలని సూచించారు.రానున్న పండుగలను దృష్టిలో ఉంచుకుని, నేరాల నియంత్రణ కొరకు వి పి ఓ ఎస్ ప్రతి గ్రామంలో పర్యటి స్తూ సీసీ కెమెరాలు ఏర్పా టు చేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించి కచ్చి తంగా కనీసం 4 కెమెరాల ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలని తెలిపారు.ప్రజ లకు పారదర్శకమైన,సమ ర్థవంతమైన, జవాబుదా రీతనంతో కూడిన పోలీస్ సేవలు అందించడం ప్రతి పోలీస్ అధికారి బాధ్యత అని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, విజి బుల్ పోలీసింగ్, నిఘా పెట్రోలింగ్,కమ్యూనిటీ పోలీసింగ్‌కు అధిక ప్రాధా న్యత ఇవ్వాలని సూచిం చారు.మారుతున్న కాలా నికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగావినియోగించాలని, ముఖ్యంగా సి డి టి ఎం ఎస్2.0 వ-ాఖునెంప్త్రఖు, డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ దర్యాప్తు, సోషల్ మీడియా మానిటరింగ్ వంటి అంశా ల్లో ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది తమ నైపుణ్యా లనుపెంపొందించుకోవాలని సూచించారు. పెండింగ్ కేసులను సకాలంలో పరి ష్కరించడంతో పాటు నేరస్తుల కంటే ఒక అడుగు ముందుండేలా సాంకేతిక పరిజ్ఞానాన్నిసమర్థవంతంగా వినియోగించాలని ఆదే శించారు.డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు,ట్రాఫిక్ నియంత్రణ, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్ర తకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని,ప్రజలకు ఎల్లప్పుడూఅందుబాటులో ఉంటూ వారి సమస్యలను వేగంగా పరిష్కరించేలా సేవలందించాలని ఆదేశిం చారు.పర్యావరణ పరిర క్షణలో భాగంగా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్పీ మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో డి సి ఆర్ బిడీఎస్పీ మహేష్, సీఐ శివశంకర్, ఎస్ఐ సతీష్ రెడ్డి,ఎస్ బి ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి, సి డి ఎస్ ఎస్ఐ విజయ్ భాస్కర్, ఎస్ఐ-2 మన్యం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం



**మక్తల్, ఆగస్టు 22 (జనంసాక్షి) :** మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు, మక్తల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో ముసాయిదా ఓటర్ల జాబితాలను పట్టణ పరిధిలోని అన్ని బూత్‌ల బీఎల్‌ఏలు, బీఎల్‌ఏ సూపర్‌వైజర్లకు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటును కాపాడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని పేర్కొన్నారు. బూత్ స్థాయిలో జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన కొత్త ఓటర్లను ఫారం-6 ద్వారా నమోదు చేయించాలి. ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పులు, అభ్యంతరాలు ఉంటే నిబంధనల ప్రకారం వెంటనే సవరణలు చేయించాలి. అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కుకు దూరం కాకుండా బీఎల్‌ఏలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కట్ట సురేష్ గుప్తా, శ్రీనివాసులు, లక్ష్మణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫయాజ్, నాయకులు గొల్లపల్లి నారాయణ, మిస్కిన్ నాగరాజ్, గుంతలి రవికుమార్, కల్లూరి గోవర్ధన్, చీూఖ× నాయకులు అఫ్రోజ్, బ్యాగారి సురేష్, వలి, ఆనంద్, రమేష్, కృష్ణ, నవీద్, అసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీపై బీఎల్ఓలకు శిక్షణ



**పుల్కల్, ఆగస్టు 22 (జనం సాక్షి) :** ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీపై బిఎల్ వోలకు శనివారం మండల కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు అందజేయడంతో పాటు,వాటి వివరాలను యాప్‌లో సక్రమంగా నమోదు చేసి అప్‌లోడ్ చేయాలని ఆర్డీవో రమేష్ బాబు బిఎల్వోలకు సూచించారు.ఈ సందర్భంగా శనివారం ఉదయం 11 గంటలకు పుల్కల్ ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్ఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పుల్కల్ తహసీల్దార్ కృష్ణ,ఎంపీఓ వెంకటేశ్వర్ రెడ్డి డీటీ,జీపీఓ,బీఎల్ఓలు, పంచాయతీ కార్యదర్శులు కార్యక్రమంలో పాల్గొన్నారు. నోటీసుల పంపిణీ విధానం, సంబంధిత వివరాల నమోదు, యాప్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియపై అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం ఆర్డీఓ పుల్కల్ తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడారు.ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా,ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని సూచించారు.

## రాజీ మార్గం ద్వారా లోక్ అదాలత్ కేసుల పరిష్కారం




**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 22 (జనం సాక్షి) :** రాజీమార్గం ద్వారా కేసుల ను త్వరితగతిన పరిష్కరిం చేందుకు లోక్ అదాలత్ ఎంతో సమర్థవంతమైన వేదిక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు అన్నారు. నారాయణపేట జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కోఆర్డినేషన్ , పోలీస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 12న నిర్వహించ నున్న మూడో జాతీయ లోక్ అదాలత్ ను విజయ వంతం చేసేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయా లని సూచించారు. కక్షిదారు లు లోక్ అదాలత్ అవకాశా న్ని సద్వినియోగం చేసుకు నేలా విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. జూన్ 20న నిర్వహించిన జాతీయ లోక్‌ఆదాలత్లో రాజీమార్గం ద్వారా మొత్తం 5,300 కేసులను పరిష్కరిం చి, నారాయణపేట జిల్లా రాష్ట్రవ్యాప్తంగా 18వ ర్యాంకు సాధించిందని తెలి పారు.ఈ విజయానికి కృషి చేసిన న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, సంబంధిత సిబ్బందిని అభినందిం చారు.సెప్టెంబర్ 12న జరిగే జాతీయ లోక్ అదా లత్ లో క్రిమినల్ కాంపౌండ బుల్ కేసులు,సివిల్ కేసు లు, నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ (ఎన్ఐ) యాక్ట్ కేసులు, ఎగ్జిక్యూషన్ పిటిషన్స్ (ఈపీ) కేసులు, సైబర్ నేరాల కేసులు, నాన్-బెయిలబుల్ వారెంట్ ఖైదీలకు సంబంధించిన కేసుల పరిష్కారానికి (ఎన్టీడబ్ల్యూ) కేసులను అధిక సంఖ్యలో పరిష్కరిం చేలా చర్యలు తీసుకోవా లని పోలీసు అధికారులను ఆదేశించారు.అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పరిష్కార ప్రక్రియను యధావిధిగా కొనసాగించాలని తెలిపా రు. ఈ సమావేశంలో డీఎల్ ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వింధ్యనాయక్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి. సాయి మనోజ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే. అవినాష్ , డీఈఈ రాములు,డి. శ్రీనివాసులు,ఆర్డీఓ ఆఫీస్ సిబ్బంది, పోలీసు అధికా రులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ప్రజా పాలన కాదు..దోపిడీ పాలన సాగుతోంది

**• బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు**



**గద్వాల, ఆగస్టు 22 (జనం సాక్షి) :** జిల్లాలో 22ఏ నిషేధిత భూముల జాబితా రూపకల్పనలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ బీజేపీ నేతలు శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో కొనసాగేది ప్రజా పాలన కాదు, దోపిడీ పాలన అని మండిపడ్డారు. 22ఏ నిషేధిత జాబితా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం భూ దోపిడీకి పాల్పడుతోందని ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణ చెప్పారంటేనే స్కాం జరిగినట్లు ప్రభుత్వమే ఒప్పుకున్నట్లేనని అన్నారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న రైతులు, సామాన్యులు ఈ జాబితాతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తప్పుగా చేర్చిన భూములను వెంటనే తొలగించి, అర్హులైన భూ యజమానులకు న్యాయం చేయాలని, భూ రికార్డుల మార్పులు, చేర్పులపై విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 22ఏ పేరుతో అక్రమాలకు పాల్పడితే ప్రజల తరఫున బీజేపీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ అక్కల రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్బోటే, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు దరూర్ కిష్టన్న, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు మాలిమ్ ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి



**మల్దకల్, ఆగస్టు 22 (జనంసాక్షి) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం,నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తాసిల్దార్ ఝాన్సీరాణి బిఎల్ ఓలను ఆదేశించారు.శనివారం తహసీల్దార్ కార్యాలయంలో బిఎల్ఓలతో సమావేశం నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియపై పలు సూచనలు చేశారు.మ్యాపింగ్ కాని, వ్యత్యాసాలు ఉన్న ఓటర్లకు సంబంధించిన నోటీసులను సంబంధిత ఓటర్లకు తప్పనిసరిగా అందజేయాలని ఆదేశించారు.నోటీసులు అందించిన అనంతరం విచారణకు సంబంధించి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, నిర్ణీత గడువులోగా విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. మండలంలో 1457 మందికి నోటీసులు అందజేయాల్సి ఉందని వారికి గల 12 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి చూపి వారి మ్యాపింగ్ జరిగేలా చూడాలన్నారు.ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి అవసరమైన ధ్రువపత్రాలను స్వీకరించి రికార్డుల్లో నమోదు చేయాలని పేర్కొన్నారు.ఈనెల 28 నుండి సెప్టెంబర్ 8 వరకు హియరింగ్ ఉంటుందని తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సంబంధిత బిఎల్ఓ ఈ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని మ్యాపింగ్ కొరకు అప్లోడ్ చేసి వారి ఓటు కోల్పోకుండా చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఏఆర్ ఓ ఎంపీడీవో ఆంజనేయరెడ్డి, బిఎల్వోలు,బిఎల్ఏలు, జిపిఓలు,పంచాయతీ, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శనీయుడు రాజా బహదూర్ వెంకట్రామరెడ్డి



**నారాయణపేట, ఆగస్టు 22 (జనం సాక్షి) :** నిజాం పరిపాలనలో రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి కొత్వాల్‌గా పనిచేసి ఉమ్మ డి ఆంధ్రప్రదేశ్ లో గల పేద రెడ్డి విద్యార్థులకు విద్యతో పాటు వారు ఉండి ఉన్నత చదువులు చదువు కునేం దుకు నిజాం నవాబును ఒప్పించి హైదరాబాద్ లో రెడ్డి హాస్టల్ ఏర్పాటు చేసిన రాజా బహదూర్ వెంకట రామిరెడ్డి ఆదర్శ నియుడని రెడ్డి సంక్షేమ సంఘం నాయ కులుపేర్కొన్నారుశనివారం నారాయణపేట జిల్లా కేంద్రం లో ఆయన జయం తిని ఘనంగా నిర్వహించి నివాళిఅర్పించారు. రెడ్డి మహిళల కొరకు వసతి గృహాలను ఏర్పాటు చేసి నిస్వార్థ సేవలను అందిం చిన మహా నీయుడని జిల్లా రెడ్డి సేవా సంఘం గౌరవ అధ్యక్షులు కే సుదర్శన్ రెడ్డి అధ్యక్షులు వెంకట్రామ రెడ్డి ప్రధాన కార్యదర్శి గవినోళ్ల వెంకట్ రెడ్డి అన్నారు. రాజా బహుదూర్ వెంకట్రామా రెడ్డి వనపర్తి జిల్లా రాయం పేట గ్రామంలో జన్మించి నిజాం పరిపాలనలో కొత్వా ల్ గా అంకితభావంతో పనిచేసి పేద రెడ్డి మహిళల చదువుకు ప్రాముఖ్యత నందించిన ఆదర్శనీయు డని అన్నారు ఈకార్యక్ర మంలో నియోజకవర్గ రెడ్డి సేవాసమితి అధ్యక్షులు జి ఆర్ రెడ్డి ,మండల అధ్యక్షులు బాస్కర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, సర్పంచ్ మధుసుధన్ రెడ్డి, పెద్ద రాంరెడ్డి ,చిన్న రాంరెడ్డి, అనంత్ రెడ్డి,రాఘవరెడ్డి, వెంకట్ రెడ్డి, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డివైఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి




**సదాశివపేట, ఆగస్టు 22 (జనం సాక్షి) :** డివైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి టి. అనిల్ పిలుపునిచ్చారు. శనివారం సదాశివపేటలో మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగాలు కల్పించాలని, ప్రభుత్వ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని అన్నారు. సెప్టెంబర్ 6, 7 తేదీల్లో కొండాపూర్‌లో నిర్వహించనున్న జిల్లా నాలుగో మహాసభలకు యువతీ యువకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు ఎం. శ్రీకాంత్, నవీన్, కృష్ణ, ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారమే ప్రభుత్వ లక్ష్యం



**ఖిల్లా ఘనపురం, ఆగస్టు 22 (జనం సాక్షి) :** ప్రతి పేద కుటుంబం యొక్క సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్థానిక కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అగారం ప్రకాష్ స్పష్టం చేశారు. శనివారం ఆయన స్థానిక ముదిరాజ్ సంఘం కాలనీలతో పాటు వివిధ ప్రాంతాలలో పర్యటించి, ఇళ్లు లేని పేదల జీవన స్థితులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పేదల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అగారం ప్రకాష్ మాట్లాడుతూ.. గుడిసెల్లేని , నిరుపేద లు లేని గ్రామంలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత ఇల్లు కట్టిస్తామని భరోసా కల్పించారు. అర్హుల గుర్తింపు పారదర్శకంగా జరుగుతుందని, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్క పేదవాడికి అందేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అగారం ప్రకాష్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యదర్శి రవి కుమార్,సింగిల్ విండో వైస్ చైర్మన్ క్యామ రాజు,హౌసింగ్ ఏ.ఈ. ప్రత్యేక అధికారి మల్లయ్య,నాయకులు గోనెల నాగేష్,ఇందిరమ్మ ఇళ్ల కమిటీ గంజాయి రమేష్, మునగాల బాబు,వార్డు సభ్యులు లింగుస్వామి, కూర్మయ్య,నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులు, బీడీ కార్మికులకూ 'చేయూత' ఇవ్వాలి




**బెజ్జంకి, ఆగస్టు 22 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో శనివారం సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం సీపీఎంమండల సమావేశం నిర్వహించారు.అనంతరం తిప్పారపు శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'చేయూత' సామాజిక భద్రత పింఛన్ల కొత్త దరఖాస్తుల ప్రక్రియలో వృద్ధులు,బీడీ కార్మికుల దరఖాస్తులను కూడా స్వీకరించాలనీ సీపీఎం పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు.వృద్ధులు,లక్షలాది మంది బీడీ కార్మికులకు కొత్త పింఛన్ల ఇచ్చి వారికి 'చేయూత' నివ్వాలని అన్నారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించి పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.దరఖాస్తుల స్వీకరణకు పోర్టల్‌లో,ఆఫ్‌లైన్‌లో వెసులుబాటు కల్పించాలని,ఆగస్టు 31 తుది గడువును పొడిగించాలని డిమాండ్ చేశారు.పింఛన్ల దరఖాస్తు ప్రక్రియను నిరంతర ప్రక్రియగా కొనసాగించడంతో పాటు,ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ మొత్తాన్ని పెంచి అర్హులందరికీ కొత్త పింఛన్లు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఎం పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాము అని అన్నారు.కార్యక్రమంలో బొమ్మిడి సాయికృష్ణ,సంఘ ఎల్లయ్య,బోనగిరి లింగం తదితరులు పాల్గొన్నారు.

# బాలల హక్కులు, భద్రతపై విద్యార్థులకు న్యాయ అవగాహన



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 22 (జనం సాక్షి) :** జాతీయ న్యాయ సేవా సంస్థ అమలు చేస్తున్న చిన్నారుల సంక్షేమం, రక్షణకు సంబంధించిన పథకాలు, చట్టాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో జిల్లా న్యాయ సేవా సంస్థ, జోగులాంబ గద్వాల ఆధ్వర్యంలో గద్వాల మండలంలోని ప్రైమరీ, జడ్పీహెచ్ఎస్ అనంతపూర్ గ్రామంలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లిలీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్ వి. రాజేందర్, డి.లక్ష్మణ స్వామి పాల్గొని విద్యార్థులకు బాలల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, ఫోక్సో చట్టం-2012, బాల్య వివాహాల నిషేధ చట్టం--2006, బాల కార్మికుల చట్టం, విద్యా హక్కు చట్టం-2009, జువెనైల్ జస్టిస్ చట్టం--2015 తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి చిన్నారి సురక్షితమైన, హింస రహిత వాతావరణంలో జీవించే హక్కు కలిగి ఉన్నారని తెలిపారు. విద్యార్థులు ఏవైనా వేధింపులు,హింస లేదా ఇబ్బందులు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, ఉచిత న్యాయ సహాయం కోసం ఎన్ ఎ ఎల్ ఎస్ ఎ టోల్ ఫ్రీ నంబర్15100 ను వినియోగించుకోవచ్చని వివరించారు. గుడ్ టచ్,బ్యాడ్ టచ్, వ్యక్తిగత భద్రత, బాలల హక్కులు, ఆన్‌లైన్ భద్రత, సైబర్ వేధింపులు, సోషల్ మీడియా బాధ్యతాయుత వినియోగం, విద్య యొక్క ప్రాముఖ్యత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అపరిచితులతో వ్యక్తిగత వివరాలు, ఫోటోలు లేదా ఇతర సున్నితమైన సమాచారాన్ని పంచుకోకూడదని సూచించారు.

**మొబైల్ లోక్ అదాలత్ ద్వారా న్యాయ అవగాహన**

ఈ కార్యక్రమంలో లిమొబైల్ లోక్ అదాలత్,ఉచిత న్యాయ సేవల బస్సు ద్వారా దృశ్య ప్రదర్శనలు, వీడియోలు, అవగాహన కార్యక్రమాల సహాయంతో విద్యార్థులకు బాలల హక్కులు, చట్టాలు, భద్రత, రక్షణ, ఉచిత న్యాయ సేవలపై అవగాహన కల్పించారు.విద్యార్థులు సోషల్ మీడియా, ఇంటర్నెట్‌ను జాగ్రత్తగా వినియోగించాలని, సైబర్ వేధింపులు లేదా ఇతర సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే విశ్వసనీయమైన పెద్దలకు, ఉపాధ్యాయులకు, సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస గౌడ్, భరోసా సెంటర్ ప్రతినిధి కె. ఆమాని,ఐ సి పి ఎస్ కౌన్సిలర్ సురేష్, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# హెచ్ఐవీ, ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం

▫ ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా



**మావల, ఆగస్ట్23 (జనంసాక్షి) :** హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలనకు సమాజంలో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, ముందస్తు పరీక్షలు, సకాలంలో చికిత్స అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన 'ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్-2026'లో భాగంగా శనివారం స్థానిక స్టేడియం వద్ద నిర్వహించిన బైక్ ర్యాలీని జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా జాతీయ, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థల క్యూఆర్ కోడ్ అవగాహన సంబంధించిన పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించి, ఎయిడ్స్ నివారణపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం బైక్ అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి పాల్గొన్నారు. ఈ బైక్ ర్యాలీ కలెక్టర్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, మీదుగా అవగాహన కల్పిస్తూ తిరిగి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు చేరుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12 వరకు రెండు నెలల పాటు జిల్లా వ్యాప్తంగా 'ఎయిడ్స్ సురక్ష మాస్ క్యాంపెయిన్' ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. స్క్రీనింగ్ పరీక్షలను కేవలం రిమ్స్, ఉట్నూర్, బోథ్ ప్రధాన ఆసుపత్రులకే పరిమితం చేయకుండా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ లక్ష్యాలకు అనుగుణంగా నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణులు, క్షయ అనుమానిత లక్షణాలు ఉన్నవారికి తప్పనిసరిగా హెచ్ఐవీ పరీక్షలు చేయాలని స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరికైనా పాజిటివ్ వచ్చినట్లయితే బాధితుల వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతూ, ఏఆర్టీ కేంద్రాల ద్వారా ఉచిత చికిత్సను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఆదిలాబాద్ 14వ స్థానంలో ఉందని, రాబోయే రెండు నెలల కార్యాచరణ ద్వారా జిల్లాను పూర్తి 'సురక్షిత స్థానం'లోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. పాఠశాలలు, యువతలో అవగాహన పెంచడంతో పాటు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ప్రత్యేక స్క్రీనింగ్ చేపడతామని, ప్రజలు 1097 హెల్ప్‌లైన్ నంబర్, క్యూఆర్ కోడ్ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.సాధన, డివైఎస్ఓ దయానంద్ రెడ్డి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నాగరాజు, ఐసీటీసీ కౌన్సెలర్లు, పీహెచ్‌సీల వైద్యులు, వైద్య సిబ్బంది, యువత, తదితరులు పాల్గొన్నారు.

# సెన్సస్ హ్యాండ్ బుక్ నిర్ణిత గడువులోగా సమర్పించాలి



**నిర్మల్ బ్యూరో ఆగస్టు 22 (జనంసాక్షి) :** సెన్సస్ హ్యాండ్ బుక్ తయారీకి సంబంధించి శాఖలవారీగా పూర్తి వివరాలను నిర్దేశిత గడువులోగా సమర్పించాలని జిల్లా అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్ లు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం సెన్సస్ హ్యాండ్‌బుక్ రూపకల్పనపై వివిధ శాఖల అధికారులతో వారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రణాళిక శాఖ అందించిన ప్రామాణిక నమూనా ప్రకారం క్షేత్రస్థాయిలో అవసరమైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ ప్రచురించే హ్యాండ్ బుక్ జిల్లా అధికారిక రికార్డుగా నిలుస్తుందని, శాఖల వారీగా ఇచ్చే గణాంకాలలోఎలాంటి తప్పులు లేకుండా పూర్తి కచ్చితత్వం ఉండాలని స్పష్టం చేశారు. అలాగే సమాచారం పునరావృతం కాకుండా ఉండేందుకు వివిధ శాఖల అధికారులు ఒకరికొకరు పరస్పర సమన్వయంతో వ్యవహరించాలని పేర్కొన్నారు. అధికారులు సమర్పించే ఈ సమగ్ర నివేదికలు జిల్లా భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో సరిగ్గా చేర్చడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. సమాచార సేకరణ, నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ రాకేష్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, సిపివో గంగారెడ్డి, డీఈవో భోజన్న, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న అన్ని రకాల వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకోవాలి



**హనుమకొండ, ఆగస్టు 22 (జనంసాక్షి) :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న అన్ని రకాల వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకోవాలికేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమెరికా ప్రభుత్వంతో చేసుకున్న అన్ని రకాల స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావడం కోసం ఎమ్మెల్యే ఎంపీలకు వినతి పత్రాలు ఇవ్వాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కె ఎం) జాతీయ కమిటీఇచ్చిన పిలుపుమేరకు ఈరోజు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని. రాజేందర్ రెడ్డి భారత రైతుకూలీసంఘం(ఏఐకేఎంఎస్) వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం ఇచ్చారుసంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం 2014 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన సందర్భంలో రైతులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదన్నారు. రైతులకు లాభదాయకమైన కనీసం మద్దతు ధర ఇస్తామని మోసం చేసిందన్నారు. పేద మధ్యతరగతి రైతులకు కౌలు రైతులకు వ్యవసాయ కూలీలకు సంపూర్ణ రుణమాఫీని నిరాకరిస్తూ బడా కార్పొరేట్ దోపిడిదారులకు మాత్రం 16 లక్షల కోట్ల రూపాయలు బకాయిలను మాఫీ చేసిందన్నారు. ప్రమాదకరమైన విత్తన బిల్లును తీసుకువచ్చిందని దీనివల్ల భారత ప్రభుత్వానికి విత్తన ఉత్పత్తి తదితర విషయాలపై పూర్తిఅధికారం కోల్పోతుందని ఇది అమెరికా మరియు ఇతర దేశాల కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మారడమేనని ఆయన అన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు జక్కుల తిరుపతి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గట్టి కృష్ణ జిల్లా కోశాధికారి బండి వెంకటేశ్వర్లు ఇనుముల కృష్ణ పిడిఎస్యు వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ తదితరులు ఉన్నారు.

# ఓటర్ల జాబితా సమగ్ర సవరణపై శిక్షణ శిబిరం



**హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 22 (జనంసాక్షి) :** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ వెస్ట్ నియోజకవర్గ ఓటర్ల జాబితా సమగ్ర సవరణ పై శిక్షణ శిబిర కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, గోదా దేవి ఆధ్వర్యంలో ఈ శిక్షణ ప్రక్రియ విజయవంతంగా జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో ముఖ్య అతిథిగా హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, టీపీసీసీ పార్లమెంట్ కోఆర్డినేటర్ శ్రీ నజీర్ హాజరయ్యారు. కార్యక్రమంలో టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాస్ గౌడ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, భట్టి శ్రీనివాసరావు గారు పాల్గొన్నారు. ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసే దిశగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ఒత్తిడి తెచ్చే జేబు సంస్థలుగా మార్చుకుందని ఆరోపించారు. ఈడీ నిర్వహించిన దాడుల్లో 90 శాతానికి పైగా ప్రతిపక్ష పార్టీల నేతలపైనే జరిగాయని పేర్కొన్నారు. ప్రతి పౌరుడి ఓటు హక్కును రక్షించడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు గత రెండున్నర నెలలుగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేస్తున్నారని తెలిపారు. బీఎల్ఏల లిస్ట్ లను సమర్పిస్తే ఎన్నికల సంఘం నమోదు చూపించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రతి ఓటరు తమ ఓటు నమోదును తప్పనిసరిగా పరిశీలించుకుని, అవసరమైతే సవరణలు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వరంగల్ వెస్ట్ లో సుమారు 20 శాతం ఓట్లు తొలగించబడగా, ఇతర ఓట్లకు నోటీసులు జారీ చేయడం ఆందోళనకర పరిణామమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తోటివారిని గౌరవించాలి.. సంతోషంగా జీవించాలి

▫ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి నగేష్ భీమపాక





**రామకృష్ణాపూర్, ఆగస్టు 22(జనంసాక్షి):** సమాజంలో తోటి వారిని గౌరవించుకుంటూ సంతోషంగా బ్రతకాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి నగేష్ భీమపాక అన్నారు. శనివారం జిల్లాలోని మందమర్రి పట్టణంలో ఏర్పాటు చేసిన కోర్ట్ ఆఫ్ జూనియర్ సివిల్ జడ్జ్ – కమ్ – జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు ప్రారంభ కార్యక్రమానికి మంచిర్యాల కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు ఎ.వీరయ్య, శారదా దేవి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల జిల్లా రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్, మందమర్రి కోర్ట్ ఆఫ్ జూనియర్ సివిల్ జడ్జ్ – కమ్ – జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఇంచార్జ్ జడ్జ్ కె.నిరోష, రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్త సత్తయ్య లతో కలిసి హాజరై గౌరవ వందనం స్వీకరించి మొక్కలు నాటిన అనంతరం 3 మతాల పెద్దల సమక్షంలో కోర్టు భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి మాట్లాడుతూ కోర్టు భవనాన్ని ప్రారంభించే కార్యక్రమాన్ని పండుగలా జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పక్కవారిని గౌరవించాలని, సమాజంలో గొడవలకు, కేసుల నమోదుకు మనలోని అహం ప్రధాన కారణమని, ప్రతి ఒక్కరు ఒక్క క్షణం ప్రశాంతంగా ఆలోచిస్తే ఎలాంటి గొడవలకు అవకాశం ఉండదని తెలిపారు. మన ధర్మాలు, గ్రంథాల ప్రకారం ప్రజలలో శాంతి లేకపోవడమే శాంతి భద్రతల విఘాతానికి ప్రధాన కారణమని, ప్రతి ఒక్కరూ సోదర భావంతో మెలగాలని తెలిపారు. న్యాయస్థానాలలో కేసులలో వాయిదా కాలాన్ని తగ్గించి త్వరగా పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ప్రజలు చిన్న చిన్న విషయాలను పట్టించుకోకుండా అందరితో స్నేహభావంతో మెలగాలని, చైతన్యవంతంగా, శక్తివంతంగా, ఆనందంగా బ్రతకాలని తెలిపారు. సింగరేణి కార్మికుల గురించి మాట్లాడుతూ చీకటిలో భూమి పొరల్లో చెమటోడ్చి కష్టపడి దేశానికి వెలుగులు నింపుతున్నారని, వారి శ్రమ గుర్తించదగినదని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మందమర్రి, బెల్లంపల్లి పట్టణాలలో కోర్టు భవనాలను ప్రారంభించడం ద్వారా కేసుల పరిష్కారం మరింత వేగవంతం అవుతుందని తెలిపారు. జిల్లాలో అవసరమైన న్యాయస్థానాలు, న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వ ప్లీడర్లు, అందుబాటులో ఉన్నారని, కేసుల పరిష్కారంలో తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అంతకుముందు మందమర్రి మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయస్థానాల అధికారులు, సిబ్బంది, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### నూతన కోర్టు భవనాన్ని ప్రారంభించిన హైకోర్టు జడ్జి

**బెల్లంపల్లి, ఆగస్టు 22, (జనంసాక్షి) :** బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల ప్రాంతంలో నూతనంగా నిర్మించిన జూనియర్ సివిల్ కోర్టు భవనాన్ని శనివారం రాష్ట్ర హైకోర్టు జడ్జి నగేష్ భీమపాక లాంచనంగా ప్రారంభించారు. బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి శాంతి సోనీ సమక్షంలో హైకోర్టు జడ్జి నగేష్ భీమపాకకు పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు డప్పు చప్పుళ్ళు, గుస్సాడి నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. నూతనంగా నిర్మించిన కోర్టు భవనంలోని న్యాయవాదుల ప్రత్యేక గదులతో పాటు కోర్టు సమావేశ గదిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జి నగేష్ భీమపాక మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమాజంలో శాంతిని నెలకొల్పే ప్రయత్నం చేయాలన్నారు. కుటుంబాలలో అందరూ సహనం, సమానత్వం, గౌరవభావంతో ఉండాలని సూచించారు. గొడవలు, హింసాత్మక ఘటనలకు పాల్పడి కేసుల పాలు కావద్దని సూచించారు. ఎలాంటి సమస్యలున్నా సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని కోరారు. ప్రజలకు న్యాయ సేవలు అందించేందుకే న్యాయస్థానాలు పనిచేస్తాయని సూచించారు. బెల్లంపల్లి ప్రాంతంలో నూతనంగా ఏర్పాటైన జూనియర్ సివిల్ కోర్టును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టులో న్యాయ సేవలు నిత్యం అందుబాటులో ఉంటాయని, ప్రజలు తమ సమస్యలను న్యాయస్థానంలో పరిష్కరించుకొని శాంతియుత జీవనాన్ని కొనసాగించాలని కోరారు. అనంతరం నూతన కోర్టు భవనం ఆవరణలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పలువురు అధికారుల సమక్షంలో మొక్కను నాటి నీళ్లు పోశారు. ప్రకృతిని పరిరక్షించడంలో భాగంగా న్యాయవాదులు కోర్టు ప్రాంగణాన్ని పచ్చదనంతో సుందరంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెషన్స్ జడ్జి ఏ వీరయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ఏసీపీ కిరణ్ కుమార్, బెల్లంపల్లి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మెరుగు శ్రీనివాస్, పలువురు సివిల్ కోర్టు న్యాయమూర్తులు, బెల్లంపల్లి బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# దిక్కులేని వికలాంగుడికి ఇందిరమ్మ ఇల్లే దిక్కు



**కెరమెరి, ఆగస్టు 22 (జనంసాక్షి) :** కెరమెరి మండలం తుమ్మగూడ గ్రామానికి చెందిన ధారావత్ తిరుపతి కథ వింటే కన్నీరు ఆగదు. పుట్టుకతోనే విధి చిన్నచూపు చూసింది. నడవలేని వికలాంగుడు. అటు తల్లి,ఇటు తండ్రి లేని అనాథ. ఈ లోకంలో తనకున్న ఏకైక ఆధారం, తలదాచుకోవడానికి ఉన్న ఆ చిన్న పెంకుటిల్లు మాత్రమే. ఆ ఇల్లే తనకు అమ్మ, ఆ ఇల్లే తనకు నాన్న. కానీ 20 రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఆ నిరుపేద అనాథ ఆశల గూడు కుప్పకూలింది. పెంకులన్నీ నేలమట్టం అయ్యాయి. నడవలేని స్థితిలో ఉన్న తిరుపతి దగ్గరి బంధువుల ఇంటి వరండాలో దిక్కులేని వాడిలా జీవనం సాగిస్తున్నాడు. ఫోటోలో కనిపిస్తున్న అతని నమస్కారం వెనుక వేల ప్రశ్నలు ఉన్నాయి. "నాకు ఎవరు దిక్కు? ప్రభుత్వం నన్ను ఆదుకుంటుందా?" అని అడుగుతున్నట్టుగా ఉంది. ఇల్లు కూలిపోయి 20 రోజులు గడుస్తున్నా ఇంతవరకు ఎటువంటి సహాయం అందలేదని తిరుపతి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం కాదు, రెక్కాడలేని అనాథ వికలాంగుడి కుటుంబం ఇది.

తిరుపతి ప్రభుత్వానికి చేస్తున్న వేడుకోలు ఒక్కటే... "నాకు ఎవరూ లేరు. నేను నడవలేను. కూలీ పనికి కూడా పోలేను. నా ఇల్లు కూలిపోవడంతో బిక్కుబిక్కుమంటూ బ్రతుకుతున్నా. రేవంత్ రెడ్డి సార్ ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇల్లు నాకు మంజూరు చేసి న్యాయం చేయండి. నాకు ఒక పూరి గుడిసె లాంటి ఇల్లు ఇచ్చినా చాలు, నా జీవితాంతం మీకు రుణపడి ఉంటాను" అంటూ రెండు చేతులు జోడించి వేడుకుంటున్నాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు మానవతా దృక్పథంతో ఆలోచించి, వెంటనే స్పందించి ఈ అనాథ వికలాంగుడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, ఆదుకోవాలని తిరుపతి వేడుకుంటున్నాడు.

# సెయింట్ పాల్ స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం

▫ డ్రైవర్ తప్పిదమే కారణమంటున్న స్థానికులు..

▫ వరుస ఘటనలతో తల్లిదండ్రుల్లో ఆందోళన




**తొర్రూరు , ఆగస్టు 22 (జనం సాక్షి):** తొర్రూరు పట్టణంలో శనివారం ఉదయం సెయింట్ పాల్ స్కూల్ బస్సుకు ప్రమాదం తప్పింది. బస్సులో ఉన్న విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. స్కూల్ బస్సు ప్రమాదానికి డ్రైవర్ తప్పిదమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ శివారులోని సెయింట్ ఫాల్స్ పాఠశాలకు చెందిన బస్సు వెళ్తుండగా లారీ ఢీకొట్టింది.లారీ డ్రైవర్ నియంత్రణ కోల్పోయి స్కూల్ బస్సును ఢీకొట్టడంతో పక్కనే ఉన్న మరో లారీ ముందు భాగం కూడా దెబ్బతిన్నట్లు తెలిసింది. స్కూల్ బస్సులో సుమారు 50 మందికి పైగా విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. అయితే ప్రమాదంలో విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనతో కొద్దిసేపు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు.

సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మండల విద్యాశాఖ అధికారి కూడా అక్కడికి వచ్చినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. శుక్రవారం ఉదయం జరిగిన స్కూల్ బస్సు ఘటన నుంచి తేరుకోకముందే శనివారం మరో స్కూల్ బస్సుకు ప్రమాదం తప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది.

వరుస ఘటనల నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల బస్సుల భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. జిల్లా రవాణా శాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు మరోసారి ప్రైవేట్ పాఠశాలల బస్సులను తనిఖీ చేసి, నిబంధనలు పాటిస్తున్నారా లేదా పరిశీలించాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆరుతడి పంటలను సాగుచేయండి

▫ ఎమ్మెల్యే కోరం కనకయ్య



**బయ్యారం ఆగస్ట్ 22 (జనంసాక్షి) :** ప్రస్తుత ఎల్ నినో నేపథ్యంలో రైతులు వరి సాగు తగ్గించి ఆరుతడి,నీరు తక్కువ అవసరమున్న పంటలను సాగుచేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య రైతులకు సూచించారు. శనివారం మండలంలోని సంతులాల పోడు గ్రామానికి చెందిన చాగర్లమూడి భాస్కర్ రావు పొలంలో ట్రాక్టర్ తో దున్ని పెసర విత్తనాలను ఎదపెట్టి రైతులను ఉత్సాహ పరిచారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వాతావరణ పరిస్థితులు, వర్షపాతం,భూగర్భజలాల స్థాయి దృష్ట్యా రైతులను ఆరుతడి పంటలను సాగు చేయాలని ఇచ్చిన పిలుపు మేరకు భాస్కర్ రావు తన 12 ఎకరాల్లో పెసర పంట సాగుకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. బయ్యారం పెద్ద చెరువు కింద వున్న మిగతా రైతాంగం కూడా ఆరు తడి పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులు పంట సాగుకు ముందు,విత్తన ఎంపిక,ఎరువుల వాడకం పై వ్యవసాయ అధికారుల సూచనలు,సలహాలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ముందుగా గ్రామంలో రైతులతో ప్రదర్శన నిర్వహించారు.అనంతరం గ్రామంలో స్మార్ట్ కార్డులను పంపిణి చేసారు. కొత్తపేట గ్రామ పంచాయతీలో 30 లక్షల రూపాయల నిధులతో తో నిర్మించ తలపెట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి స్థలాన్ని ఉచితంగా ఇచ్చిన దాత వెంకటేశ్వరావు ని ఎమ్మేల్యే ఘనంగా సన్మానించారు. అక్కడి నుండి కొత్త ఇర్సులాపురం చేరుకున్న ఎమ్మేల్యే శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మరణించిన రాసమల్ల మంగమ్మ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, మాజి సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి,సర్పంచులు మణి,ప్రవీణ్ నాయక్,సొసైటీ డైరెక్టర్ భాస్కర్ రావు, రైతులు, పాల్గొన్నారు.




# అధికారపార్టీ నేత అక్రమ ఇసుక దందా

▫ అడ్డుకున్న మైనింగ్ సిబ్బంది

▫ రెండు ట్రాక్టర్లు ఓ జేసీబీ సీజ్

**చెన్నూర్ ఆగస్టు 22 (జనం సాక్షి) :** అధికారుల కళ్లుగప్పి అడ్డదారిన సొమ్ము చేసుకోవాలని ఆరాట పడిన అధికారపార్టీ ఆగడాలకు మైనింగ్ అధికారులు అడ్డుకట్ట వేశారు. శనివారం రోజున కత్తరశాల వాగు నుండి కత్తరశాల గ్రామ సర్పంచ్ భర్త జేసీబీ, ట్రాక్టర్లతో తవ్వకాలు నిర్వహిస్తుండగా, మైనింగ్ అధికారులు దాడి చేసి ఓ జేసీబీ రెండు ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని చెన్నూరు పోలీస్ స్టేషన్ కు తరలించారు. అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకున్న మైనింగ్ సిబ్బందికి అధికారపార్టీ సర్పంచ్ భర్తకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకోగా, పోలీసుల సహకారంతో పట్టుకున్న వాహనాలను పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు మైనింగ్ సిబ్బంది తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమ ఇసుక, మట్టి తవ్వకాలు నిర్వహించే వారు ఎంతవారైనా ఉపేక్షించబోమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మైనింగ్ సిబ్బంది పేర్కొన్నారు. కాగా కత్తరశాల సర్పంచ్ భర్త అక్రమ ఇసుక తవ్వకాలపై స్థానిక మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అసహనం వ్యక్తం చేస్తూ, అక్రమ తవ్వకాలు నిర్వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని మైనింగ్ అధికారులను అదేశించినట్లు సమాచారం.

# అధికారుల మార్పు.. ఆర్టీఐ బోర్డు మాత్రం పాతదే!




**దేవరుప్పుల ఆగస్టు 22 (జనం సాక్షి) :** దేవరుప్పుల పీహెచ్‌సీలో ఆర్టీఐ బోర్డుపై అధికారులు మారినా పాత పేర్లు, ఫోన్ నంబర్లే కొనసాగుతున్నాయని సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ జనగామ జిల్లా కార్యదర్శి నల్ల విక్రమ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత నంబర్లతో ప్రజలు, దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ప్రస్తుత అధికారుల పేర్లు, అధికారిక ఫోన్ నంబర్లతో కొత్త ఆర్టీఐ బోర్డు ఏర్పాటు చేయాలని, నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# భూ దోపిడీదారుగా కాంగ్రెస్ ప్రభుత్వం

- 22 ఏ జీవోతో మధ్యతరగతి వర్గాల్లో అలజడి
- నిషేధిత జాబితాలో కోటి ఎకరాలు ఎలా చేరాయి..?
- క్షమాపణ చెప్పినా జీవో రద్దు చేయని మంత్రి పొంగులేటి
- ఖమ్మంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు..!



**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, ఆగస్టు 22 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూ దోపిడీ దారుగా మారిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. శనివారం ఖమ్మం నగరంలోని వివిసి ఫంక్షన్ హాల్ లో ఖమ్మం వన్ టౌన్, టూ టౌన్ ప్రాంతాల పరిధిలోని బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు, బి ఎల్ ఏ లతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన అజయ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ ప్రజల ఆస్తులను కుల్లగొట్టే పనిలో నిమగ్నమైందని పేర్కొన్నారు. ప్రధానంగా హైదరాబాదులో హైడ్రాతో పేదల ఇండ్లను కూలుస్తూనే తాజాగా 22 ఏ చట్టాన్ని ప్రయోగించేందుకు సన్నద్ధమైందన్నారు. దీంతో మధ్య తరగతి వర్గాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు తొమ్మిది లక్షల ఎకరాలు మాత్రమే నిషేధిత జాబితాలో ఉన్నాయన్నారు. వాటి సంఖ్య కోటి ఎకరాలకు ఎలా పెరిగిందో ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.

### సారీ చెప్పి జీవో రద్దు చేయలేదు..!

గడిచిన మూడేళ్ల కాలంలో కాంగ్రెస్ పాలకులు రక్తం మరిగిన క్రూర మృగాలుగా వ్యవహరిస్తూ ప్రజల ఆస్తులను స్వాహా చేసేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తామని చెప్పిన కాంగ్రెస్ పెద్దలు భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చి పేదల భూములను గుంజుకుంటున్నారని ధ్వజమెత్తారు. 22 ఏ జీవో పట్ల రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సారీ చెప్పి వారం రోజులు అవుతున్నప్పటికీ దానిని రద్దు చేయకపోవడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అంటేనే ఖతం పట్టించే పార్టీగా ముద్ర వేసుకుందన్నారు.

### మంత్రి తుమ్మల బహిరంగ చర్చకు సిద్ధమా..!

రైతులకు రెండు లక్షల రుణ మాఫీ చేశామంటూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పదేపదే అబద్ధాలు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ అన్నారు. ఖమ్మం జిల్లాతో పాటు ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం రఘునాథపాలెం మండలంలో ఎక్కడికి రమ్మన్నా తాను వస్తానని, రుణమాఫీ పూర్తి స్థాయిలో జరగలేదని నిరూపిస్తానని పేర్కొన్నారు. ఈ విషయమై మంత్రి తుమ్మల బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. మైకుల ముందు మాట్లాడడం కాదని, రైతుల వద్దకు నేరుగా వెళితే నిజాలు తెలుస్తాయని హితవు పలికారు.

### మూడు కోతుల్లా ముగ్గురు మంత్రులు

తెలంగాణ క్యాబినెట్ కు ఖమ్మం నుంచి ప్రాతినిత్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులు మూడు కోతుల మాదిరి వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ఎద్దేవా చేశారు. వెలుగుమట్లలో పేదల ఇండ్లు కూల్చినా ఒక్క మంత్రి కూడా అటువైపు కన్నెత్తి చూడకపోవడం దారుణమన్నారు. ఇటీవల వేణు అనే నిరుద్యోగి ఆత్మహత్యకు పాల్పడితే బీఆర్ఎస్ పార్టీ నేతలే వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పడం జరిగిందని, అధికార మంత్రులు ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. కమీషన్ లే మిషన్ గా మార్చుకొని కాంగ్రెస్ పాలన సాగిస్తుందని, మరో రెండేళ్లలో బిఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. అనంతరం ఎస్ ఐ ఆర్ మొదటి విడత ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్న బీఆర్ఎస్ బి ఎల్ ఏ లను మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఘనంగా సన్మానించి, పత్రాలను అందజేశారు. బీఆర్ఎస్ ఖమ్మం నగర మాజీ అధ్యక్షుడు పగడాల నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ, కూరాకుల నాగభూషణం, ఎండి ఖమర్, బి రెడ్డి నాగచంద్రారెడ్డి, బత్తుల మురళి, నాగండ్ల కోటేశ్వరరావు, శీలంశెట్టి వీరభద్రం, షేక్ మక్బూల్, బిక్కసాని జస్వంత్, ఊట్కూరి రవికాంత్, పల్లా రోజ్ లీనా, ఉబ్బన నిరోషా, ఎండి వై పాషా తదితరులు పాల్గొన్నారు.

## జీవో నం.97ను తక్షణమే రద్దు చేయాలి




**ఇబ్రహీంపట్నం, ఆగష్టు 22 (జనం సాక్షి) :** విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాలిటెక్నిక్ విద్యను దెబ్బతీసే జీవో నం.97ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి హాజరై ఆయన పూర్తయిన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడం వల్ల విద్యా ఖర్చులు పెరిగి పేద, మధ్యతరగతి విద్యార్థులకు సాంకేతిక విద్య దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐసిటిఈ ఆమోదం, సిలబస్, సర్టిఫికెట్ల చెల్లుబాటుతో పాటు ఈసెట్ ద్వారా బి ఈ ./బి .టెక్ లో పొందే లేటరల్ ఎంట్రీ అవకాశాలపై ప్రభుత్వం స్పష్టమైన భరోసా ఇవ్వాలన్నారు. అలాగే ప్రజాధనంతో సమకూర్చిన పాలిటెక్నిక్ భూములు, భవనాలను ఇతర సంస్థలకు బదిలీ చేయవద్దని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు గొంతు పట్టుకోవడం, లాఠీచార్జ్ చేయడం దారుణమని, ఈ దౌర్జన్యానికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే విద్యార్థి లోకంతో కలిసి 'మిలియన్ మార్చ్' తరహాలో ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతో పేదల సొంతింటి కల సాకారం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగష్టు 22 (జనం సాక్షి) :** పేదల జీవిత స్వప్నమైన సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని,, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ పట్టణంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన అనంతరం ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నియోజకవర్గానికి 3,500 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు అదనంగా నిజామాబాద్ జిల్లాకు మరిన్ని ఇళ్లు మంజూరు చేసి లబ్ధిదారులకు అందిస్తున్నామని చెప్పారు. అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

### ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

నిజామాబాద్ జిల్లా అభివృద్ధిపై మరోసారి సమగ్ర సమీక్ష నిర్వహించి,




పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, కవిత, పట్టణ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి న్యాయ, పోలీసు శాఖల సమన్వయం

**నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 22 (జనం సాక్షి) :** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులను సత్వరంగా పరిష్కరించడంతో పాటు, నేరస్థులకు శిక్షలు పడేలా పకడ్బందీగా దర్యాప్తు నిర్వహించాలని జిల్లా జడ్జి పి. వసంత్ సూచించారు. న్యాయ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు సత్వర న్యాయం అందించాలని ఆయన అన్నారు. శనివారం నల్లగొండ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో జిల్లా న్యాయశాఖ, జిల్లా పరిపాలన, పోలీసు శాఖల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా జడ్జి పి. వసంత్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ పాల్గొని జిల్లాలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్, ప్రాక్టికల్, అండర్ ట్రయల్, పరారీ నిందితులు, ఎన్‌బీడబ్ల్యూ కేసులపై సమగ్రంగా సమీక్షించారు.

### రూపారెడ్డి హత్య కేసును ఛేదించిన పోలీసులకు అభినందన

ఇటీవల సంచలనం సృష్టించిన కొండమల్లేపల్లి నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపా రెడ్డి హత్య కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితులను త్వరితగతిన గుర్తించి అరెస్టు చేసిన పోలీసులను జిల్లా జడ్జి పి. వసంత్ అభినందించారు. సుమారు 40 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి శాస్త్రీయ దర్యాప్తు,



సాంకేతిక ఆధారాల సహాయంతో కేసును ఛేదించిన పోలీసుల పనితీరును ప్రశంసించారు. గతంలో మహబూబాబాద్ జిల్లాలోనూ ఎస్పీ శరత్ చంద్ర పవార్ కీలక కేసులను సమర్థవంతంగా ఛేదించడంలో మంచి ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. జిల్లాలో పెండింగ్ కేసుల పరిష్కారానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, న్యాయ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని జిల్లా జడ్జి సూచించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా అడిషనల్ జడ్జి కే. కవిత, డీఎస్పీలు, సీఐలు, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు డ్యూటీ అధికారులు, న్యాయశాఖ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మిర్చి నారుపై గడ్డి మందు పిచికారీ

- కన్నీరుమున్నీరవుతున్న రైతు



పెద్దవూర, ఆగస్టు 22 (జనం సాక్షి) : కంటికి రెప్పలా కాపాడుకున్న మిర్చి నారు చేతికి అందే సమయంలో.. గుర్తుతెలియని వ్యక్తులు చేసిన దారుణానికి ఓ రైతు నిలువునా మునిగిపోయాడు. నల్గొండ జిల్లా పెద్దవూర మండలం సిరసనగండ్ల గ్రామంలో ఈ అమానుష ఘటన చోటుచేసుకుంది.

### ఘటన వివరాలు

సిరసనగండ్ల గ్రామానికి చెందిన రైతు దొరేపెల్లి శంకర్ ఎంతో శ్రమించి, పెట్టుబడి పెట్టి మిర్చి నారు పెంచాడు. పంట చేతికి వచ్చి నాటుకునే సమయానికి, ఓర్వలేని కొందరు దుండగులు రాత్రికి రాత్రే మిర్చి నారుపై గడ్డి మందు (కలుపు సంహారకం) పిచికారీ చేశారు. దీంతో పచ్చగా కళకళలాడాల్సిన నారుమడి కాస్తా పూర్తిగా ఎండిపోయి బూడిదపాలైంది.

### కన్నీటిపర్యంతమైన రైతు

ఉదయమే చేను వద్దకు వెళ్లిన రైతు శంకర్ ఎండిపోయిన నారును చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. "ఎంతో కష్టపడి పెంచుకున్న నారును ఓర్వలేక ఇలా నాశనం చేయడం ఏంటి?" అని కన్నీరుమున్నీరయ్యాడు. లక్షల్లో నష్టం వాటిల్లడంతో తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాడు.

### న్యాయం చేయాలని విజ్ఞప్తి

ఈ దారుణంపై బాధిత రైతు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, ఈ దుశ్చర్యకు పాల్పడిన నిందితులను త్వరగా గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. అలాగే వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి, పంట నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందించి ఆదుకోవాలని రైతు శంకర్ ఆవేదనతో విజ్ఞప్తి చేస్తున్నారు.

## బునాదిగాని కాలువ మట్టి మాయం

- ఎలాంటి అనుమతులు వద్దు, అధికారులు ఉండగా..
- మట్టి వెనక మంత్రి, ఎమ్మెల్యే, హస్తమని ప్రచారం

**ఆత్మకూర్, ఆగస్టు 22 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని పోసానికుంట స్టేజీ సమీపంలో భునాది కాలువ మట్టి ఎలాంటి అనుమతులు లేకుండా 10, 15 రోజుల నుంచి జేసిబి సహాయంతో కాలువ మట్టిని ఎత్తుకుపోతున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. జేసిబి లతో వందల టిప్పర్లు, మట్టిని తరలిస్తున్నా అధి కారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఆత్మకూరు మండలంలోని వివిధ గ్రామాల్లో అక్రమార్కులు తవ్వకాలు జరిపి మట్టిని కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఎర్రమట్టి, మొరం తవ్వకాలకు సైతం అనుమతులు తప్పనిసరి. మైనింగ్ శాఖకు దరఖాస్తు చేసుకొని కావాల్సిన మట్టి పరిమాణానికి ఆన్లైన్లో చెల్లింపులు చేయాలి. తహసీల్దార్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఎన్వోసీ జారీ చేసిన తర్వాతనే తరలించాలి. కానీ ఇక్కడ ఇవేమీ తమకు వర్తిం చవన్న చందంగా గుత్తేదారులు ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రభుత్వం గతంలో రూ. లక్షలు వెచ్చించి తవ్విచ్చిన సాగు నీటి కాల్వ మట్టిని తరలిస్తున్నారు. చెరువులు, గుట్టలు, ప్రభుత్వ, పట్టా భూముల్లో తవ్వకాలు చేపట్టే ముందు విధిగా అనుమతులు తీసుకోవాలి. కాని ఇవి ఏమి లేకుండా ప్రతి రోజు 50 నుంచి 60 ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నారు. దీని కి సంబందించిన పర్మిషన్ పేపర్లు మాత్రము లేవు, పర్మిషన్ పేపర్లు ఏవి అని అడిగితే రేపు చూపిస్తాము ఎల్లుండి చూపిస్తాము అని అంటున్నారు. ఇది ఇలా ఉండగా ఈ మట్టి కుంబకోణం వెనుక మంత్రి, వున్నారు, ఎమ్మెల్యే వున్నారు అని ప్రచారం చేస్తున్నారు. మరి ఇది ఎంత వరకు నిజం అనేది తెలాలి.




## ప్రభుత్వం అందిస్తున్న పేదల బియ్యం పక్కదారి

### పిడిఎస్ బియ్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు




**నూతనకల్, ఆగస్టు 22 (జనంసాక్షి) :** నూతనకల్ మండలం మిర్యాల గ్రామంలో అక్రమంగా పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు గౌడ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రామన్నగూడెం గ్రామం, ఆత్మకూర్ (ఎస్) మండలానికి చెందిన చలమల వీరస్వామి,తండ్రి యల్లయ్య, అతని కుమారుడు చలమల లెనిన్,మిర్యాల గ్రామానికి చెందిన రేషన్ డీలర్ కృష్ణారెడ్డి వద్ద నుండి ప్రభుత్వం పేద నిరుపేద కుటుంబాలకు అందిస్తున్న సుమారు 25.5 క్వింటాళ్ల పీడీఎస్ సన్న బియ్యాన్ని కిలోకు రూ.15/- చొప్పున బేరం కుదుర్చుకొని అక్రమ రవాణాకు పూనుకున్నారు. అనంతరం ఆ బియ్యాన్ని అశోక్ లేలాండ్ మినీ గూడ్స్ వాహనం నంబర్ టీఎస్-07-యుజె -0634 లో లోడ్ చేసుకుని అర్ధరాత్రి మద్దిరాల మండలం మామిళ్లమడవ గ్రామ శివారులోని కోళ్లఫారానికి తరలిస్తుండగా,నమ్మదగిన సమాచారం మేరకు నూతనకల్ పోలీసులు మిర్యాల గ్రామ శివారులో వాహనాన్ని తనిఖీ చేసి పట్టుకున్నారు. వాహనంలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 25.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని,సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం,విక్రయించడం లేదా తరలించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

## ఖమ్మం ఖిల్లా రోప్ వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 22 (జనం సాక్షి) :** ఖమ్మం ఖిల్లా రోప్ వే నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఖిల్లా రోప్ వే నిర్మాణ పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, జరుగుతున్న నిర్మాణ ప్రక్రియ, పనుల పురోగతి తదితర వివరాలను సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖిల్లా పైకి వెళ్లి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి రోప్ వే నిర్మాణ పనులు ఆశించిన వేగంతో జరగడం లేదని, పనుల్లో వేగం పెంచాలని సూచించారు. నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను ముందస్తుగానే పక్కా ప్రణాళికతో సమకూర్చుకోవాలని, మెటీరియల్ కొరత కారణంగా పనులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఫాలోఅప్ చేయాలని కలెక్టర్ సూచించారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ప్రతి దశ పనులను పూర్తి చేసేలా పక్కా కార్యాచరణ



రూపొందించుకోవాలని అన్నారు. రోప్ వే నిర్మాణంలో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఖిల్లా ప్రాంతంలో షీట్ రాక్ ఉన్నందున జియాలజిస్ట్‌తో సమన్వయం చేసుకుని భౌగోళిక పరిస్థితులను పూర్తిగా పరిశీలించాలని సూచించారు. నిర్మాణానికి సంబంధించిన అవసరమైన అన్ని సాంకేతిక పరీక్షలను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. రోప్ వే నిర్మాణం అత్యంత పటిష్టంగా, సురక్షితంగా ఉండేలా అన్ని సాంకేతిక ప్రమాణాలను పాటించాలని కలెక్టర్ అన్నారు. పనుల నాణ్యత, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రతి నిర్మాణ దశలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలిస్తూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. ఖమ్మం ఖిల్లాకు మరింత మంది పర్యాటకులను ఆకర్షించేలా ప్రత్యేక పర్యాటక ఆకర్షణ కార్యక్రమాలు, సౌకర్యాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఖిల్లాపై స్టార్ గేజింగ్ కోసం టెలిస్కోప్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని, దీనివల్ల సందర్శకులకు ప్రత్యేక అనుభూతి కల్పించడంతో పాటు పర్యాటక ఆకర్షణ మరింత పెరుగుతుందని అన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం ఖిల్లాపై ఒక క్యాంటీన్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తద్వారా పర్యాటకులకు అవసరమైన ఆహార, త్రాగునీటి సౌకర్యాలు అందడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని అన్నారు.

పర్యాటకుల వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాన్ని తహసీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలించి గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఖిల్లాకు వచ్చే పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉండేలా పార్కింగ్ ప్రాంతాన్ని ముందస్తుగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా టూరిజం శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచంద్ర, సంబంధిత అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి కుంటల నిర్మాణంతో భూగర్భ జలాల అభివృద్ధి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం/కూసుమంచి, ఆగస్టు 22 (జనం సాక్షి) :** రైతుల పొలాల్లో నిర్మిస్తున్న నీటి కుంటలు (ఫారం పాండ్లు) భూగర్భ జలాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ శ్రీ దివాకర టిఎస్ అన్నారు. శనివారం కూసుమంచి మండల కేంద్రానికి చెందిన రైతు అర్వపల్లి వెంకటేశ్వర్లు పొలంలో నిర్మిస్తున్న నీటి కుంటను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రధాన రహదారి నుంచి సుమారు 600 మీటర్ల మేర డొంక రహదారిలో నడుచుకుంటూ వెళ్లి నీటి కుంట నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నీటి కుంటల నిర్మాణం వల్ల వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు, ఆ నీరు భూమిలోకి ఇంకి సమీపంలోని బోర్లు, బావుల్లో భూగర్భ జలమట్టం పెరుగుతుందని అన్నారు. నీటి నిల్వలు పెరగడం వల్ల భవిష్యత్తులో మత్స్య సంపద అభివృద్ధికి కూడా అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు తమ పొలాల్లో నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నీటి కుంట నిర్మాణం, పనుల పురోగతి, రైతులకు కలిగే ప్రయోజనాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి, రైతులకు ఉపయోగపడే విధంగా పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి తహసీల్దార్ సైదులు, గ్రామపంచాయతీ సర్పంచ్ కొండ కృష్ణవేణి, గ్రామపంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.




# స్వల్ప లాభాలతో సరి




## అమెరికాతో రూ.3800 కోట్లకు టిక్‌టాక్ ఒప్పందం..!

**వాషింగ్టన్(జనంసాక్షి):**చిన్నారుల భద్రతకు సంబంధించిన కేసును పరిష్కరించుకునేందుకు ప్రముఖ షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్ అమెరికా ప్రభుత్వంతో రాజీకొచ్చింది. ఇందుకుగాను ఆ దేశ న్యాయ విభాగానికి 400 మిలియన్ డాలర్లు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మొత్తాన్ని రెండు దఫాలలో చెల్లించనున్నట్లు వెల్లడించింది. దీంతో 2024లో దాఖలైన ఈ వ్యాజ్యం ముగిసింది. టిక్‌టాక్ తమతో రాజీ చేసుకోవడం దేశంలోని పిల్లలు, తల్లిదండ్రులకు ఒక పెద్ద విజయమని అమెరికా అసోసియేట్ అటార్నీ జనరల్ స్టాన్లీ పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో పిల్లలకు రక్షణ కల్పించడం.. వారి వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియా యాప్‌లు గోప్యంగా ఉంచేలా పర్యవేక్షించడం తమ బాధ్యత అని తెలిపారు. 13 ఏళ్లలోపు పిల్లల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించే ముందు, పిల్లల కోసం ఉద్దేశించిన యాప్‌లు, వెబ్‌సైట్‌లు తల్లిదండ్రుల అనుమతి తీసుకోవాలని నిర్దేశించే ఫెడరల్ చట్టాన్ని టిక్‌టాక్, దాని చైనా ఆధారిత మాతృ సంస్థ బైట్‌డాన్స్ ఉల్లంఘించాయని ఆరోపిస్తూ.. 2024లో న్యాయ శాఖ వ్యాజ్యం దాఖలు చేసింది. నాటి నుంచి టిక్‌టాక్‌లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. చైనాకు చెందిన బైట్‌డ్యాన్స్ సంస్థ తన వాటాలను తగ్గించుకుంది. దీంతో కొత్త టిక్‌టాక్ యూఎస్ జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయడానికి ఒరాకిల్ సిల్వర్ లేక్, ఎమిరేట్స్ పెట్టుబడి సంస్థ ఎంజీఎక్స్ వంటి ప్రధాన పెట్టుబడిదారులతో ఒప్పందం చేసుకుంది.పిల్లల భద్రత, గోప్యతపై సోషల్ మీడియా కంపెనీలు పెద్ద సంఖ్యలో వ్యాజ్యాలను ఎదుర్కొంటున్న తరుణంలో టిక్‌టాక్ అమెరికా ప్రభుత్వంతో రాజీ కుదుర్చుకోవడం గమనార్హం. మరోవైపు 1998 నాటి బాలల ఆన్‌లైన్ గోప్యతా పరిరక్షణ చట్టం తో పాటు.. వివిధ రాష్ట్ర చట్టాలను ఉల్లంఘించిందనే ఆరోపణలు వచ్చాయి

## ఎఫ్ఐఐ విక్రయాలు.. రూ.542.71 కోట్లు
## డీఐఐ కొనుగోళ్లు.. రూ.2124.14 కోట్లు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
వరుసగా ఏడు రోజుల నష్టాల అనంతరం గురువారం లాభాల్లోకి వచ్చిన సూచీలు.. శుక్రవారమూ స్వల్ప లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు పెరుగుతుండటం, అమెరికా మార్కెట్లు భారీగా నష్టపోవడంతో మదుపర్లు అప్రమత్తతతో వ్యవహరించడం ఇందుకు కారణం. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 3 పైసలు పెరిగి 95.71 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 0.7% పెరిగి 94.40 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.34,000 కోట్లు పెరిగి రూ.491.75 లక్షల కోట్ల (5.14 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. ఒడుదొడుకుల్లో..: ఉదయం సెన్సెక్స్ 77,701.07 పాయింట్ల వద్ద లాభాల్లో (క్రితం ముగింపు 77,537.72) ఆరంభమైంది. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకున్న సూచీ, మళ్లీ లాభాల్లోకి వచ్చింది. అప్పటి నుంచి ఒడుదొడుకుల మధ్య కదలాడుతూ చివరకు 3.11 పాయింట్ల లాభంతో 77,540.83 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 20.15 పాయింట్లు పెరిగి 24,252 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,206.80 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని; 24,284.05 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని ఈ సూచీ తాకింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 468.42 పాయింట్లు, నిఫ్టీ 114 పాయింట్లు కోల్పోయాయి. సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 14 మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. ట్రెంట్ 1.53%, మారుతీ సుజుకీ 1.51%, ఇండిగో 1.35%, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 1.21%,



హిందుస్థాన్ యునిలీవర్ 0.96%, ఇన్ఫోసిస్ 0.9% నష్టపోయాయి. పవర్‌గ్రిడ్ 2.66%, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ 1.17%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.08%, ఎన్‌టీపీసీ 0.61%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.6% లాభపడ్డాయి. కాల్గేట్ పామోలివ్ ఇండియా సీఈఓ, ఎండీగా మనీశ్ ఆనందని నియమితులయ్యారు. ప్రస్తుతం ఈ బాధ్యతల్లో ఉన్న ప్రభా నరసింహన్‌ను సంస్థ ఆసియా-పసిఫిక్ విభాగానికి ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా పదోన్నతి కల్పించింది. కాల్గేట్ పామోలివ్ ఇండియా సీఈఓ బాధ్యతల నుంచి సెప్టెంబరు 27న వ్యాపార పనివేళలు ముగిశాక ప్రభా వైదొలుగుతారు. సెప్టెంబరు 28 నుంచి అయిదు సంవత్సరాల పాటు ఎండీ, సీఈఓగా ఆనందని కొనసాగుతారు. అమెరికాలోని తన తయారీ కేంద్రం నుంచి పైపులను సరఫరా చేసేందుకు రూ.17,200 కోట్ల విలువైన ఆర్డరు లభించిందని వెల్‌స్పన్ కార్ప్ తెలిపింది. ఈ ఆర్డరుతో తమ మొత్తం అంతర్జాతీయ ఆర్డర్ల విలువ 4.4 బిలియన్ డాలర్ల (రూ.42,100 కోట్ల)కు చేరిందని వెల్లడించింది. కంపెనీ చరిత్రలోనే ఇది అత్యధికమని పేర్కొంది. ఫలితంగా ఎన్ఎస్ఈలో షేరు 15.30% దూసుకెళ్లి, రూ.2,311.90 వద్ద స్థిరపడింది.

ఐపీఓ సమాచారం


గజ ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ ఐపీఓ ముగిసేసరికి 31.33 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 11.03 రెట్లు అధికంగా బిడ్‌లు దాఖలయ్యాయి. టెంప్‌సెన్స్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఐపీఓ రెండో రోజుకే 21.65 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 18.65 రెట్లు అధికంగా బిడ్‌లు వచ్చాయి. ల్యామినో ఇండస్ట్రీస్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ఈనెల 27న ప్రారంభమై, 31న ముగియనుంది. ఇష్యూకు ధరల శ్రేణి రూ.78-82. ప్రతిపాదిత ఐపీఓ ద్వారా రూ.700 కోట్లను సమీకరించనుంది.మాధురి నిట్ క్రాఫ్ట్స్ ఐపీఓ ఈనెల 24న మొదలై 27న ముగియనుంది. ఇష్యూలో భాగంగా విక్రయించే షేర్లకు ధరల శ్రేణి రూ. 95-100. ఐపీఓ పరిమాణం రూ.53.28 కోట్లు.

## బీఎండబ్ల్యూ ఎక్స్1 ఎస్‌యూవీలో లాంగ్ వీల్‌బేస్ వెర్షన్

**పరిచయ ధర రూ.49.90 లక్షలు**

దేశీయంగా విలాసవంత కార్లను తొలిసారి కొనుగోలు చేస్తున్న వారే లక్ష్యంగా ఎక్స్1 ఎస్‌యూవీ మోడల్‌లో లాంగ్- వీల్‌బేస్ వెర్షన్‌ను బీఎండబ్ల్యూ తీసుకొచ్చింది. దీని పరిచయ ధర రూ.49.9 లక్షలు (ఎక్స్‌షోరూం). చెన్నైలోని బీఎండబ్ల్యూ గ్రూపు ప్లాంటులో ఇది తయారయ్యింది. ఇదే ప్లాంటులోనే తయారవుతున్న ఐ5 లాంగ్- వీల్‌బేస్ విద్యుత్ సెడాన్‌ను కూడా బీఎండబ్ల్యూ ఆవిష్కరించింది. రాబోయే వారాల్లో ఇది మార్కెట్లోకి వస్తుందని కంపెనీ తెలిపింది. 2026లో 25 కొత్త మోడళ్లను విడుదల చేయనున్నట్లు బీఎండబ్ల్యూ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో ఇప్పటికే 13 మోడళ్లను పరిచయం చేసింది. '2026 తొలి అర్ధభాగం మాకు అద్భుతంగా గడిచింది. 9,000 కార్లను డెలివరీ చేశాం. వార్షికంగా 17% వృద్ధి ఇది. మా విద్యుత్ వాహనాల అమ్మకాల్లో 78% పెరుగుదల ఉంద'ని బీఎండబ్ల్యూ గ్రూపు ఇండియా ప్రెసిడెంట్, సీఈఓ హర్దీప్ సింగ్ బ్రార్ తెలిపారు.








## నాలుగేళ్లలోపు చిన్నారులకు ఆ మెడిసిన్ వద్దు

చిన్నారుల ఆరోగ్యం దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్లోర్‌ఫెనిరమైన్ మలేట్ ఫెనిలెఫ్రిన్ హైడ్రోక్లోరైడ్ కాంబినేషన్ ఔషధాల వినియోగంపై పరిమితి విధించింది. ఈ ఫార్ములేషన్ కాంబినేషన్ మందుల తయారీ, విక్రయం, పంపిణీపైనా ఆంక్షలు విధించింది. ఈ కాంబినేషన్ మెడిసిన్‌ను నాలుగేళ్లలోపు చిన్నారులకు ఉపయోగించకూడదని స్పష్టం చేసింది.డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డు నిపుణుల కమిటీ సూచనల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కాంబినేషన్ ఔషధాల వల్ల చిన్నారుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఫిక్స్‌డ్ డోస్ ఔషధాలను నాలుగేళ్లలోపు చిన్నారులకు వినియోగించకూడదని, ఆ ఔషధాల లేబుల్, ప్యాకేజీ, ప్రచార సామగ్రిపై తయారీదారులు స్పష్టమైన హెచ్చరికను ప్రదర్శించాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా, గతంలోనూ పలు ఫిక్స్‌డ్ డోస్ ఔషధాలను కేంద్రం బ్యాన్ చేసింది. రెండు లేదా అంతకంటే ఎక్కువ వాటిని నిర్ణీత మోతాదులో కలిపి ఫిక్స్‌డ్ డోస్ ఔషధాలను తయారు చేస్తారు.

# ఆఖరులో హంసపాదు

**చివరి నిమిషంలో డీల్ బ్రేక్ • టారిఫ్‌లను భరించేందుకు సిద్ధమైన కెనడా**

**వాషింగ్టన్(జనంసాక్షి):**వాణిజ్య ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కెనడా జరుపుతోన్న వాణిజ్య చర్చలు చివరి నిమిషంలో విఫలమయ్యాయి. వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి కెనడా నిరాకరించడంతో చర్చలు నిలిచిపోయాయి. దీంతో కెనడా నుంచి దిగుమతి చేసుకునే 20 బిలియన్ల విలువైన వస్తువులపై 50 శాతం సుంకాలు విధించనున్నట్లు అగ్రరాజ్యం ప్రకటించింది. కెనడా ప్రతి ఏడాది ఆ దేశానికి ఎగుమతి చేసే సుమారు 5 శాతం వస్తువులపై ఇవి ప్రభావం చూపుతాయి. వీటన్నింటికీ సిద్ధమైన కెనడా.. చర్చల నుంచి వైదొలిగింది.'ఈ వారం ప్రారంభంలో అంగీకరించిన నిబంధనల ప్రకారం వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి కెనడా నిరాకరించింది. మా మార్కెట్‌లోకి వస్తువులను ఎగుమతి చేసే దేశాలన్నింటిలోనూ.. కెనడాకు అత్యుత్తమ ప్రాధాన్యత ఇస్తామని ప్రతిపాదించినప్పటికీ వారు అంగీకరించలేదు. వారు కొత్త డిమాండ్లు లేవనెత్తడంతోపాటు మా నిబంధనల నుంచి వెనక్కి తగ్గడం వల్ల చర్చలు దెబ్బతిన్నాయి' అని అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమీసన్ గ్రీర్ పేర్కొన్నారు. అమెరికా ప్రకటనపై కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ స్పందిస్తూ.. అగ్రరాజ్యం ప్రతిపాదించిన నిబంధనలలో చివరి నిమిషంలో చేసిన మార్పులు ఆర్థికంగా



భారంగా, అన్యాయంగా ఉన్నాయని పేర్కొన్నారు. తాము కూడా అదే స్థాయిలో ప్రతీకార టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల నాటినుంచే కెనడా 51వ రాష్ట్రంగా చేరాలని ట్రంప్ డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే. దీన్ని కెనడా సర్కారు ఖండిస్తూ వస్తోంది. తమ దేశం అమ్మకానికి లేదంటూ గట్టిగా చెప్పింది. ఈ క్రమంలోనే అధికారంలోకి వచ్చిన తర్వాత పొరుగుదేశంపై ట్రంప్ సుంకాలతో విరుచుకుపడుతున్నారు. ప్రతిగా కెనడా కూడా టారిఫ్‌లు విధిస్తోంది.

## భారత్‌లో మారుమూల గ్రామాలకూ స్టార్‌లింక్ సేవలు: ఎలాన్ మస్క్

**వాషింగ్టన్:** స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ ద్వారా భారత్‌లో ఇప్పటిదాకా డేటా సేవలు అందని ప్రాంతాలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకూ సేవలందిస్తామని స్పేస్‌ఎక్స్ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ తెలిపారు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో డోజ్‌డిజైనర్ అనే ఖాతాలో వచ్చిన పోస్ట్‌పై మస్క్ ఇలా స్పందించారు. '2026 మే నాటికి 11,256 భారతీయ గ్రామాల్లో 4జీ కవరేజీ లేద'ని డోజ్‌డిజైనర్ పోస్ట్ పేర్కొంది. '2026 మార్చికి భారత్‌లో 109.3 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదార్లున్నారు.



ఇందులో 44.08 కోట్ల కనెక్షన్లు గ్రామాల్లో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 100 మందిలో 48.31 మందికే మొబైల్ చందా ఉండగా, పట్టణాల్లో ఇది 126.80 శాతంగా ఉంద'ని ఆ పోస్ట్ తెలిపింది. భారత్‌లో శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలను అందించడం కోసం స్టార్‌లింక్ తాజాగా దరఖాస్తు చేసిందన్న వార్తల మధ్య మస్క్ ఇలా పేర్కొన్నారు. జెన్ 2 శాటిలైట్ నెట్‌వర్క్ కోసం స్టార్‌లింక్ చేసిన దరఖాస్తును 'ద ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ అథరైజేషన్ సెంటర్' గతంలో తిరస్కరించింది. భారత ప్రమాణాలకు అనుగుణంగా నెటవర్క్ ఫీచర్లు, రేడియో ఫ్రీక్వెన్సీలు లేకపోవడం ఇందుకు కారణం.



## ఇళ్ల విక్రయాల్లో హైదరాబాద్‌కు
# ఫుల్ డిమాండ్

**హైదరాబాద్(జనంసాక్షి):**
దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో ఇళ్ల విక్రయాలు తగ్గుముఖం పట్టాయి ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 91,729 యూనిట్ల విక్రయాలు జరిగాయి. గతేడాది ఇదే కాలంలో నమోదైన 97,674 యూనిట్లతో పోలిస్తే ఇళ్ల విక్రయాలు 6 శాతం మేర తగ్గాయి. ఈ మేరకు హౌసింగ్ బ్రోకరేజ్ విభాగం ప్రాప్‌టైగర్ తన అధ్యయనంలో వెల్లడించింది. హైదరాబాద్, చెన్నైలో మాత్రం ఇందుకు భిన్నంగా ఇళ్లకు డిమాండ్ పెరిగింది. దేశంలోని 8 ప్రధాన నగరాల నివాస మార్కెట్‌పై ప్రాప్‌టైగర్ అధ్యయనం చేసింది. ముఖ్యంగా ముంబయి మెట్రోపాలిటన్ రీజియన్‌లో -7 శాతం, దిల్లీ ఎన్‌సీఆర్‌లో-7 శాతం, బెంగళూరులో-9 శాతం, పుణె-21 శాతం, కోల్‌కతా-9 శాతం, అహ్మదాబాద్-20 శాతం మేర ఇళ్ల విక్రయాలు పడిపోయాయి. పశ్చిమాసియాలో అనిశ్చితి పరిస్థితుల వల్ల కొనుగోలుదారులు అప్రమత్తత పాటిస్తున్నారని నివేదిక పేర్కొంది. ఏఐ ప్రభావంతో ఉద్యోగాలు పోవడం ఓ కారణంగా తెలిపింది. హైదరాబాద్‌తో పాటు చెన్నైలో ఇళ్ల విక్రయాలకు డిమాండ్ పెరిగింది. చెన్నైలో గరిష్ఠంగా 36 శాతం డిమాండ్ పెరిగి 5,283 నుంచి 7,183కు ఇళ్ల విక్రయాలు పెరిగాయి. హైదరాబాద్‌లో 15 శాతం వృద్ధితో 11,513 నుంచి 13,196 యూనిట్లు పెరిగాయి.

## మొబైల్ తయారీకి రూ.62,500 కోట్ల ప్రోత్సాహకాలు

**రూ.10,000 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీలకే అర్హత**

దిల్లీ: దేశంలో మొబైల్ ఫోన్ల తయారీని పెంచడానికి, స్వదేశీ బ్రాండ్‌లను బలోపేతం చేయడానికి రూ.62,500 కోట్ల ప్రోత్సాహకాలతో తలపెట్టిన మొబైల్ ఫోన్ తయారీ పథకం (ఎంపీఎంఎస్) మార్గదర్శకాలను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. 2026 ఏప్రిల్ 1 నుంచే ఇది అమల్లోకి వచ్చినట్లు పరిగణిస్తామని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. ఎంపీఎంఎస్ పథకాన్ని 2 విభాగాలుగా విభజించారు. మొబైల్ ఫోన్ల తయారీకి ప్రోత్సాహకాలు ఇవ్వడం ఒకటైతే, దేశీయ మొబైల్ బ్రాండ్‌లకు మద్దతు ఇవ్వడం రెండోది. దేశీయంగా తయారీ/అసెంబ్లింగ్‌తో 2025-26లో రూ.10,000 కోట్ల టర్నోవర్ సాధించిన అంతర్జాతీయ మొబైల్ కంపెనీలూ ఈ పథకం కింద అర్హత పొందుతాయి. కనీసం 51% భారతీయ యాజమాన్యం కలిగిన ఈఎంఎస్, మొబైల్ కంపెనీలకు 2025-26లో రూ.1000 కోట్ల టర్నోవర్ ఉన్నా ఈ పథకంలో పాల్గొనడానికి అవకాశం కల్పించారు. వీరికి ఒక సంవత్సరం పాటు జెస్టేషన్ పీరియడ్ కూడా లభిస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న బ్రాండ్‌లు 2025-26 విక్రయాలకు అదనంగా ఏటా కనీసం రూ.5,000 కోట్ల అదనపు అమ్మకాలను సాధించాలి. అంటే 2026-27లో రూ.5000 కోట్లు, 2027-28లో రూ.10,000 కోట్లు, 2028-29లో రూ.15000 కోట్లు, 2029-30లో రూ.20,000 కోట్లు, 2030-31లో రూ.25,000 కోట్ల అదనపు విక్రయాలు అవసరం. కొత్త బ్రాండ్ అయితే, మనదేశంలో వార్షికంగా రూ.10,000 కోట్ల మొత్తం విక్రయాలను సాధించిన తర్వాతే ఈ పథక ప్రయోజనాలకు అర్హత ఉంటుంది. 2026-27, 2027-28 సంవత్సరాల్లో అర్హత కలిగిన విక్రయాలకు 2.75% ప్రోత్సాహకాలు ఇస్తారు.

# యాపిల్‌లో లేఆఫ్‌లు.. 'సిరి'పై ఎఫెక్ట్

**వాషింగ్టన్(జనంసాక్షి):**ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ దాదాపు 200 మంది ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించింది. ఈ కోతలు ప్రధానంగా సిరి డిజిటల్ అసిస్టెంట్ (రాతితీతి), విజన్ ప్రో హెడ్‌సెట్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాఫ్ట్‌వేర్ విభాగాల్లో జరిగాయి. ఇందులో విజన్ ప్రో హార్డ్‌వేర్ విభాగం నుంచి దాదాపు 100 పోస్టులు, సిరి, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ బృందాల నుంచి మరో 100 పోస్టులను తొలగించినట్లు తెలుస్తోంది. విజన్ ప్రో కోసం గేమింగ్ ఫీచర్లను డెవలప్ చేస్తోన్న విభాగాన్ని కంపెనీ పూర్తిగా మూసివేసింది.కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగానే ఈ మార్పులు చేస్తున్నట్లు యాపిల్ స్పష్టం చేసింది. అయితే, సంస్థలో కొత్త ఉద్యోగాలను సృష్టించడంతో పాటు.. ఈ లేఆఫ్స్ వల్ల నష్టపోయిన సిబ్బంది సంస్థలోని ఇతర విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొంది. యాపిల్ ప్రస్తుతం సిరి కోసం సరికొత్త ఏఐ ఆధారిత వెర్షన్‌ను డెవలప్ చేస్తోంది. దీనికి సాంకేతిక నైపుణ్యాలు కలిగిన సిబ్బంది అవసరం కావడంతో, ప్రస్తుత బృందంలో మార్పులు చేపట్టింది. అలాగే యాపిల్ డివైజ్‌లలో ఏఐ ఫీచర్లను పర్యవేక్షించే ఇంటెలిజెంట్ సిస్టమ్స్ ఎక్స్‌పీరియన్స్ విభాగంలోనూ మార్పులు జరుగుతున్నట్లు సంస్థ తెలిపింది.మరోవైపు, విజన్ ప్రో కోసం ఇమ్మెర్సివ్ వీడియోలకు మిలియన్ డాలర్ల ఖర్చువుతోంది. కానీ దీని వినియోగదారుల సంఖ్య పరిమితంగా ఉండటంతో కంపెనీపై ఆర్థిక ఒత్తిడి పెరిగింది. అందుకే ఇకపై సొంతంగా నిర్మించే కంటెంట్‌ను తగ్గించి, ఇతర తయారీ సంస్థలను ప్రోత్సహించాలని యాపిల్ నిర్ణయించింది. విజన్ ప్రో, విజన్‌ఓఎస్ డెవలప్‌మెంట్‌ను కొనసాగిస్తూనే, భవిష్యత్తులో 'స్మార్ట్ గ్లాసెస్'పై యాపిల్ మరింత దృష్టి పెట్టనుంది. 2028 చివరి నాటికి కొత్త విజన్ ప్రో మోడల్‌ను తీసుకొచ్చే అంశాన్ని పరిశీలిస్తోంది.



## పెద్ద సంస్థలకు వేగంగా జీఎస్‌టీ రిజిస్ట్రేషన్!

**ఒకే రకమైన పత్రాలకు కేంద్రం, రాష్ట్రాల కసరత్తు**

**దిల్లీ:** నెలకు రూ.2.5 లక్షలకు పైగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) పొందే పెద్ద వ్యాపార సంస్థల జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తులను వేగవంతం చేసేందుకు ఉమ్మడి మార్గదర్శకాలపై కేంద్ర, రాష్ట్ర పన్ను అధికారులు కసరత్తు చేస్తున్నారు. వివిధ రాష్ట్రాలు, కేంద్ర జీఎస్‌టీ విభాగాల మధ్య పత్రాల సమర్పణలో ఏకరూపత తీసుకురావడం ద్వారా, దరఖాస్తుల ప్రాసెసింగ్ సమయాన్ని తగ్గించడమే దీని ప్రధాన లక్ష్యం. కేంద్రం, అన్ని రాష్ట్రాల ఆమోదం పొందాక, ఈ ప్రతిపాదనను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన సమావేశమయ్యే జీఎస్‌టీ మండలి ఆమోదం కోసం ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు. బెంగాల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహించిన నేషనల్ ట్యాక్సేషన్ సమిట్‌లో సీబీఐసీ సభ్యుడు (జీఎస్‌టీ) సంజయ్ మంగళ్ ఈ వివరాలను వెల్లడించారు. ఉమ్మడి ఎస్‌ఓపీ, సర్క్యులర్ దిశగా: ప్రస్తుతం పెద్ద వ్యాపారాల రిజిస్ట్రేషన్‌లో కేంద్రం, రాష్ట్రాల పన్ను విభాగాల మధ్య అవసరమైన పత్రాల విషయంలో ఏకరూపత లేదు. ఇందువల్ల పన్ను చెల్లింపుదారుల్లో అనిశ్చితి నెలకొంటోందని సంజయ్ మంగళ్ పేర్కొన్నారు. అధికారులు, వ్యాపారవేత్తలకు స్పష్టతనిచ్చేలా ఒకే రకమైన సర్క్యులర్/ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)ను రూపొందిస్తున్నారు. దేశంలో ప్రస్తుతం 1.68 కోట్ల వ్యాపార సంస్థలు జీఎస్‌టీ కింద నమోదై ఉన్నాయి. చిన్న, తక్కువ రిస్క్ ఉన్న వ్యాపారాల కోసం తీసుకొచ్చిన సరళీకృత విధానం ద్వారా ఇప్పటికే 65% రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
23 ఆగస్టు 2026



*శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ పరిధి అంజయ్య నగర్ లో కూలిన ఏడంతస్తుల మేడ నగరాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న శేరిలింగంపల్లి పట్టణ ప్రణాళిక విభాగం అవినీతి పండి అది కట్టలుగా తెంచుకొని ఏడంతస్తుల మేడను భూస్థాపితం చేసింది. ఈ భవనం తాలూకు భయానక దృశ్యాలు స్థానికులను బెంబేలెత్తించగా పలువురి జీవితాలలో మాత్రం తీరని విషాదఛాయలను పులమడం దురదృష్టకరం.*

# అంజయ్య నగర్‌లో ఒక్కసారిగా కుప్పకూలిన భవనం

### *ఏడంతస్తుల భవనం కుప్పకూలి ఇద్దరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు*

- 50 గజాల స్థలంలో నిర్మాణంపై హైడ్రా ఆరా
- బిల్డర్ సాజిద్ పరారీలో ఉన్నట్లు రంగనాథ్ వెల్లడి
- అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు: హైడ్రా చీఫ్
- ఆ అధికారులపై కఠిన చర్యలకై స్థానికుల డిమాండ్



**శేరిలింగంపల్లి, ఆగస్టు 22 (జనంసాక్షి):** గచ్చిబౌలి పరిధి అంజయ్యనగర్‌లో నాలా పక్కన నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా కుప్పకూలడంతో ఇద్దరు కార్మికులు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. భవనం కూలి పక్కనే ఉన్న మరో అపార్ట్‌మెంట్‌ను ఢీకొనడంతో అది కూడా దెబ్బతింది. భారీ నిర్మాణం నిమిషాల వ్యవధిలో కుప్పకూలడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, డీఆర్ఎఫ్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న మధ్యప్రదేశ్‌కు చెందిన ఉమేష్ కారే (34), మెహత్ (42) మృతదేహాలను వెలికితీశారు. మరో వ్యక్తిని తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి నిర్మాణం, అనుమతులు, ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. కేవలం 50 గజాల స్థలంలోనే ఈ భవనాన్ని నిర్మిస్తున్నట్లు గుర్తించామని, చుట్టుపక్కల హాస్టళ్లు ఉన్నాయని తెలిపారు. బిల్డర్ సాజిద్ ఈ భవనాన్ని నిర్మించి విక్రయిస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించామని, ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. ప్రమాదానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అంజయ్యనగర్‌లోని అక్రమ నిర్మాణాలపై సమగ్రంగా చర్యలు చేపడతామని తెలిపారు. కాగా, నాలాను ఆనుకుని ఉన్న కేవలం 50 గజాల స్థలంలో ఏడంతస్తుల భవనానికి అనుమతులు ఎలా వచ్చాయన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. కనీస సెట్‌బ్యాక్స్, పటిష్టమైన పునాదులు లేకుండానే ఇలాంటి భారీ నిర్మాణాలు చేపడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. అంజయ్యనగర్‌లో 40 నుంచి 60 గజాల స్థలాల్లో ఆరు నుంచి ఎనిమిది అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణ అనుమతులు, పట్టణ ప్రణాళిక విభాగం పర్యవేక్షణపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాద స్థలాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కూడా సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. 50 గజాల స్థలంలో ఏడంతస్తుల భవనం నిర్మించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇది లా ఉండగా, అంజయ్యనగర్‌లోని అక్రమ నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులపై బాధ్యత నిర్ధారించాలని స్థానికులు కోరుతున్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### 50 గజాలలో ఏడంతస్తుల భవనమా!?

శేరిలింగంపల్లి మాదాపూర్ ఐటీ కారిడార్ నేడు కాసులు కురిపించే బంగారు బాతుగా మారడంతో ఓవైపు భవన నిర్మాణదారులు ఎంత కక్కుర్తి పడుతున్నారో అంతకుమించి సిఐసిని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అక్రమాలను పెంచి పోషిస్తూ నిబంధనలకు తిలోదకాలిస్తున్నారు. మాదాపూర్ అంజయ్య నగర్ ప్రాంతం ఇప్పటికీ వివాదాస్పదంగానే కొనసాగుతున్నప్పటికీ అక్కడ కేవలం 40, 50, 60 గజాల స్థలంలో 6 నుండి 8 అంతస్తులు నిర్మిస్తుండడం భవన నిర్మాణదారుల బరితెగింపు, అధికారుల అక్రమాల పరాకాష్టకు అద్దం పడుతుంది. సాధారణంగా 50 గజాల స్థలంలో జీ ప్లస్ వన్ ఇంటికి సైతం అనుమతులు లభించని పరిస్థితి. ఈ పరిస్థితులలో నాలాను ఆనుకొని ఉన్న 50 గజాల స్థలంలో కనీస సెట్ బ్యాక్స్, సరైన పునాదులు లేకుండానే ఏకంగా ఏడంతస్తుల భవనం, దానిపై మరో పెంట్ హౌస్ నిర్మించడం సభ్య సమాజాన్ని తీవ్ర గందరగోళం లోకి నెడుతోంది. శేరిలింగంపల్లి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ ఎంత స్థాయికైనా దిగజారి అనుమతులను మంజూరు చేస్తున్నట్లు సర్వత్రా ఆరోపణలు వస్తున్నాయి.



### పట్టణ ప్రణాళికను బర్తరఫ్ చేయండి

శేరిలింగంపల్లి జోన్, సర్కిల్ పరిధిలో గత దశాబ్దాలుగా అవినీతి రాజ్యమేలుతోందని, ఇక్కడి అధికారులు అంతా పూర్తిగా అక్రమాలను పెంచి పోషిస్తూ ఓవైపు ప్రజల జీవితాలతో, మరోవైపు ప్రభుత్వ ఖజానాతో చెలగాటమాడుతూ ఆర్థిక నేరస్తులుగా ఎదిగిపోతున్నారని పలువురు సామాజికవేత్తలు, స్థానికులు దుమ్మెత్తి పోస్తున్నారు. ఇలాంటి ఘటనలు జరిగిన ప్రతిసారి తాము నెత్తినోరు మొత్తుకున్నా ఉన్నతాధికారుల నిర్లక్ష్య ధోరణి, కోట్ల రూపాయల వాటాల పంపిణీలతో ఎవరూ వీరిని కదిలించకపోవడం గమనార్హం. ఇంతలా అవినీతి మకిలి అంటించుకున్న అధికారులను ఉన్నఫలంగా బర్తరఫ్ చేసి వారి ఆస్తులను తక్షణమే జప్తు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

## రూ.75 వేల లంచం డిమాండ్.. ఏసీబీకి చిక్కిన ఎస్ఐ

- రూ.20 వేలు నగదు స్వీకరిస్తూ రెడ్‌గా హ్యాండెడ్ పట్టుబడ్డ అధికారులు
- కానిస్టేబుల్, స్టేషన్ రైటర్ ఖాతాలకు రూ.10 వేల చొప్పున ఆన్‌లైన్ బదిలీ
- ముగ్గురిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్న ఏసీబీ




**శేరిలింగంపల్లి, ఆగస్టు 22 (జనంసాక్షి):** చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లంచం వ్యవహారం వెలుగుచూసింది. ఓ కేసులో అనుకూలంగా వ్యవహరించేందుకు రూ.75 వేలు డిమాండ్ చేసిన ఎస్ఐను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శనివారం పట్టుకున్నట్లు తెలిపారు. ఏసీబీ వెల్లడించిన వివరాల ప్రకారం.. చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న బందెల బాలరాజు క్రైమ్ నంబర్ 696/2026 కేసులో సానుకూలంగా వ్యవహరించేందుకు సంబంధిత వ్యక్తుల నుంచి రూ.75 వేలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో రూ.20 వేలను నగదుగా స్వీకరించగా, కానిస్టేబుల్ రాజ్‌కుమార్, స్టేషన్ రైటర్ బొత్తా రాఘవేందర్ చెరో రూ.10 వేల చొప్పున ఆన్‌లైన్ ద్వారా స్వీకరించినట్లు ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. మిగిలిన మొత్తాన్ని కూడా ఇవ్వాలని డిమాండ్ చేయడంతో బాధితులు ఏసీబీని ఆశ్రయించినట్లు తెలిపారు. పథకం ప్రకారం రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ఎస్ఐ బాలరాజును నగదు స్వీకరిస్తుండగా పట్టుకున్నారని, ఆయన టేబుల్ డ్రాలో ఉన్న నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఎస్ఐతోపాటు కానిస్టేబుల్, స్టేషన్ రైటర్ పాత్రపై కూడా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ముగ్గురినీ రంగారెడ్డి జిల్లా ఎస్పీఈ, ఏసీబీ కోర్టులో హాజరుపరిచి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## 35 ఏళ్లుగా తాగునీటి తిప్పలు.. సల్బత్తాపూర్ గోడు తీరేనా?

- ఎన్నో ప్రభుత్వాలు మారినా సమస్యకు శాశ్వత పరిష్కారం కరవు
- ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత
- సమస్యపై విచారణకు అధికారులకు కలెక్టర్ ఆదేశం
- అంచనాలు సిద్ధం చేసి నివేదిక ఇవ్వాలని సూచన

**బంట్వారం, ఆగస్టు 22 (జనంసాక్షి):** బంట్వారం మండలం సల్బత్తాపూర్ గ్రామంలో 35 ఏళ్లుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యపై అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు మారినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, దీంతో ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సిములు జిల్లా కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం సమర్పించారు. సల్బత్తాపూర్‌లో దశాబ్దాలుగా తాగునీటి సమస్య ఉన్నప్పటికీ శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కలెక్టర్ సమస్యపై తక్షణ విచారణ జరిపి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. జడ్పీ సీఈఓ సుధీర్ సమక్షంలో సంబంధిత ఇంట్రా ఈఈ రవికుమార్, బంట్వారం ఏఈడబ్ల్యూఈ ధీరజ్‌లకు ఫోన్, వాట్సాప్ ద్వారా సమాచారం అందించారు. గ్రామానికి శాశ్వత మంచినీటి సరఫరా కల్పించేందుకు అవసరమైన పనులకు అంచనాలు సిద్ధం చేసి త్వరితగతిన నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు సమాచారం. కలెక్టర్ ఆదేశాలతోనైనా 35 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందేమోనని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## బొల్లారంలో అక్రమ ఆయుధాల ముఠా గుట్టురట్టు.. నిందితుడి అరెస్టు



**మల్కాజిగిరి ఆగస్టు 22 (జనంసాక్షి) :** అక్రమంగా తుపాకులు తీసుకొచ్చి నగరంలో విక్రయించేందుకు యత్నిస్తున్న ఓ వ్యక్తిని మల్కాజిగిరి జోన్ ఎస్‌వోటీ, బొల్లారం పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. నిందితుడి నుంచి 3 తుపాకులు, 19 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. నేరెడ్ మెట్ లోని మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ లో కమిషనర్ సుమతి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పర్భాన్స్ కుమార్ (27) పటాన్‌చెరు పరిధిలోని బిహార్ బస్తీలో ఉంటూ కూలీ పనులు చేస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో గతంలో గంజాయి, గంజాయి చాక్లెట్ల విక్రయాలు సాగించాడు. ఈ క్రమంలో 2024లో చెర్లపల్లి పోలీసులు అరెస్టు చేశారు. జైలు నుంచి వచ్చిన తర్వాత, యూపీ నుంచి తక్కువ ధరకు తుపాకులు తీసుకొచ్చి హైదరాబాద్‌లో అవసరమైన వ్యక్తులకు ఎక్కువ ధరకు విక్రయించాలని పథకం రచించాడు. ఇందుకోసం ఈ నెల 10న యూపీకి వెళ్లి సోను అనే వ్యక్తి వద్ద రెండు 9 ఎంఎం పిస్టల్స్, 3 మ్యాగజైన్లు, 17 లైవ్ రౌండ్లు, ఒక డబుల్ బ్యారెల్ తపంచా, 2 లైవ్ రౌండ్లు కొనుగోలు చేశాడు. వాటిని నగరానికి తీసుకువచ్చి బొల్లారంలోని సాధన మందిర్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా, విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద ఉన్న ఆయుధాలను జప్తు చేసి, ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశామని తెలిపారు.

## కంపెనీలు తేలేకపోతే.. భూములు రైతులకు తిరిగివ్వండి

- మొబిలిటీ వ్యాలీలో స్థానికులకు ఉపాధి కల్పించాలి
- భూములు తీసుకున్నప్పుడు రైతుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలి
- 1100 ఎకరాల ప్రాంతాన్ని సందర్శించిన సబిత, మెతుకు ఆనంద్
- రైతుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్



**మోమిన్‌పేట, ఆగస్టు 22 (జనంసాక్షి):** మొబిలిటీ వ్యాలీ కోసం రైతుల నుంచి సేకరించిన భూముల్లో కంపెనీలను ఏర్పాటు చేసి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించలేని పక్షంలో ఆ భూములను తిరిగి రైతులకు అప్పగించాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వారు ఎన్కతల గ్రామంలో ఏర్పాటు కానున్న 1,100 ఎకరాల మొబిలిటీ వ్యాలీ ప్రాంతాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. భూముల సేకరణ, పరిహారం, ప్రస్తుత పరిస్థితులపై రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మెతుకు ఆనంద్ మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో రైతులకు తగిన పరిహారం అందిస్తూ వారి ప్రయోజనాలను కాపాడేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అభివృద్ధి కోసం రైతుల భూములను తీసుకున్నప్పుడు పరిహారంతోపాటు వారి కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. మొబిలిటీ వ్యాలీలో త్వరితగతిన కంపెనీలను ఏర్పాటు చేసి స్థానిక రైతులు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కంపెనీలను తీసుకురావడం చేతకాకపోతే రైతుల భూములను తిరిగి వారికి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. అభివృద్ధి అవసరమే అయినప్పటికీ రైతుల ప్రయోజనాలు, భూములకు తగిన పరిహారం, వారి కుటుంబాల భవిష్యత్తును విస్మరించరాదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టమైన విజన్‌తో రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ నాగేందర్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు డి.వెంకట్, సర్పంచులు పటేల్ శ్రీకాంత్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, కిష్టయ్య, దేవస్థానం మాజీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి తదితర బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు, పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

## నో మ్యాప్డ్ ఓటర్లకు నోటీసులు

**పత్రాలతో విచారణకు హాజరు కావాలి**

*నిర్ణీత గడువులో ప్రక్రియ పూర్తి చేయాలి: డీసీ శంకర్*

**ఖైరతాబాద్, ఆగస్టు 22 (జనంసాక్షి):** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో భాగంగా గత సవరణతో అనుసంధానం కాని (నో మ్యాప్డ్) ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నట్లు జూబ్లీహిల్స్ సర్కిల్-36 డిప్యూటీ కమిషనర్ శంకర్ తెలిపారు. గత సవరణలో ఎలాంటి అనుసంధానం లేని ఓటర్లతోపాటు వివరాల్లో తార్కిక వ్యత్యాసాలు, ఇతర అసమానతలు ఉన్నవారికి నోటీసులు ఇచ్చి విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు విచారణ సమయంలో ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల ధ్రువపత్రాల్లో అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు. ఓటరు జనన తేదీ ఆధారంగా సమర్పించాల్సిన పత్రాలు మారుతాయని తెలిపారు. 1987 జూలై 1కు ముందు జన్మించిన వారు తమకు సంబంధించిన 12 రకాల పత్రాల్లో ఏదో ఒకదాన్ని సమర్పించాలి. 1987 జూలై 1 నుంచి 2004 డిసెంబర్ 2 మధ్య జన్మించిన వారు తమకు సంబంధించిన ఒక పత్రంతోపాటు తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరికి సంబంధించిన పత్రాన్ని అందించాలి. 2004 డిసెంబర్ 2 తర్వాత జన్మించిన వారు తమకు సంబంధించిన ఒక పత్రంతోపాటు తల్లి, తండ్రి ఇద్దరికీ సంబంధించిన పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని డీసీ వివరించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత సమయంలో విచారణకు హాజరై అవసరమైన ధ్రువపత్రాలను అందించాలని కోరారు. అర్హత కలిగిన ఓటర్ల పేర్లు జాబితాలో కొనసాగేందుకు అవసరమైన ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని డీసీ శంకర్ సూచించారు.

## కోటి 75 లక్షల విలువైన హాషీష్ ఆయిల్ పట్టివేత


**ఇద్దరు నిందితుల అరెస్టు, బైక్, ఫోన్లు స్వాధీనం**



**మల్కాజిగిరి ఆగస్టు 22 (జనంసాక్షి) :** ఓడిశా నుంచి నగరానికి అక్రమంగా తరలిస్తున్న భారీ హాషీష్ ఆయిల్ ముఠా గుట్టును ఎల్‌బీనగర్ ఎస్ఓటీ, నాగోలు పోలీసులు సంయుక్తంగా రట్టు చేశారు. సుమారు 1.75 కోటి 75 లక్షల విలువ చేసే 14.2 కిలోల హాషీష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. నేరెడ్ మెట్ లోని మల్కాజిగిరి కమిషనరేట్ కార్యాలయంలో కమిషనర్ సుమతి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడిచారు. విశ్వసనీయ సమాచారం మేరకు గౌరెల్లి రోడ్డులో నాగోలు పోలీసులు, ఎల్‌బీనగర్ ఎస్ఓటీ బృందం సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బైక్‌పై అనుమానాస్పదంగా వెళున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వారి వద్ద నుంచి 14.2 కిలోల హాషీష్ ఆయిల్, ఒక యమహా బైక్, రెండు మొబైల్ ఫోన్లు 2,500 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులు తల్లే నాగరాజు (30), నాగుల నారాయణ అలియాస్ కిరణ్ (39)గా గుర్తించారు. నిందితులిద్దరిపై గతంలోనూ గంజాయి అక్రమ రవాణా కేసులు ఉన్నట్లు వెల్లడించారు. నగరంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, డ్రగ్స్ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిందితుల నుండి ద్విచక్ర వాహనం, సెల్ ఫోన్ లు, నగదు, ఆశిష్ ఆయిల్ స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించామని తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఓటీ, నాగోలు పోలీసు అధికారులను ఆమె అభినందించారు.

## కాగ్నా నది బ్రిడ్జి అధ్వానం...రెండేళ్లలోనే రెండు పెద్ద గుంతలు

*చర్యలు తీసుకోకుంటే ఆందోళనే : బిజేపి జిల్లా అధ్యక్షులు యు. రమేష్ కుమార్*



**తాండూరు (జనంసాక్షి):** పట్టణసమీపంలోని కాగ్నా నది బ్రిడ్జిని శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షులు యు. రమేష్ కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బ్రిడ్జి ప్రారంభించి రెండు సంవత్సరాలు కూడా కాలేదు, అప్పుడే రెండు పెద్ద బొక్కలు పడ్డాయని, సంవత్సరానికి ఒక బొక్క చొప్పున పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది నాసిరకం నిర్మాణానికి నిదర్శనమని అన్నారు. ఈ నిర్మాణంలో కాంట్రాక్టర్, సంబంధిత అధికారులు, రాజకీయ నాయకులు, గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వంలో ఎవరు అక్రమాలకు పాల్పడినా, సరైన విధంగా నిర్మించకుండా నిర్లక్ష్యం వహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 28వ వార్డ్ కౌన్సిలర్ నాగారం మల్లేశం, జిల్లా నాయకులు బంటారం భద్రేశ్వర్, పటేల్ విజయ్ కుమార్, మల్లికార్జున్ బండారి, శ్రీకాంత్, దోమ కృష్ణ, చిదిరి ప్రకాష్, ప్రభాకర్ గౌడ్, బబ్లు, శివాజీ, రమేష్, సాగర్, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమాలు ఆపండి

### *కొనసాగిస్తే భారీ ప్రతిఘటన తప్పదు: ఆర్.కృష్ణయ్య*

- బీసీ, ఎస్సీ, ఎస్టీల హక్కులను కాపాడేందుకు పోరాటం
- రిజర్వేషన్లతోనే సామాజిక న్యాయం సాధ్యం
- యువతను రెచ్చగొట్టే ప్రయత్నాలు సరికాదు



**ముషీరాబాద్, ఆగస్టు 22 (జనంసాక్షి):** బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగిస్తే భారీ స్థాయిలో ప్రతిఘటన ఉద్యమాలు చేపడతామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. శనివారం హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనలను ఆయన తప్పుబట్టారు. రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమాలను వెంటనే విరమించుకోవాలని, లేనిపక్షంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. దేశ జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు శతాబ్దాలుగా విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబాటుకు గురయ్యారని, స్వాతంత్ర్యానంతరం అమలులోకి వచ్చిన రిజర్వేషన్లతోనే ఆయా వర్గాల్లో కొంత అభివృద్ధి ప్రారంభమైందని అన్నారు. బీసీల జనాభా 56 శాతం ఉన్నప్పటికీ 34 ఏళ్లుగా 19 శాతం రిజర్వేషన్లకే పరిమితమయ్యారని, ఇప్పటికీ అన్ని రంగాల్లో అన్యాయం కొనసాగుతోందని పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక అసమానతల ను తొలగించేందుకు రిజర్వేషన్లు కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం, కుల వివక్ష, అవినీతి వంటి సమస్యలపై పోరాడాల్సిన యువతను రిజర్వేషన్ అంశం పేరుతో రెచ్చగొట్టడం సరికాద''న్నారు. దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాల్సిన సమయంలో సమాజంలో విభేదాలు సృష్టించే ప్రయత్నాలు దేశ ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు. గతంలో 1986, 1990లో మండల్ కమిషన్ సందర్భంగా జరిగిన రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమాలను ప్రస్తావిస్తూ, అలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమకారులు ఆలోచించాలని ఆర్.కృష్ణయ్య సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### *రూ.2.50 లక్షల సొంత నిధులతో రాజరాజేశ్వరి నగర్‌లో సీసీ కెమెరాలు*

- కాంగ్రెస్ పాలనలో తాగునీరు, విద్యుత్ సమస్యలు మళ్లీ వచ్చాయి
- రూ.100 కోట్ల అభివృద్ధి పనులను రద్దు చేశారు
- ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్నా: తలసాని



**సనత్‌నగర్, ఆగస్టు 22 (జనంసాక్షి):** ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరిస్తోందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు. శనివారం రాజరాజేశ్వరి నగర్‌లో తన సొంత నిధులు రూ.2.50 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. కాలనీలో శాంతిభద్రతల పర్యవేక్షణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, రాత్రివేళల్లో అపరిచితులు, ఆకతాయిల కదలికలను గుర్తించేందుకు వీలవుతుందని తెలిపారు. 2014కు ముందు రాజరాజేశ్వరి నగర్‌లో రోడ్లు, డ్రైనేజీ సదుపాయాలు సక్రమంగా ఉండేవి కావని, తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కోట్లాది రూపాయలతో దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రిజర్వాయర్ నిర్మాణంతోపాటు రహదారుల అభివృద్ధి, విస్తరణ పనులు చేపట్టామని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాగునీరు, విద్యుత్ సమస్యలు మళ్లీ తలెత్తాయని ఆరోపించారు. నల్లాలకు నీరు ఇవ్వడానికి లేదంటున్న ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా విక్రయించేందుకు నీరు ఎలా లభిస్తోందని ప్రశ్నించారు. చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి కూడా నిధులు లేవని అధికారులు చెబుతున్నారని, అలాంటప్పుడు ప్రజా పాలన అని ఎలా చెప్పుకుంటారని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో ఫతేనగర్ ఫ్లైఓవర్ విస్తరణ, సనత్‌నగర్ పారిశ్రామిక ప్రాంతంలో అండర్‌పాస్ నిర్మాణానికి రూ.100 కోట్లతో చేపట్టిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు. కరోనా అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ వైద్య అవసరాల కోసం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, 2022లో సనత్‌నగర్, అల్వాల్, కొత్తపేటలో టిమ్స్ ఆస్పత్రులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణం దాదాపు 80 శాతం పూర్తయిందని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిత్యం ప్రజల మధ్య ఉంటూ పనిచేస్తున్నానని తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కాలనీ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చార్జిషీట్ నుంచి తీర్పు వరకు.. టైమ్‌లైన్ తప్పొద్దు

- ప్రతి దశను నిరంతరం పర్యవేక్షించాలి
- బలమైన సాక్ష్యాలతో కేసులను పకడ్బందీగా నడపాలి
- సమన్వయంతోనే న్యాయపరమైన విజయాలు
- అవినీతికి తావులేకుండా విధులు నిర్వహించాలి



**గోదావరిఖని, ఆగస్టు 22 (జనంసాక్షి):** నేరస్తులకు శిక్షలు పడేలా చేయడంలో కోర్టు డ్యూటీ, కోర్టు లైజనింగ్ పోలీసు అధికారుల పాత్ర కీలకమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. శనివారం సీపీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో కోర్టు డ్యూటీ, కోర్టు లైజనింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. దర్యాప్తు ప్రారంభం నుంచి చార్జిషీట్ దాఖలు, కోర్టు విచారణ, సాక్షుల హాజరు, తుది తీర్పు వరకు ప్రతి దశను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని సూచించారు. చార్జిషీట్ దాఖలుకు ముందు సీడీ ఫైల్, సంబంధిత పత్రాలను పూర్తిగా పరిశీలించాలని, కీలక కేసులను ముందుగానే గుర్తించి ఎస్‌హెచ్‌ఓలకు సమాచారం ఇవ్వడంతోపాటు సాక్షులను ట్రయల్‌కు ముందే బ్రీఫింగ్ చేయాలని ఆదేశించారు. ఏపీపీలు, పీపీలు, కోర్టు లైజనింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపరచాలన్నారు. సమన్లు, వారెంట్లు, సీసీడీ వివరాలను సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసి, తీర్పు కాపీలు అందిన వెంటనే అప్‌లోడ్ చేయాలని సూచించారు. కోర్టు, పోలీస్‌స్టేషన్ రికార్డుల్లోని నాన్‌బెయిలబుల్ వారెంట్ల వివరాలు ఒకే విధంగా ఉండేలా తనిఖీ చేయాలని తెలిపారు. సంచలనాత్మక కేసుల ట్రయల్ షెడ్యూల్‌ను ముందుగానే ఉన్నతాధికారులకు తెలియజేయాలని, అవసరమైన చోట ఈ-సమన్లు జారీ చేయాలని, ఈ-సంతకం చేసిన ఎఫ్ఐఆర్‌ల స్వీకరణపై మేజిస్ట్రేట్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కేసుల దర్యాప్తు, విచారణలో అనవసర జాప్యం పోలీసుశాఖకు నష్టం కలిగిస్తుందని, ఉద్దేశపూర్వక ఆలస్యంతో న్యాయ ప్రక్రియ బలహీనపడే అవకాశం ఉందన్నారు. ప్రతి కేసు పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ బలమైన సాక్ష్యాధారాలతో న్యాయస్థానంలో సమర్థవంతంగా వాదనలు జరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పోలీసుశాఖ బృందంగా పనిచేసే వ్యవస్థని, దర్యాప్తు అధికారులు, కోర్టు సిబ్బంది, స్టేషన్ సిబ్బంది, పర్యవేక్షణ అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే విజయవంతమైన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. కోర్టు ప్రాంగణంలో అవినీతికి ఎలాంటి స్థానం ఉండకూడదని, ప్రతి ఒక్కరూ నిజాయితీ, పారదర్శకతతో విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. గత రెండు, మూడు నెలల్లో కోర్టు కేసుల పర్యవేక్షణలో పురోగతి సాధించామని, అదే స్థాయిని కొనసాగించేందుకు మరింత క్రమశిక్షణతో పనిచేయాలని అన్నారు. అనంతరం పలు కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా కీలక పాత్ర పోషించిన కోర్టు డ్యూటీ సిబ్బంది, లైజనింగ్ అధికారులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, తాండూర్ సీఐ దేవయ్య, లైజనింగ్ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్లు అనిల్‌కుమార్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌గౌడ్, ఎస్ఐలు వినీత, సంతోష్, సీసీ సందీప్, కోర్టు డ్యూటీ సిబ్బంది, లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

# చొప్పదండి పోలీస్‌స్టేషన్‌లో సీపీ ఆకస్మిక తనిఖీ

- పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి
- సీసీటీఎన్ఎస్‌లో వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలి
- సాంకేతికతను విధుల్లో విస్తృతంగా వినియోగించాలి
- రౌడీ, హిస్టరీషీటర్లపై నిఘా పెంచాలి



**చొప్పదండి, ఆగస్టు 22 (జనంసాక్షి):** కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శనివారం చొప్పదండి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ సిబ్బంది విధులు, బాధ్యతలపై ఆరా తీసి రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, నమోదైన కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్-2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఈ-సమన్స్, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య తదితర సాంకేతిక అప్లికేషన్లపై పూర్తి అవగాహన పెంచుకుని విధుల్లో విస్తృతంగా వినియోగించాలని సూచించారు. స్టేషన్‌కు కేటాయించిన పరికరాలను పరిశీలించడంతోపాటు బ్లూకోల్ట్స్ సిబ్బంది పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ పరికరం వినియోగాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఎఫ్ఐఆర్ ఇండెక్స్, పెండింగ్ కేసులను పరిశీలించి, జాప్యానికి కారణాలను తెలుసుకుని త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణతోపాటు విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్టేషన్ పరిధిలోని గ్రామాలను సెక్టార్లు, సబ్ సెక్టార్లుగా విభజించి ప్రతి ప్రాంతానికి గ్రామ పోలీసు అధికారులను కేటాయించాలని సూచించారు. రౌడీ, హిస్టరీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రతి నెల తాజా వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, చొప్పదండి సీఐ ప్రదీప్‌కుమార్, ఎస్ఐ నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యం



**మల్యాల ఆగస్టు 22 (జనం సాక్షి) :** మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో రజక మరియు మాల కుల సంఘ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా నిర్మించిన వంటగదిని శనివారం స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు.అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యేకు మండల ప్రజా ప్రతినిధులు నాయకులు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు.కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాస్,ఎంపీడీవో స్వాతి,ఎంఈఓ జయ సరసింహారావు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్,ఓబులాపూర్ సర్పంచ్ గ్యాదాం కుమార్,ఉపసర్పంచ్ పొన్నం మల్లేశం గౌడ్,మాజీ సర్పంచులు బండి రవి గౌడ్,గుగ్గిళ్ల తిరుపతి, మొండయ్య,గడ్డం నర్సింహా రెడ్డి,మాజీ ఎంపిటిసి పందిరి రజిత శేఖర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శనిగారపు తిరుపతి,ప్యాక్స్ చైర్మన్లు నేరెళ్ల సతీష్ రెడ్డి, కొల్లూరి గంగాధర్,రామ్ లింగారెడ్డి,సర్పంచులు దారం ఆదిరెడ్డి, మిట్టి శ్రీనివాస్, సంధ్య తిరుపతి రెడ్డి, గుర్రం విజయ్, శ్వేత, జంగిల్ హనుమంతు నాయకులు దొంగ ఆనందరెడ్డి,వెల్మ లక్ష్మా రెడ్డి, కనకట్ల జలంధర్, మ్యాక లక్ష్మణ్,ముత్యాల నర్సింహా రేడ్డి, అంంజి రెడ్డి,ముదాం శ్రీనివాస్,నల్ల తిరుపతి రెడ్డి,చేటుపల్లి నరేష్ నాగులపేట సంజీవ్,అనిల్,మర్రి లక్ష్మణ్, మాల, రజక సంఘం సభ్యులు గ్రామప్రజలు పాల్గొన్నారు.

# అంగన్వాడి పిల్లలపై ప్రైవేటు పాఠశాలల కన్ను!


- తగ్గుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య
- అంగన్వాడి నుంచి ప్రైవేటు బడులకు మళ్లింపుపై ఆరోపణలు
- అడ్మిషన్లపై క్షేత్రస్థాయి తనిఖీలు అవసరం
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలి



**గంభీరావుపేట, ఆగస్టు 22 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా అంగన్వాడి కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించేందుకు కొందరు నిర్వాహకులు తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంగన్వాడి కేంద్రాల నుంచి ప్రాథమిక పాఠశాలల్లో చేరే పిల్లల వివరాలు, వారి అడ్మిషన్లపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ప్రైవేటు పాఠశాలలు గుర్తింపు, అడ్మిషన్లు, వయస్సు నిర్ధారణ తదితర అంశాల్లో విద్యాశాఖ, ఆర్టీఈ నిబంధనలను పాటిస్తున్నాయా? అనే దానిపై క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే సంబంధిత చట్టాలు, విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గుర్తింపు లేని పాఠశాలల నిర్వహణపైనా అధికారులు దృష్టి సారించాలన్నారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కేవలం అడ్మిషన్ డ్రైవ్‌లకే పరిమితం కాకుండా మౌలిక వసతులు, నాణ్యమైన బోధన, ఉపాధ్యాయుల అందుబాటు, తల్లిదండ్రుల్లో ప్రభుత్వ విద్యపై విశ్వాసం పెంచే చర్యలు చేపట్టాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. అంగన్వాడి నుంచి ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే పిల్లల వివరాలను పరిశీలించి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి గల అసలు కారణాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# కాళేశ్వరంలో ఒక్క బ్లాక్ మాత్రమే కుంగింది

- ఏడో బ్లాక్‌పైనే నాణ్యతపై అభ్యంతరాలు : జీవన్‌రెడ్డి
- అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు బాగున్నాయని నివేదిక
- కన్నెపల్లి వద్ద కాఫర్ డ్యాంతో నీటిని ఎత్తిపోసుకోవాలి
- రాజకీయ బేషజాలు వీడి రైతులకు నీరందించాలని డిమాండ్



**సిరిసిల్ల టౌన్/ ముస్తాబాద్, ఆగస్టు 22 (జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక్క బ్లాక్ మాత్రమే కుంగిందని, మిగతా నిర్మాణాలను వినియోగించుకునే విషయంలో ప్రభుత్వం రాజకీయ బేషజాలకు పోకుండా రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే టి. జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ముస్తాబాద్‌లోని బీఆర్ఎస్ మండల కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితి, రైతులకు సాగునీటి అందుబాటుపై మాట్లాడారు. కేంద్ర జలవిద్యుత్ పరిశోధనా సంస్థ నివేదికను ప్రస్తావిస్తూ మేడిగడ్డలోని ఏడో బ్లాక్ నాణ్యతపైనే అభ్యంతరాలు ఉన్నాయని, మిగతా బ్లాక్‌లతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు బాగున్నట్లు నివేదికలో పేర్కొన్నారని తెలిపారు. ప్రాజెక్టులో సమస్య ఉన్న ఒక బ్లాక్ కారణంగా మొత్తం వ్యవస్థను పక్కనపెట్టి ఉత్తర తెలంగాణ రైతులకు సాగునీరు అందకుండా చేయడం సరికాదన్నారు. కాళేశ్వరం ద్వారా రైతులకు అందాల్సిన నీటిని ప్రత్యామ్నాయ మార్గాల్లో వినియోగించుకునే అవకాశాలను ప్రభుత్వం పరిశీలించాలని కోరారు.

కన్నెపల్లి పంప్‌హౌస్ దిగువన కాఫర్ డ్యాం నిర్మించి ప్రాణహిత నది జలాలను ఎత్తిపోసేలా చర్యలు చేపట్టవచ్చని జీవన్‌రెడ్డి సూచించారు. ఇందుకోసం సుమారు రూ.100 కోట్లతో కాఫర్ డ్యాం నిర్మాణం పూర్తిచేసే అవకాశం ఉందని, దీనివల్ల అందుబాటులో ఉన్న నీటిని ఎగువ ప్రాంతాలకు తరలించి రైతులకు ప్రయోజనం కల్పించవచ్చని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లోనే ప్రాణహిత జలాలను రైతులకు అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రెండో పంటకు కూడా సాగునీటి భరోసా కల్పించేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు, వాతావరణ మార్పుల నేపథ్యంలో సాగునీటి లభ్యతపై రైతుల్లో ఆందోళన నెలకొనకుండా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వివిధ నివేదికలను సాకుగా చూపుతూ నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం చేయడం వల్ల చివరకు రైతులే నష్టపోతారని జీవన్‌రెడ్డి అన్నారు. సాగునీటితోపాటు ఉత్తర తెలంగాణలో భవిష్యత్తులో తాగునీటి అవసరాలు కూడా పెరిగే అవకాశం ఉన్నందున అందుబాటులో ఉన్న జల వనరులను సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి ప్రాణహిత నీటిని ఎత్తిపోసే అవకాశాలపై ఇంజినీరింగ్ నిపుణులతో పరిశీలన జరిపి సాధ్యమైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం వెంటనే స్పందించి నీటి వినియోగానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రాజెక్టు విషయంలో రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా రైతులకు నీరు అందించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేయాలని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. గతంలో తమ పార్టీ నాయకులు కన్నెపల్లి పంప్‌హౌస్, కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితిపై పలు సూచనలు చేసినప్పటికీ వాటిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా నిపుణుల సూచనలు, అందుబాటులో ఉన్న నివేదికలను పరిశీలించి రైతులకు ప్రయోజనం చేకూరేలా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టకపోతే రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డంప్ యార్డులో చెత్త వేసినందుకు రూ.10,000 జరిమానా

*మంథని: మంథని మున్సిపాలిటీ పరిధిలోని డంప్ యార్డులో నిబంధనలకు విరుద్ధంగా చెత్త వేసిన వ్యక్తికి మున్సిపల్ అధికారులు రూ.10,000 జరిమానా విధించినట్లు మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా, నిర్దేశించిన ప్రదేశాల్లోనే చెత్తను వేయాలని అధికారులు సూచించారు. మున్సిపల్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.*

## కమ్యూనిటీ కిచెన్ ప్రారంభానికి పకడ్బందీ ఏర్పాట్లు

- 24న మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి : కలెక్టర్ కోయ శ్రీహర్ష
- శాఖల మధ్య సమన్వయంతో కార్యక్రమం నిర్వహించాలి



**మంథని, ఆగస్టు 22 (జనంసాక్షి):** మంథని పట్టణంలోని గంగాపూర్‌లో ఇస్కాన్, హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కిచెన్‌ను పరిశీలించి వంటశాల, ఆహార తయారీ, నిల్వ, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సౌకర్యాలను పరిశీలించారు. ఆగస్టు 24న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి చేతుల మీదుగా కిచెన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. కిచెన్‌లో పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన ఆహారాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేయాలని ఆదేశించారు. పార్కింగ్, భద్రత, విద్యుత్, తాగునీరు తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పర్యటనలో మంథని ఆర్డీవో సురేష్, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, కమిషనర్ మనోహర్, తహసీల్దార్ ఆరిపోద్దిన్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# లక్షల్లో పేకాట.. ఓడిపోయి రోడ్డుపై రచ్చ

- రెండు జిల్లాల సరిహద్దుల్లో గుట్టల మధ్య జోరుగా జూదం?
- నిఘా కొరవడటంతో పేకాటరాయులకు అడ్డాగా మారిన ప్రాంతం
- రూ.2 లక్షల బెట్టింగ్‌లో తేడాతో ఘర్షణ జరిగినట్లు సమాచారం
- సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా పెంచాలని స్థానికుల డిమాండ్

**మర్రిగూడ, ఆగస్టు 22 (జనంసాక్షి):** నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో పేకాట జోరుగా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్ గ్రామపంచాయతీ పరిధి, నల్లగొండ జిల్లా మర్రిగూడ, చింతపల్లి మండలాల సరిహద్దుల్లోని తమ్మడపల్లి గ్రామ శివార్ల గుట్టలు జూదగాళ్లకు అడ్డాలుగా మారినట్లు స్థానికులు చెబుతున్నారు. నిర్మానుష్య ప్రాంతం కావడంతోపాటు రెండు జిల్లాల సరిహద్దుకు సమీపంలో ఉండటం, పోలీసుల నిఘా తక్కువగా ఉండటం పేకాట నిర్వాహకులకు కలిసివస్తోందని సమాచారం. మర్రిగూడ, చింతపల్లి మండలాలకు చెందిన కొందరు వ్యక్తులు ఇక్కడ పెద్ద మొత్తాల్లో పేకాట ఆడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సుమారు 15 రోజుల క్రితం ఇదే ప్రాంతంలో దాదాపు రూ.2 లక్షల మేర బెట్టింగ్ జరిగినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఆటలో నగదు పంపకాలకు సంబంధించి తేడా రావడంతో సుమారు 20 మంది మధ్య వాగ్వాదం జరిగి, చివరకు రోడ్డుపై ఘర్షణకు దిగినట్లు సమాచారం. పేకాటతో మొదలైన వివాదం కొట్టుకునే స్థాయికి చేరడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి జూద స్థావరాలపై నిఘా లేకపోతే యువత కూడా వ్యసనానికి గురయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేకాటతో పాటు మద్యం అలవాట్లు పెరిగి అప్పులపాలై కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెట్టే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొంటున్నారు. లక్షల్లో బెట్టింగ్‌లు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో సంబంధిత పోలీసులు సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, పేకాట స్థావరాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. రెండు జిల్లాల పరిధికి సంబంధించిన ప్రాంతం కావడంతో నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పోలీసులు సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

## నవాబుపేట్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ స్నేహ మెహ్రా

- ప్రహరీగోడ, షటిల్ కోర్టు ప్రారంభం
- గ్రామాల సీసీ కెమెరాలను స్టేషన్‌కు అనుసంధానం
- ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి
- నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



**నవాబుపేట్, ఆగస్టు 22 (జనంసాక్షి):** నవాబుపేట్ పోలీస్‌స్టేషన్‌ను వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా శనివారం సందర్శించారు. నూతనంగా నిర్మించిన ప్రహరీగోడతోపాటు షటిల్ కోర్టును ప్రారంభించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, సాధ్యమైనంత వరకు కేసుల వరకు వెళ్లకుండా సత్వర పరిష్కారం చూపాలని ఎస్ఐకి సూచించారు. గత ఏడాది నమోదైన కేసులు, వాటి దర్యాప్తు, రికార్డుల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలని, రహదారి భద్రతలో భాగంగా హెల్మెట్ వినియోగం, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. రాత్రివేళల్లో గ్రామాల్లో గస్తీ పెంచి దొంగతనాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. యావపూర్‌లో 20, నవాబుపేట్‌లో 16, గొల్లగూడలో 12, పులుమామిడిలో 14, కొజ్జావనంపల్లిలో 16, ముబారక్‌పూర్‌లో 28 సీసీ కెమెరాలను పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానించారు. దీంతో ఆయా గ్రామాల్లోని పరిస్థితులను స్టేషన్ నుంచే పర్యవేక్షించే అవకాశం ఏర్పడింది. సీసీ కెమెరాలు శాంతిభద్రతల పరిరక్షణతోపాటు నేరాల నియంత్రణ, దర్యాప్తులో ఉపయోగపడతాయని ఎస్పీ పేర్కొన్నా రు. పోలీస్ సిబ్బంది సంక్షేమం, స్టేషన్ భద్రత, సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ నర్సింలు, మోమిన్‌పేట్ సీఐ వెంకట్, నవాబుపేట్ ఎస్ఐ గిరి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సిబ్బంది పనితీరును ఎస్పీ అభినందించారు.

## ప్రసవ వేదనలో ఆగిన గుండె.. అరుదైన శస్త్రచికిత్సతో తల్లీబిడ్డకు ప్రాణదానం

- తీవ్ర గుండె వైఫల్యం, కార్డియాక్ అరెస్టుతో ఆస్పత్రికి రాక
- డాక్టర్ దామోదర్‌రెడ్డి గౌని నేతృత్వంలో విజయవంతమైన చికిత్స

**కరీంనగర్ బ్యూరో, (జనంసాక్షి):** ప్రసవ సమయంలో తీవ్ర గుండె వైఫల్యంతోపాటు కార్డియాక్ అరెస్టుకు గురైన ఓ యువతికి హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రి వైద్యుల బృందం అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి తల్లీబిడ్డ ఇద్దరి ప్రాణాలను కాపాడింది. డాక్టర్ దామోదర్‌రెడ్డి గౌని నేతృత్వంలో వైద్య బృందం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో చికిత్స అందించింది. బహుళ అవయవ వైఫల్యంతో ఆస్పత్రిలో చేరిన యువతికి అధునాతన లైఫ్ సపోర్ట్ వ్యవస్థల సహాయంతో చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి బయటపడేలా చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లో డాక్టర్ దామోదర్‌రెడ్డి గౌని మీడియాతో మాట్లాడుతూ.. ఇలాంటి క్లిష్టమైన ప్రసూతి కేసుల్లో ఎక్మో వంటి అధునాతన లైఫ్ సపోర్ట్ వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. సకాలంలో సరైన వైద్య సహాయం అందించడం ద్వారా తల్లితో పాటు శిశువును కూడా కాపాడగలిగామని చెప్పారు. హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రి 2 వేల పడకల క్వాటర్నరీ కేర్ సెంటర్‌గా అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలను భారతీయ ధరల్లో అందిస్తోందన్నారు. అన్ని ప్రధాన వైద్య విభాగాలతోపాటు అత్యాధునిక క్వాటర్నరీ కేర్ సేవలు ఒకే చోట అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ శ్రీనివాసరెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

*రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా.. రక్త పరీక్షలు, ఎక్స్‌రే సేవలపై ఫిర్యాదులు*

- డీఎంహెచ్‌ఓతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్
- నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరిక



**మెట్‌పల్లి, ఆగస్టు 22 (జనంసాక్షి):** మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది పనితీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులను పరిశీలించారు. చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలు, మందులు, పరీక్షల లభ్యతపై వివరాలు తెలుసుకున్నారు. రక్త పరీక్షలు, ఎక్స్‌రే సేవలు సక్రమంగా అందడం లేదని పలువురు రోగులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే డీఎంహెచ్‌ఓతో ఫోన్‌లో మాట్లాడారు. అవసరమైన వైద్య పరీక్షలు, ముఖ్యంగా రక్త పరీక్షలు, ఎక్స్‌రే సేవలు నిరంతరాయంగా అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అవసరమైన వైద్య పరికరాలు, మందులు, మౌలిక వసతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రోగులకు అందించే సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# పెండింగ్ కేసుల పరిష్కారానికి వేగం పెంచాలి

- సమన్లు, వారెంట్ల అమలుపై ప్రత్యేక దృష్టి
- కోర్టు కేసుల వివరాలు ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు
- లోక్ అదాలత్ ద్వారా ఎక్కువ కేసుల పరిష్కారానికి చర్యలు
- సాంకేతిక పరిజ్ఞానంతో వారెంట్ల అమలు: పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 22 (జనంసాక్షి):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న ట్రయల్ కేసులు, వారెంట్లను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అధికారులను ఆదేశించారు. శనివారం కోర్టు డ్యూటీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కోర్టు విధులు, పెండింగ్ కేసులు, సమన్లు, వారెంట్ల అమలు, ఈ--పెట్టీ, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పురోగతిపై సమీక్షించారు. సమన్లు, కోర్టు వారెంట్లను సకాలంలో అమలు చేయడంతో పాటు పెండింగ్ ట్రయల్ కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పరిష్కారమైన కేసుల వివరాలను సంబంధిత ఆన్‌లైన్ వ్యవస్థల్లో ఎప్పటికప్పుడు, ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. ఈ-పెట్టీ కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని, కోర్టు డ్యూటీ అధికారులు సమయపాలన, సమన్వయంతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. వారెంట్ల అమలులో నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్ ద్వారా చట్టబద్ధంగా అందుబాటులో ఉన్న సమాచారాన్ని అవసరమైన మేరకు వినియోగించుకోవాలని సూచించారు. త్వరలో నిర్వహించనున్న లోక్ అదాలత్ నేపథ్యంలో పరిష్కరించదగిన కేసులను ముందుగానే గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కోర్టు డ్యూటీ, దర్యాప్తు అధికారులు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా కోర్టు సంబంధిత విధుల్లో బాధ్యత, ఖచ్చితత్వం పాటించాలని కమిషనర్ గౌష్ ఆలం సూచించారు.

## మంత్రి కొండ సురేఖ ఆత్మ విమర్శ చేసుకోవాలి

**రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాగూర్**

గోదావరిఖని, జనంసాక్షి : హైదరాబాదులోని అసెంబ్లీ సీఎల్పీ మీడియా పాయింట్ వద్ద సహచర ప్రభుత్వ విప్ లు, ఎమ్మెల్యేలతో కలిసి ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ విలేకరుల సమావేశం మాట్లాడారు. కూతురు వాక్యాలతో తనకు సంబంధం లేదని మంత్రి కొండ సురేఖ బుకాయించడం సరికాదన్నారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి చేసిన వీరోచిత పోరాటం ఫలితంగా, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల త్యాగాల ఫలితంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలకమైన మంత్రి పదవిని కట్టబెడితే ఆ పదవిని అనుభవిస్తూనే మరోవైపు ముఖ్యమంత్రిపై, ఆయన సోదరులపై కొండ సురేఖ కుటుంబం విమర్శలకు దిగడం పట్ల ఆత్మ విమర్శ చేసుకోవాలని అన్నారు.కార్యకర్తలు చేసిన కష్టార్జితం వల్ల, మరోవైపు ఎన్నో అవమానాలు, నిర్బంధాలను, కఠినమైన జైలు జీవితాలను అనుభవించిన రేవంత్ రెడ్డి వల్ల కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నగ్నసత్యాన్ని ఎవరు కాదనలేరన్నారు. ఎంతోమంది అర్హులు ఉన్నప్పటికీ సీనియర్ నాయకురాలిగా గుర్తించి బీసీ మహిళగా క్యాబినెట్ మంత్రిగా కొండ సురేఖకు అవకాశం కల్పిస్తే, ఆమె చేసే రాజకీయం చూస్తుంటే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుల, కార్యకర్తల మనసులు ఎంతగానో గాయపడుతున్నాయని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు.

# పాలకుల వైఫల్యాలను నిలదీయడమే పత్రికల బాధ్యత




## హైదరాబాద్‌లో లాంఛనంగా 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్' ప్రారంభం

### ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకం : ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్ ప్రతినిధి, ఆగస్ట్ 22 (జనంసాక్షి)**

ప్రజాస్వామ్య మనుగడకు పాలకులను ప్రశ్నించే పత్రికా స్వేచ్ఛ అత్యంత కీలకమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. విమర్శలను స్వీకరించే ధైర్యం ప్రభుత్వాలకు ఉండాలని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ద హిందూ పత్రిక మాజీ ఎడిటర్ ఎన్ రామ్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ సంగీత బారోచ్, కరవన్ పత్రిక ఎడిటర్ అనంతనాథ్, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్ నుంచి గౌతమ్ లాహిరి, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ విజయ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భారతీయ జర్నలిజం వారసత్వాన్ని, ప్రస్తుత సవాళ్లను ఆయన సోదాహరణంగా వివరించారు. జాతీయోద్యమంలో పత్రికలది చెరగని ముద్ర భారతదేశ నిర్మాణంలో జర్నలిజం ఒక అంతర్భాగమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గుర్తుచేశారు. జర్నలిజం అంటే కేవలం వార్తలు రాయడం కాదని, పౌరులను తీర్చిదిద్దడమని ఆయన చెప్పారు. 1948లో 'శంకర్స్ వీక్లీ'లో తనను నిరంతరం కార్టూన్లతో విమర్శించే శంకర్‌తో అప్పటి ప్రధాని నెహ్రూ "నన్ను కూడా విడిచిపెట్టవద్దు, శంకర్" అన్న మాటలను భట్టి గుర్తుచేశారు.





ఒకప్పుడు పత్రికా సంపాదకుడి పదవికి దేశంలో రెండో అత్యంత ముఖ్యమైన స్థానం ఉండేదని, రామ్‌నాథ్ గోయెంకా లాంటి యజమానులు ప్రభుత్వాలను సైతం సవాలు చేసేవారని ఆయన అన్నారు. నేటి వార్తా సంస్థలు కేవలం బ్యాలెన్స్ షీట్లకు, వాణిజ్య ప్రయోజనాలకు పరిమితం కాకుండా ఆనాటి విశ్వసనీయతను నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాయిస్ క్లోనింగ్ వంటి సాంకేతికతలతో పుకార్లు దేశమంతా వ్యాపిస్తున్న ఈ కాలంలో... జర్నలిస్టులకు అసలైన ఆస్తి 'విశ్వసనీయత' మాత్రమేనని ఉద్ఘాటించారు.

**జిల్లా రిపోర్టర్ల రక్షణే ముఖ్యం**

కొత్తగా ఏర్పాటైన 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్' కేవలం ఒక సంస్థగా మిగిలిపోకుండా, జర్నలిస్టుల భద్రతను, వృత్తిపరమైన ప్రమాణాలను కాపాడే బలమైన వ్యవస్థగా ఎదగాలని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. గ్రామీణ స్థాయిలో, జిల్లాల్లో పనిచేసే రిపోర్టర్ల సంక్షేమంపై ఫెడరేషన్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలలో టీచర్ లేకపోయినా, ఆసుపత్రిలో డాక్టర్ లేకపోయినా, పౌరులు ఇబ్బందుల్లో ఉన్నా ప్రభుత్వానికి ముందుగా తెలిసేది జిల్లా రిపోర్టర్ల ద్వారానే అని, వారే ప్రభుత్వానికి 'అత్యుత్తమ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ' అని ఆయన కొనియాడారు.

**తెలంగాణ గడ్డపై స్వేచ్ఛకు పెద్దపీట**

మనసులోని మాటను నిర్భయంగా వ్యక్తపరిచే స్వేచ్ఛ తెలంగాణ గడ్డ స్వభావంలోనే ఉందని, తమ ప్రభుత్వం ఆ సంప్రదాయాన్ని పూర్తిగా గౌరవిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నెహ్రూ చెప్పినట్లుగానే "మమ్మల్ని కూడా విడిచిపెట్టవద్దు.. స్వేచ్ఛగా మాట్లాడండి, స్వేచ్ఛగా ప్రశ్నించండి. ఆ విమర్శలను వినే ధైర్యం అధికారంలో ఉన్న మాకు ఉంది" అని ఆయన జర్నలిస్టులకు భరోసా ఇచ్చారని అన్నారు. ఈ కాలంలో సమాచార కొరత లేదు.. నమ్మకం కొరత ఉంది. అందరూ ప్రచురించగలిగే పరిస్థితుల్లో జర్నలిస్టు వద్ద అత్యంత విలువైన ఆస్తి ప్రింటింగ్ ప్రెస్ కాదు.. విశ్వసనీయత అని భట్టి విక్రమార్క అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ విజయవంతంగా ముందుకు సాగాలని, దేశవ్యాప్తంగా జర్నలిస్టుల ఐక్యతకు, సంక్షేమానికి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు వేదికగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

> కొత్తగా ఏర్పడిన ఫెడరేషన్ కేవలం మరో సంస్థగా కాకుండా ఒక బలమైన సంస్థగా ఎదగాలి. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తి ప్రమాణాలు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు కృషి చేయాలి. దేశవ్యాప్తంగా జర్నలిస్టుల ఐక్యతకు, సంక్షేమానికి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు వేదికగా నిలవాలి.
>
> ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క







## పవర్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన భట్టి

- ఆధునికత సాంకేతికతపై ప్రదర్శన

**హైదరాబాద్, ఆగస్ట్22 (జనంసాక్షి) :** నగరంలోని నెక్లెస్ రోడ్‌లో పీపుల్స్ ప్లాజాలో పవర్ ఎగ్జిబిషన్–2026 ఘనంగా ప్రారంభమైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో విద్యుత్ రంగంలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికతల ను ప్రదర్శిస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, వినియోగంలో చోటుచేసుకుంటున్న సాంకేతిక మార్పులను ప్రజలకు పరిచయం చేయడం ఈ ఎగ్జిబిషన్ ప్రధాన ఉద్దేశంగా ఉంది. ఎగ్జిబిషన్‌లో విద్యుత్ భద్రతా చర్యలు, పునరుత్పాదక ఇంధన వనరులకు సంబంధించిన ప్రత్యేక ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. స్మార్ట్ మీటరింగ్, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) ఛార్జింగ్ వ్యవస్థలు వంటి నూతన సాంకేతికతలపై సందర్శకులకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలను ప్రజలు ప్రత్యక్షంగా తెలుసుకునేలా ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నారు.
















Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370